# జనబలం

ప్రజలే ప్రభువులు

మే 2025 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



## విద్యా సంస్కరణలపై సీఎం రేవంత్‌కు FDR బృందం నివేదిక



## చంద్రబాబు ఆరోగ్య విజన్, అపోలో హెల్త్ ఆఫ్ ది నేషన్



## పహల్గాం టెర్రరిస్ట్ దాడి

## సామాజిక మధ్యవర్తిత్వ కమిటీలు–గ్రామ న్యాయాలయాలు




# భారత్ తెలివితేటలకు రాజధాని.. యువతే శక్తి కేంద్రం

## ఈ - సమ్మిట్ 6.0 లో జేపీ

భారతదేశం తెలివితేటలకు రాజధాని అని, యువతే రాబోయే కాలానికి శక్తి కేంద్రమని ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దేశాభివృద్ధికి అవసరమైన మార్పు జనాభాలో అత్యధిక సంఖ్యలోని యువతతోనే సాధ్యమన్నారు. రాబోయే కాలంలో 90 శాతానికి పైగా యువతదేనని, సరైన మార్పుల్ని అవగాహనతో సాధించుకోకపోతే ఆ కష్టనష్టాల్ని యువతే ఎక్కువగా భరించాల్సి ఉంటుందన్నారు. నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం, గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, పర్యావరణహిత నూతన సాంకేతికతల వినియోగంతో యువత వేగంగా మంచి ఆదాయాలున్న ఉపాధి అవకాశాలను అందుకోగలరన్నారు. ప్రభుత్వోద్యోగాలు పరిష్కారం అనే భ్రమలో కాలాన్ని వృథా చేసుకోకుండా యువత వాస్తవిక దృక్పథంతో సవాళ్లను ఎదుర్కొంటేనే భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశం కలను నెరవేర్చుకోగలదన్నారు.

వరంగల్ సమీపంలోని బొల్లికుంట వాగ్దేవి కళాశాల ప్రాంగణంలో సంవిన్ సంస్థ, వాగ్దేవి ఇంక్యుబేషన్, బిజినెస్ యాక్సిలరేటర్ (విభా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ- సమ్మిట్ 6.0 కార్యక్రమంలో జేపీ దిశానిర్దేశం చేశారు. భారత ప్రభుత్వ డిపార్ట్ మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ రామనాథన్, ఐఐటీ హైదరాబాద్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ యూబీ దేశాయ్, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, సాంకేతిక నిపుణులు తమ ఆలోచనల్ని, అనుభవాలని పంచుకున్నారు. ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫిజియోథెరపీ, డిగ్రీ విద్యార్థులు, యువ ఇంజినీర్లు, పరిశ్రమల ప్రతినిధులు నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ వేన్ ఓవెన్, స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జేఏ చౌదరి, కళాశాల వ్యవస్థాపకులు, అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ దేవేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వాహినీ దేవి, డైరెక్టర్ డాక్టర్ వాణీదేవి, విభా సీఈఓ సలీం జివాని, సంవిన్ సీఈఓ సాయి కిరణ్, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, సుమారు 2,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.









ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


మే
2025

సంపుటి 26 సంచిక 05


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్


## కార్టూన్ కార్నర్




*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.


06 మత మూర్ఖ దాడులకు అర్థం ఉండదు.. హింసను ఎట్టిపరిస్థితుల్లో సహించకూడదు

07 ఈ మార్పులు తీసుకొస్తే.. ప్రతీ బిడ్డకూ నాణ్యమైన విద్య సాధ్యమే!

15 సీఎం తక్షణ స్పందన అభినందనీయం, కానీ..

20 ముఖ్యమంత్రి అయ్యాకగానీ తత్వం బోధపడలేదట!

29 అసమగ్రంగా చంద్రబాబు ప్రభుత్వ ఆరోగ్య విజన్



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

# రక్తమోడుతున్న కశ్మీర్! కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు!

సంపాదకీయం

కశ్మీర్ లోయలో మరోసారి రక్తం చిమ్మింది. పెహల్గావ్ సమీపంలోని బైసారన్ పచ్చిక మైదానాల్లో ఏప్రిల్ 22న టెర్రరిస్టులు సాగించిన మారణహోమంలో ఇరవయ్యారు మంది పర్యాటకులు బలయ్యారు. ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన తీవ్రవాదుల హీనమైన చర్యను ఐక్యరాజ్యసమితి సహా మొత్తం అంతర్జాతీయ సమాజం ముక్తకంఠంతో ఖండించింది.
వేసవి సెలవులను కుటుంబాలతో ఆనందంగా గడపాలని వచ్చిన అమాయక ప్రజలను హతమార్చిన తీవ్రవాదుల నీచత్వాన్ని ప్రపంచమంతా అసహ్యించుకున్నది.

మతం పేరుతో హింసాకాండను కొనసాగిస్తున్న తీవ్రవాదుల దుర్మార్గాన్ని మత విశ్వాసాలకు అతీతంగా అందరూ నిరసించారు.. ఖండించారు. పాకిస్తాన్ సైతం ఈ నరమేధాన్ని ఖండిస్తూ తమకూ ఈ ఘటనకు సంబంధం లేదని పేర్కొన్నది. దీనిపై సంయుక్త దర్యాప్తుకు లేదా మూడో పక్ష దర్యాప్తుకు సహకరిస్తామని ప్రకటించింది.
"భూమండలం అంచుల వరకూ వెళ్ళి అయినా సరే టెర్రరిస్టులను, వారి మద్దతుదారులను వెంటాడి ఏరి పారేస్తాం, అమాయక ప్రజలను హతమార్చిన వారిని శిక్షిస్తాం, బాధితులకు న్యాయం చేస్తాం" అంటూ భారత్ ప్రధానమంత్రి ప్రకటించారు. ఇండో – పాక్ సంబంధాల్లో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పరస్పర విశ్వాసం దెబ్బతిన్నది. సరిహద్దుల్లో యుద్ధ మేఘాలు కమ్ము కున్నాయి.

పెహల్గావ్లో జరిగిన నరమేధం కేవలం పర్యాటకుల పైనా, వారి కుటుంబాల పైనా చేసిన దాడి మాత్రమే కాదు. ఇది జమ్మూకశ్మీర్ అభివృద్ధి క్రమంపై చేసిన దాడి. రాష్ట్రంలో సాధారణ పరిస్థితుల పునరుద్ధరణ ప్రక్రియపై సాగించిన దాడి. భారత్లో జమ్మూకశ్మీర్ ఏకీకరణ కోసం భారతీయ సమాజం సహనంతో సాగిస్తున్న కృషిపై చేసిన దండయాత్ర. పర్యాటకుల మత విశ్వాసాన్ని అడిగి తెలుసుకుని మరీ చంపడాన్ని బట్టి ఉగ్రవాదుల ఉద్దేశ్యం స్పష్టమే. వారు హిందువులను గురి చేసుకున్నారు.

అయితే మృతుల్లో ఇద్దరు వేర్వేరు మత విశ్వాసాలు కలిగిన వారు ఉండటాన్ని బట్టి తమకు అడ్డం వస్తే ఎవరినైనా చంపడానికి తీవ్రవాదులు వెనుకాడరని కూడా మనం అర్థం చేసుకోవాలి. జమ్మూకశ్మీర్లో పరిస్థితులు సవ్యంగా లేవని నిరూపించడానికి ఉగ్రవాదులు చిరకాలంగా ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతూనే ఉన్నారు. రాష్ట్రంలో తీవ్రవాద హింసాకాండకు సుదీర్ఘ చరిత్ర ఉంది.

కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ గణాంకాలను పరిశీలిస్తే..కశ్మీరులో రక్తపాతం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నదని స్పష్టం అవుతుంది. గత మూడున్నర దశాబ్దాలలో జమ్మూకశ్మీర్లో మొత్తం 145 తీవ్రవాద దాడుల ఘటనలు నమోదు అయ్యాయి. దాడుల్లో భద్రతాదళాల సిబ్బంది 6,413 మంది, పౌరులు 14,930 మంది, తీవ్రవాదులు 23, 386 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రదాడులకు సంబంధించి1999 – 2004 మధ్య 47 ఘటనలు, 2004 – 2014 మధ్య 49 ఘటనలు, 2014 – 2025 మధ్య 35 ఘటనలు నమోదు అయ్యాయి. సాధారణంగా ఏప్రిల్, మే, జూన్, జులై నెలల్లో ఎక్కువగానూ, అక్టోబర్, నవంబర్ నెలల్లో తక్కువగానూ ఘటనలు జరిగినట్లు గమనించవచ్చు.

ఏటా కశ్మీర్ సందర్శనకు దేశ విదేశీ పర్యాటకులు, వైష్ణోదేవీ ఆలయ సందర్శకులు, అమర్నాథ్ యాత్రికులు వచ్చే ముందు తీవ్రవాద ఘటనలు పునరావృతం అవుతున్నట్లు కూడా ఘటనల క్రమాన్ని చూస్తే అర్థం అవుతుంది. విదేశీ ప్రముఖులు భారత్ సందర్శనకు వస్తున్న సందర్భాల్లో కూడ కొన్ని దాడుల సంఘటనలు చోటుచేసుకున్నాయి.2000 సంవత్సరంలో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ సందర్శన సమయంలో ఒకసారి దాడి జరగ్గా, తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పర్యటన సంద ర్భంగా దాడి జరిగింది. తీవ్రవాదుల దాడుల వెనుక దాగిఉన్న లక్ష్యాలు, ఉద్దేశ్యాలు తెలియనివేమీ కాదు. భారత్లో అవిభాజ్యమైన అంతర్భాగంగా ఉన్న జమ్మూకశ్మీర్ అస్తిత్వాన్ని వివాదాస్పదం చేయడమే తీవ్రవాదుల లక్ష్యం. అందుకు వారు మతాన్ని ఒక ఆయు ధంగా వినియోగిస్తున్నారు. ఆ క్రమంలో వారు దాడి చేసి హతమార్చిన వారిలో హిందువులు మాత్రమే ఉన్నారనుకుంటే పొరపాటు.

తమ లక్ష్యాలకు అడ్డు వస్తున్నారని భావించిన ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, క్రైస్తవులను కూడా వారు హతమార్చారని గతంలో జరిగిన ఘటనలు వెల్లడిస్తాయి. 2000 సంవత్సరం మార్చి 20న అనంతనాగ్ జిల్లాలో చిత్తీసింగ్ పోరాలో సాగించిన మారణ హోమంలో పాతికమంది సిక్కులను ఊచకోత కోసిన ఉదంతాన్ని జ్ఞాపకం చేసుకోవాలి.

పఠాన్ కోట్, పుల్వామా ఘటనల తర్వాత భారీ దాడుల సంఘటనలు తగ్గినట్లు కనిపించినా అడపా దడపా చిన్న చిన్న ఘటనలు కొనసాగుతూనే వచ్చాయి. 2023 జనవరి 1,2 తేదీల్లో జరిగిన రాజౌరీ దాడిలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక వైద్యుడు మరణించిన ఉదాహరణ, 2024 అక్టోబరులో సోనామార్గ్ లో జరిగిన దాడిలో వలస కూలీలు సహా ఏడుగురు పౌరులు మృతిచెందిన ఉదంతం కూడా కొనసాగుతున్న తీవ్రవాద హింసకు ఉదాహరణలు. ఇప్పుడు బైసారన్ పచ్చిక మైదానాల్లో జరిగిన తాజా ఘటన దేశాన్ని దిగ్భ్రాంతిలోకి నెట్టింది. భారత్లో భావోద్వేగాలు, ఆవేశాలు, ప్రతీకార భావనలు తీవ్రస్థాయిలో సహజంగానే పెల్లుబికాయి. సామాజిక మాధ్యమాల యుగంలో వాస్తవ, అవాస్తవ విచక్షణ గానీ, వివేచన గానీ లేవన్న యదార్థం కూడా తెలిసినదే.

పాకిస్తాన్ లో చిరకాలంగా తిష్ట వేసుకు కూచున్న జైషే మహమ్మద్, లష్కరే తోయిబా వంటి తీవ్రవాద సంస్థలు జమ్మూ కశ్మీర్ సహా మన దేశంలో పలు తీవ్రవాద దాడులకు పాల్పడిన చరిత్ర మనముందు ఉంది. పాక్ ప్రభుత్వం, పాక్ సైన్యం, పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ సీమాంతర ఉగ్రవాదానికి వెన్నుదన్నుగా ఉంటూ ప్రోత్సహిస్తున్నాయనేది భారత్ చేస్తున్న అభియోగం. దాన్ని పాక్ నిరంతరం తిరస్కరిస్తూ వస్తున్నది. కానీ సీమాంతర ఉగ్రవాదానికి పాక్ ఒక స్థావరంగా ఉంటూ వచ్చిందన్న చారిత్రకవాస్తవం భారత్‌కే కాదు ప్రపంచానికి అంతటికీ తెలుసు.అందుకే అంతర్జాతీయ సమాజం జైషే మహమ్మద్, లష్కరే తోయిబా, వంటి తీవ్రవాద సంస్థలను నిషేధించింది. తీవ్రవాద ముఠాలు, సంస్థలు తమపై నిషేధాలను తప్పించుకోవడానికి తరచూ పాత పేర్లను వదిలి కొత్త పేర్లతో పనిచేయడం కూడా తెలిసిన విషయమే. ఇటీవల కాలంలో "రెసిస్టెన్స్ ఫ్రంట్" పేరుతో పనిచేస్తున్న ముఠా లష్కరే తోయిబా నుండి పుట్టుకొచ్చిన సంస్థ అనేది కూడా ఒక వాస్తవం.

అయితే తాము కూడా ఉగ్రవాద బాధితులమేనని, తీవ్రవాదులు సాగిస్తున్న నరమేధంలో తొంభై వేల ప్రాణాలను పోగొట్టు కున్నామని, 9/11 తర్వాత తమ దేశంలో వచ్చిన మార్పులను గమనించాలని పాక్ వాదిస్తున్నది. బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ పేరిట తీవ్రవాదులు సాగిస్తున్న నరమేధంలో తమ సైనికాధికారులు, సైనికులు, పౌరులు మరణించిన ఉదంతాలను పాక్ ఉదహరిస్తున్నది. అందులో కూడా వాస్తవాలు ఉన్నాయి.

పాకిస్తాన్‌లో రాజ్యేతర శక్తులు, రాజ్యాంగేతర ముఠాలు స్వేచ్ఛగా పనిచేస్తున్నాయి. రాజకీయ కార్యనిర్వాహక వర్గానికి సంబంధం లేకుండా సైన్యం, పాక్ గూఢచారి సంస్థ ఐ.ఎస్.ఐ. రాజకీయ నిర్ణయాలు తీసుకునే ఆనవాయితీ చిరకాలంగా కొనసా గుతున్నది. తమ అంతర్గత పరిస్థితులు సవ్యంగా లేనప్పుడు రాజ్యశక్తులు, ప్రభుత్వాలు రాజ్యేతర శక్తులను వినియోగించే ధోరణి పాక్‌లో కొనసాగడాన్ని గమనించవచ్చు. దానికి మతాన్ని జోడించడం ఒక విధానంగా పాక్ పాటిస్తున్నది. ద్విజాతి సిద్ధాంతంపై ఆధారపడి ఆవిర్భవించిన పాకిస్తాన్ నాటి నుండి నేటివరకూ ఒక పరిణతి కలిగిన నాగరిక ఆధునిక రాజ్యంగా రూపొందటంలో తడబడుతూనే వచ్చింది. తప్పటడుగులు వేస్తూనే ఉన్నది.

ఇండో పాక్ సంబంధాలు సంక్లిష్టం కావడం వెనుక, జమ్మూకశ్మీర్ సమస్య రావణకాష్టంగా రగలడం వెనుక పాక్‌లోని పరస్పర విరుద్ధ శక్తుల స్వభావాలు, ధోరణులు, వైఖరులు కారణం అని చెప్పవచ్చు. అయితే పాక్ స్వరూప స్వభావాలకు భిన్నమైన దేశంగా ఆవిర్భవించిన భారత్ అందుకు అనుగుణంగా వ్యవహరిస్తూ వచ్చింది.

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి నేటివరకూ అధికారంలో ఎవరున్నా పాక్ సంబంధాల విషయంలో, ఉగ్రదాడులు జరిగిన అన్ని సందర్భాల్లోనూ భారత ప్రభుత్వం ధీటుగా స్పందిస్తూనే వచ్చింది. జమ్మూకశ్మీర్ విషయంలో దేశంలోని ప్రధాన జాతీయ రాజకీయ పక్షాలన్నీ ఆచరణాత్మకంగా స్థూలమైన ఏకీభావాన్ని, ఒకే వైఖరిని కలిగివున్నాయి. జమ్మూకశ్మీర్ భారత్‌లో ఒక అవి భాజ్యమైన అంతర్భాగంగా పరిగణిస్తూ వచ్చాయి. భారత్‌లో జమ్మూకశ్మీర్ విలీనాన్ని తిరుగులేని వాస్తవంగా, భారత్ ప్రాదేశిక సమగ్రతలో భాగంగా నిలబెట్టుకుంటూ వచ్చాయి.

తీవ్రవాదుల దాడులు జరిగిన అన్ని సందర్భాల్లోనూ తక్షణ చర్యలుగా దౌత్యాధికారుల, పాక్ పౌరుల బహిష్కరణ, పౌరుల వీసాల రద్దు , సరిహద్దు మార్గాల మూసివేత, సుంకాల భారీ వడ్డింపు, వాణిజ్య ఒప్పందాల రద్దు, ప్రతినిధి బృందాల నిలిపివేత వంటి పలు ప్రతిక్రియాత్మక చర్యలు ప్రభుత్వం చేపడుతూనే వచ్చింది. పలు యుద్ధాలను తట్టుకు నిలిచిన సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ తీసుకున్న తాజా నిర్ణయం ఇరుదేశాల సంబంధాల్లో ఒక నూతనస్థితిని తెచ్చింది. పొరుగుదేశంలోని రాజ్యశక్తుల, రాజ్యేతర శక్తుల దుష్ట చర్యలను వ్యతిరేకించే పేరుతో భారత్‌లో ఒక మతానికి వ్యతిరేకంగా, కశ్మీరీ సమాజానికి వ్యతిరేకంగా భావోద్వేగాలను రెచ్చగొట్టే శక్తులు ప్రస్తుతం క్రియాశీలంగా, ఉత్సాహంగా పనిచేస్తున్నాయి. ఈ శక్తులు అచ్చంగా పాక్‌లోని రాజ్యేతర శక్తులను అనుకరిస్తున్నాయి. దీనివల్ల భారతీయ సమాజంలో అనవసరపు ఉద్రిక్తతలు తలెత్తడంతో పాటు, పాక్ లోని రాజ్యేతర శక్తులకు ప్రాణవాయువు అందుతోంది. భారత సమాజం ఈ విషయంలో తన స్థాయికి తగిన పరిణతిని ప్రదర్శించాల్సి ఉంది.

ఇరుదేశాల మధ్య గతంలో నాలుగైదు సార్లు యుద్ధాలు జరిగాయి.అంతర్జాతీయ సమాజం చొరవతో సంప్రదింపులు జరిగాయి. ఒప్పందాలు జరిగాయి. అయితే రాజ్యేతర శక్తుల జవాబుదారీతనం లేని దుస్సాహసాలు ఇరుదేశాల సాధారణ సంబం ధాలను తరచూ దెబ్బతీస్తూనే వచ్చాయి. వాటికి ప్రభుత్వాలు స్పందించాల్సిన పరిస్థితి తలెత్తుతున్నది. ఇరు సమాజాల మానసికస్థితి కూడా ఉద్రిక్తతలు తలెత్తిన ప్రతిసారీ వాటి ప్రభావాలకు లోనవుతున్నది. మాస్ హిస్టీరియాకు దారి తీస్తున్నది.

జమ్మూకశ్మీర్ సమస్యలో ఇమిడి ఉన్న సంక్లిష్టతను, దాని చారిత్రక వాస్తవికతలను దృష్టిలో ఉంచుకుని ఇరుదేశాల ప్రభు త్వాలు, రాజ్యశక్తులు "రూల్ బుక్"కు అనుగుణంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అంతర్జాతీయ సమాజం కోరుకుంటు న్నది. ఉపఖండంలోని ఉద్రిక్తతలు అంతర్జాతీయ సంబంధాలలోని సమతుల్యతను దెబ్బ తీయరాదని అగ్రరాజ్యాలు భావిస్తున్నాయి.

"ఇరుగుపొరుగున ఉంటున్న రెండు న్యూక్లియర్ దేశాలు సంయమనం పాటించాలి, ఉద్రిక్తతలను సడలించాలి, శాంతికి భంగం కలిగించే చర్యలకు పూనుకోరాదు, దౌత్య మార్గాల ద్వారా, సంప్రదింపులతో సమస్య పరిష్కారానికి ముందుకు రావాలి" అంటూ ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ చేసిన విజ్ఞప్తిని ఇరుదేశాల ప్రభుత్వాలు మన్నించాలి.

డి. సోమ సుందర్

# మత మూర్ఖ దాడులకు అర్థం ఉండదు.. హింసను ఎట్టిపరిస్థితుల్లో సహించకూడదు: జేపీ



కశ్మీర్ పహల్గాం వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తీవ్రంగా ఖండించారు. హింసను ఎట్టి పరిస్థితుల్లో సహించకూడదన్నారు. మతం పేరుతో ఈ దాడి జరిగినా.. ఇస్లాంకి, ఇస్లాం తీవ్రవాదానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఏ మతమూ అమాయకుల ఊచకోతను ప్రోత్సహించదన్నారు.

ప్రపంచంలో ఇండోనేషియా తర్వాత అత్యధిక ముస్లింలున్న దేశం భారత్ అని, మత ప్రాతిపదికనే మన దేశ విభజన జరిగిందని.. హిందూ- ముస్లిం చిచ్చుకే ఈ దాడికి పాల్పడ్డారన్నారు. మత మూర్ఖ దాడులకు కారణాలు వెతకటం అనవసరమన్నారు. కొద్ది సంఖ్యలోని ఉగ్రవాదులు కూడా ఊహించనిరీతిలో దాడులకు తెగబడవచ్చని, దీనిపై రాజకీయం చేయకుండా పార్టీలకతీతంగా దేశమంతా ఐక్యంగా నిలబడి పోరాడాలన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు



భారత్ లో పర్యటిస్తున్నవేళ ఇలాంటి దాడులు చేస్తే, ప్రపంచవ్యాప్తంగా ప్రచారం వస్తుందని టెర్రరిస్టులు భావించి ఉండవచ్చన్నారు. జమ్మూకశ్మీర్ భారత్ లో అంతర్భాగమని స్పష్టంగా చాటేందుకు ఆర్టికల్ 370 రద్దు సరైన నిర్ణయమని, గత అయిదేళ్లుగా అక్కడ అభివృద్ధికి మంచి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఉగ్రవాదాన్ని భౌతికంగా, భావజాలపరంగా తుదముట్టిస్తూనే, అలాంటి తీవ్రవాదులకు ఆశ్రయమిస్తున్న పొరుగు దేశం పాకిస్థాన్ పట్ల ఆచితూచి వ్యవహరించాలన్నారు. అమెరికా లాంటి అగ్రరాజ్యం తనపై 2001 లో 9/11 దాడుల తర్వాత ముందువెనకలు చూసుకోకుండా ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ లను ఆక్రమించి నష్టపోయిందన్నారు. పాకిస్థాన్ లో ఉన్న డీప్ స్టేట్ భారత్ పైకి మత మూర్ఖ ఉగ్రవాదాన్ని ఉసి గొల్పుతున్న మాట నిజమని, అయితే పాక్ సమాజం మొత్తంగా భారత్ పట్ల సుహృద్భావంతో ఉందన్నారు. ఆ తేడాను గుర్తించకుండా దాడులకు భారత్ హడావుడి పడితే తర్వాత చింతించాల్సి వస్తుందన్నారు. సింధు నదీ జలాల బంద్ ద్వారా ఇప్పటికిప్పుడు ఒరిగేదేమీ లేకపోయినా, మన నిరసనను స్పష్టంగా ఆ సంకేతం ద్వారా తెలియ చేశామన్నారు.

ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తూనే, జమ్మూకశ్మీర్ అభివృద్ధిని కొనసాగిస్తూనే, అదను చూసి పాకిస్థాన్ డీప్ స్టేట్ ఆట కట్టించాలని, బెంబేలెత్తిపోకుండా ఈ దిశగా సరిగా స్పందిస్తున్న మన ప్రభుత్వానికి, సైనిక దళాలకు (మే మొదటి వారంలో మెరుపుదాడులు నిర్వహించారు) మనం దరం అండగా నిలవాలని జేపీ విజ్ఞప్తి చేశారు.

## ఈ మార్పులు తీసుకొస్తే..అదనపు ఖర్చు అక్కర్లేకుండా

# ప్రతీ బిడ్డకూ నాణ్యమైన విద్య సాధ్యమే!

**ప్రస్తుత విద్యా వ్యవస్థలో లోపాలు, తీసుకురావల్సిన సంస్కరణలపై ముఖ్యమంత్రి రేవంత్ ఇటీవల హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో FDR, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కూడా పాల్గొన్నారు. పిల్లల అభ్యసన సామర్థ్యాలు, ఒత్తిడిలేని పరీక్షల విధానం ద్వారా బేరీజు, పాఠశాలల్లో పర్యవేక్షణ, టెస్టింగ్, జీవన నైపుణ్యాల పెంపు తదితర అంశాల పరిధిలో పలు మార్పులను సూచిస్తూ జేపీ స్థూల నివేదికను తయారుచేసి FDR బృందంతో సీఎం రేవంత్‌కు అందజేశారు. ఆ నివేదిక జనబలం పాఠకుల కోసం..**

విద్య లాగా సమాజాన్ని సమూలంగా మార్చే శక్తి మరొకటి లేదు. విద్య వ్యక్తులకు నిజమైన నైపుణ్యాలనిస్తుంది. పుట్టుక పరిస్థితులతో సంబంధం లేకుండా ఎదిగే అవకాశాన్ని కల్పి స్తుంది. తమ తలరాతను తామే రాసుకునే సామర్థ్యాన్ని స్తుంది. పేదరికం, అసమానతల భారాన్ని ఎదుర్కోవడానికి పౌరులకు విద్య అనే సాధనాన్ని అందించడంలో రాజ్యం విఫలమైతే ... వ్యవస్థీకృత అన్యాయంలో ఆ ప్రభుత్వం భాగమైనట్లు లెక్క. వ్యక్తులు తమ సామర్థ్యాల్ని ఆవిష్కరిం చుకుని, సమాజంలో ఉత్పాదక భాగస్వాములు కావడానికి పాఠశాల విద్యే బలమైన పునాది. తద్వారానే వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుంది.

పాఠశాల విద్య సమస్యలపై అనేక వాదనలున్నాయి. కొందరు విద్యార్థుల నమోదును (ఎన్‌రోల్‌మెంట్) సమస్యగా చెబుతారు. ఇంకొందరు ఖర్చు గురించి మాట్లాడతారు. కొందరు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతుండగా, మరికొందరు ప్రైవేట్ విద్యను సమర్థిస్తారు. అయితే, మన కర్తవ్యం ఒకే ఒక్క సమూహాన్ని మెరుగుపరచడం కోసం పోరాటడం. ఆ సమూహం – మన దేశ పిల్లలు. విద్యా వ్యవస్థ విఫలమైతే,తమ భవిష్యత్తును మూల్యంగా చెల్లించేవారు పిల్లలు. ఇది అత్యంత ఖరీదైన మూల్యం. కాబట్టి, స్కూలు విద్యని కేంద్రబిందువైన అత్యంత ప్రభావశీల సంస్కరణ కోసం మనం ఎలుగెత్తాలి. ఆ సంస్కరణ – విద్యా ప్రమాణాలు, పిల్లలు ఏం నేర్చుకున్నారు అనేది. మౌలిక వసతులు, ఉపాధ్యాయుల శిక్షణ వంటి అంశాల మీద కూడా మనం దృష్టిని కేంద్రీకరించాలి. కానీ, అసలు పిల్లలు ఏం నేర్చుకుంటున్నారు అనేది మనం విస్మరించినప్పుడు, మిగిలినవన్నీ నిరుపయోగం. ప్రభుత్వ అజ్ఞానం వల్ల సర్కారీ బడుల్లో విద్య అధ్వాన్నంగా ఉందనేది సాధారణ నమ్మిక. అయితే, ప్రయివేటు స్కూళ్లలో కూడా విద్యా ప్రమాణాలు అంతే అధ్వాన్నంగా ఉన్నాయి. అనేక వనరులున్నప్పటికీ, ప్రయివేటు స్కూళ్లు ఫలితాల్లో కొద్దిపాటి మెరుగుదలను




మాత్రమే అదనంగా ప్రదర్శించగలుగుతున్నాయి. అదేవిధంగా, ధనిక, పేద తేడా లేకుండా అన్ని రాష్ట్రాలూ ఇదే సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. కాస్త ఎక్కువ ఆదాయా లున్న రాష్ట్రాలు కూడా ఈ జబ్బుకి అతీతం కాదు. దేశమంతా విద్యా రంగంలోని వారందరికీ వైరస్‌లా ఈ జబ్బు సోకింది.

భారతదేశం సంపన్నదేశంగా వేగంగా ఎదుగుతున్న తరుణమిది. మనలాంటి రాష్ట్రాలు అభివృద్ధి, ప్రగతిలో ముందుండి నడిపించేవి. కానీ మన పూర్తి స్థాయి సామర్థ్యాన్ని నిజంగా ఉపయోగించుకుని, సుస్థిర, సమ్మిళిత వృద్ధిని సాధించాలంటే మనం విద్యకున్న శక్తిని మొదట పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రుల నుండి టీచర్ల వరకు, యాజమాన్యం నుండి ఉద్యోగుల వరకు, ప్రభుత్వం నుండి ఓటర్ల దాకా ఇందులోని భాగస్వాములందరూ తేలికైన ఈ లక్ష్యసాధనకు కలసికట్టుగా పని చేయాలి.

**ఏమిటీ ఈ లక్ష్యం:**

విద్యలో సక్సెస్‌కి నిర్వచనాన్ని మార్చటం, అభ్యసన సామర్థ్య ఫలితాల్ని పెంచటం. ఈ ప్రయత్నానికి నాయకత్వం వహించటంలో మనం ముందుండాలి. మిగతా దేశానికి ఆదర్శంగా నిలవడం ద్వారా దేశ ప్రగతి గతిలో మనదైన ముద్ర వేయడం ద్వారా – మనం సమ్మిళిత అభివృద్ధి శక్తిని చాటాలి. రానున్న దశాబ్దాల్లో, ఈ అభివృద్ధి ఫలాల్ని అందుకోవాలి. ఈ విజన్ లక్ష్యంగా.. ఫలితాల్ని గణనీయంగా మార్చే ఈ దిగువ

ప్రతిపాదనలను మేము సిఫార్సు చేస్తున్నాం. ఈ ప్రతి పాదనలు ప్రభావశీలమైనవి, వెంటనే అమలు చేయగలిగినవి. మన విద్యా వ్యవస్థ ముఖచిత్రాన్ని సమూ




లంగా మార్చగలిగేవి.

**।) ఏం నేర్చుకుంటున్నారు?**

అభ్యసన సామర్థ్యాలను పెంచటానికి అత్యంత ప్రభావ వంతమైన పద్ధతి – పిల్లలు తాము నేర్చుకుంటున్నవాటిని నిజంగా అర్థం చేసుకున్నారో, లేదో ధృవీకరించుకోవటం. వాళ్లు కాన్సెప్ట్‌లని ఏ మేరకు అర్థం చేసుకున్నారు, వాటిని నిత్య జీవితంలో అన్వయించే సామర్థ్యం వారికి ఎంతమేరకు ఉంది అని బేరీజు వేయటం ఇందుకు అత్యుత్తమ మార్గం. ప్రస్తుతం మనం పిల్లల సామర్థ్యాలను అంచనా వేసే పద్ధతి బట్టీ పట్టటం, అలా చదివింది గుర్తుపెట్టుకోవటాన్ని ప్రోత్సహించేదిగా వుంది. తరగతికి తగ్గ సామర్థ్యం లేకపోతే అదే క్లాసులో మళ్లీ చదవాల్సి ఉంటుందనే (డిటెన్షన్) భయం లేకపోవటం, మన వ్యవస్థలో సర్వత్రా విస్తరించిన మాస్ కాపీయింగ్ వల్ల మన పరీక్షలు నిరర్థకంగా తయా రయ్యాయి. నిజంగా తరగతి స్థాయి పరిజ్ఞానం లేకుండానే, పనికొచ్చేదేమీ నేర్చుకోకుండానే విద్యార్థులు ఒక తరగతి నుండి పై తరగతికి క్యూలో నెట్టి నట్లు వచ్చి చేరుతున్నారు. విజయం, మార్కులు, మీడియా హెడ్‌లైన్స్ యావలో పడి మనం మన విద్యా వ్యవస్థ అసలు లక్ష్యమైన – విద్యార్థులకు పరిజ్ఞానం, నైపుణ్యాలను మర్చిపోయాం. మన ప్రస్తుత పరీక్షల పద్ధతిని మార్చాలి. విద్యార్థులకు కాన్సెప్ట్‌లు ఏ మేరకు అర్థమయ్యాయి, వాటిని రోజువారీ జీవితంలో ఎలా వినియోగించగలుగుతున్నారు, సంక్లిష్ట, వినూత్న ఆలోచనలు ఎలా చేయగలుగుతున్నారు, సమస్యలు, పరిష్కార నైపుణ్యాలు ఏ మేరకు ఉన్నాయి – పరీక్షించేలా పరీక్షల పద్ధతిని రూపొందించాలి. ఇవన్నీ సరైన స్థాయిలో ఉంటేనే వాళ్లు ఉపాధి ప్రపంచంలో అవసరమైన నైపుణ్యాల్ని పొందగలుగుతారు. ఒక్కసారి మన లక్ష్యాల్ని ఈ విధంగా మార్చగలిగితే చాలు .. ఈ రంగంలోని వారం దరూ మనం నిర్వచించిన రీతిలో విజయాన్ని సాధించు కునేందుకు ప్రోత్సాహం లభిస్తుంది. మన విద్యార్థులకు నిజమైన, పనికొచ్చే చదువు అబ్బుతుంది. మనం విద్యా ప్రమాణాల్ని పరీక్షించే పద్ధతిని మార్చటానికి ఈ దిగువ మార్పుల్ని చేయటం అవసరం.

**1. అంచనా పద్ధతి**

విద్యార్థులు మెరుగ్గా నేర్చుకోవటానికి, మెరుగైన ఫలితాలు సాధించటానికి పరీక్షకు చిత్తశుద్ధితో హాజరై, తమ నిజమైన అభ్యసన స్థాయిని ప్రదర్శించటానికి మనం వారికి ఒత్తిడి లేని, నిజాయితీ పద్ధతిలో మనం వారికి పరీక్షల్ని నిర్వహించాలి.

ప్రస్తుత బేరీజు పద్ధతిని చూడండి. తరచూ ఒక ప్రతిష్ఠాత్మక స్థాయి పరీక్ష జరుగుతుంటుంది. 'సక్సెస్'కి ఆ పరీక్షలో నెగ్గటమే ఏకైక మార్గమన్నట్లు ఉంటుంది. దీంతో, ఎటు వంటి నిజమైన పరిజ్ఞానమూ లేకుండా మూకుమ్మడి కాపీ కొట్టటం, బట్టీ పట్టటం పద్ధతులకు ప్రోత్సాహం లభిస్తోంది. ఒత్తిడి లేని పరీక్షల విధానం 6వ తరగతి నుండి నిరంతరాయంగా ఉండాలి. వివిధ దశల్లో నిర్వహించే ఈ పరీక్షల్లో ప్రతిభ ప్రాతిపదికన తుది అంచనా ఉండాలి.

**పరీక్షల్ని ఈ కింది తీరున నిర్వహించాలి:**

☞ ఒక విద్యా సంవత్సరంలో అనేక పరీక్షలుండాలి. క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, వార్షిక పరీక్షలు వీటిలో భాగ మవ్వాలి. మొత్తం సిలబస్‌ను కవర్ చేస్తూ, ఆబ్జెక్టివ్, విశ్లేషణాత్మక సమాధానాల ప్రశ్నలు వీటిల్లో ఉండాలి. విద్యార్థిని తుది బేరీజు వేయటం, ఈ పరీక్షలన్నిటిలో ప్రతిభా ప్రదర్శన ఆధారంగా ఉండాలి తప్ప, ఏడాది చివరలో నిర్వహించే ఒక్క పరీక్షమీదే ఆధారపడకూడదు. అభ్యసనంలో తరగతి స్థాయి ప్రమాణాల్ని ప్రదర్శించ గలిగినవారిని మాత్రమే తదుపరి తరగతికి ప్రమోట్



చేయాలి.


☞ విద్యార్థులు నిజంగా ఏం నేర్చుకున్నారో పరీక్షించటానికి మదింపు విధానం మారుస్తుండాలి. కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలను ఏటా 20–25% మేర పెంచాలి. ఈ ప్రశ్నలు

జ్ఞాపకశక్తి ఆధారిత ప్రశ్నల్లా కాకుండా – విద్యార్థులు సంక్లిష్ట ప్రక్రియలో ఆలోచించేలా, తమ పరిజ్ఞానాన్ని అన్వయించేలా ఉంటాయి. కొత్త పంథాలు, ప్రశ్నా పద్ధతుల్ని నమూనాలుగా ఒక సంవత్సరం ముందుగానే విద్యార్థులకు ఇవ్వాలి. దీనివల్ల వాళ్లు ముందుగానే సిద్ధం కాగలుగుతారు.

☞ పరీక్షా విధానంలో మాస్ కాపీయింగ్ విశృంఖలంగా ఉన్నందున మనం జాగ్రత్తలు పాటించాలి. అక్రమాలు, కాపీయింగ్‌ను అరికట్టటానికి, ప్రశ్న, జవాబు క్రమాన్ని ప్రతి విద్యార్థికీ మార్చటం, ప్రశ్నాపత్రాల సెట్స్‌ని తేలిగ్గా గుర్తించకుండా నిరోధించేందుకు క్యూఆర్ కోడ్లు వంటి పద్ధతుల్ని మనం వినియోగించాలి. ఎంతో కీలకమైన ఒత్తిడి ఉంటే 10వ తరగతి బోర్డు పరీక్షలు వంటివాటిలో మనం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిఖార్సయిన నిర్వహణ కోసం స్థానిక పర్యవేక్షణ ఉండేలా చేయాలి.

**2. అదే తరగతిలో కొనసాగించటం (డిటెన్షన్), అనుసంధానం (బ్రిడ్జ్) కోర్సులు**

నో–డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసి, తరగతి సామర్థ్యం లేని వారిని అదే తరగతిలో కొనసాగించే డిటెన్షన్ విధానాన్ని 5, 8 గ్రేడ్లలో తిరిగి ప్రవేశపెట్టాలన్న భారత ప్రభుత్వ నిర్ణయం




సరైన దిశలో ఉంది. ఉపాధ్యాయులు మెరుగ్గా బోధించ టానికి, విద్యార్థులు తమ విద్యా ప్రమాణాలను మెరుగు పరచుకోవటానికి డిటెన్షన్ విధానం ఒక ప్రోత్సాహకంగా పనిచేస్తుంది. కేవలం ర్యాంకులను బట్టి కాకుండా సక్సెస్‌లో భాగంగా తరగతి అభ్యసన ప్రమాణాలపై తిరిగి దృష్టి సారించేలా చేస్తుంది. విద్యార్థులకు మద్దతుగా నిలిచే తగిన పరిష్కార చర్యలతో డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టటం ఎంతో ముఖ్యం. డిటెన్షన్ ఉద్దేశం విద్యార్థిని శిక్షించటం కాదు.

కాన్సెప్ట్‌లలో, నేర్చుకోవటంలో విద్యార్థుల బలహీనతల్ని ముందుగానే గుర్తించి, తగిన అదనపు చర్యలు తీసుకోవటం, ఆ విద్యార్థి పైతరగతులకు వెళ్లాక, ఉపాధి అవకాశాల మార్కెట్‌లోకి ప్రవేశించాక, కాన్సెప్ట్‌ల పరంగా తగిన పరిజ్ఞానం, అవగాహన ఉందని వ్యవస్థపరంగా నిర్ధారిం చటం, విద్యార్థులు నేర్చుకోవటంలోని అంతరాల్ని ముందు గానే గుర్తించి, వాళ్లు తర్వాతి తరగతికి వెళ్ళేలోగా తగిన మద్దతుతో పూరించేందుకు కింది పద్ధతుల్లో డిటెన్షన్ విధానాన్ని రూపొందించాలి :

**5వ తరగతి చివర్లో ముగింపు (ఎగ్జిట్) పరీక్ష :**

విద్యార్థి ఏమేరకు కాన్సెప్ట్‌లను నేర్చుకున్నాడు, అభ్యసన స్థాయి ఏమేరకు ఉంది అని అంచనా వేసేందుకు 5వ తరగతి చివర్లో ఒక ఎగ్జిట్ పరీక్షను నిర్వహించాలి. విద్యార్థి ప్రదర్శనను బట్టి 6వ తరగతి ప్రారంభంలో సహాయపడేలా ఒక మెరుగుదల ప్రక్రియను ఒక అనుసంధాన కోర్సులా అందించాలి. 6వ తరగతి ఆఖరులో విద్యార్థులు డిటెన్షన్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కాబట్టి ఎగ్జిట్ పరీక్షలు, బ్రిడ్జి కోర్సుల ద్వారా తమ అభ్యసన సామర్థ్యాల్లోని అంతరాలను గుర్తించడానికి, తగిన సమయం ఇచ్చినట్లవుతుంది. అదేవిధంగా, వాళ్ల డిటెన్షన్ అవకాశాల్ని తగ్గించేలా తగిన మద్దతు లభిస్తుంది.

**కొత్త బేరీజు పద్ధతిలో సంధానం:**

కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలతో ఒత్తిడిలేని నిరంతర పరీక్షల్ని విద్యార్థులకు ఒక సంవత్సరం ముందుగానే తెలియజేస్తూ పైన పేర్కొన్న సిఫార్సుల్ని ఒక్కసారి అమలుచేస్తే, కొత్త పద్ధతిలో ప్రశ్నలడిగే పరీక్షల విధానానికి అనుగుణంగా మారటానికి వారికి తగిన సమయం లభిస్తుంది. అయినా, తరగతి స్థాయి సామర్థ్యాలను కొత్త బేరీజు విధానానికి అనుగుణంగా ప్రదర్శించలేని విద్యార్థులుంటే, 6వ తరగతి నుండి వారికి డిటెన్షన్ అమలుచేయాలి.

**విద్యార్థుల్ని మెరుగుపరుస్తూ క్రమంగా డిటెన్షన్ విధానం అమలు**

6వ తరగతికి డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాక ఆ తర్వాతి సంవత్సరం పై తరగతికి విస్తరించాలి. మొదటి సంవత్సరం తర్వాత, డిటెన్షన్ విధానం 6, 7 తరగతులకు, అక్కడినుంచీ ప్రతి ఏడాదీ ఒక తరగతి చొప్పున 10వ తరగతి వరకూ విస్తరించాలి. విద్యార్థులు డిటెన్షన్ విధానానికి అలవాటు పడటానికి ఇది దోహదం చేస్తుంది. మొదటి తరగతుల నుండే అభ్యసన సామర్థ్యాలపై దృష్టి సారించటానికి ఉపయోగపడుతుంది.

డిటెన్షన్ పట్ల ఉన్న అపోహల్ని మనం తొలగించాలి. డిటెన్షన్ అనేది మన పిల్లల వైఫల్యానికి సంబంధించిన విషయం కాదు, మన పిల్లలు నేర్చుకునే సామర్థ్యాల మీద దృష్టి పెట్టాలని మేలుకొలిపే ఒక అలారం. సమాజంలోకి, పనిచేసే వర్గంలోకి ప్రవేశించటానికి తగిన సంసిద్ధత బిడ్డకు

కొరవడిందనటానికి అది తొలి హెచ్చరిక. గ్రామీణ విద్యా వ్యవస్థ ప్రాచుర్యంలో ఉన్న తొలినాళ్ళలో, మనమందరం డిటెన్షన్ విధానాన్ని ఎదుర్కొన్నవాళ్ళమే. మనం సరైన ప్రమాణాలతో నేర్చుకోవటంపై దృష్టి పెట్టటం ప్రాధాన్యతను అర్థం చేసుకోవటానికి, కేవలం గుడ్డిగా ఒక తరగతి నుండి పై తరగతికి మారటం ద్వారా విజయం సాధించామని భ్రమపడకపోవటానికి ఈ విధానం ఉపయోగపడింది. మెరుగుదలకు తగిన పరిష్కారాల్ని, మద్దతుని మన పిల్లలకు అందించగలిగితే, చిన్న వయసు నుండే ఈ అంతరాల్ని పూరించటానికి మనకి తగిన సమయం ఉంటుంది. మెరుగైన భవిష్యత్తును అందుకునేలా ఆ బిడ్డను సన్నద్ధపరిచేందుకు సాయపడే అవకాశం లభిస్తుంది. ఒక పరీక్ష తర్వాత ఇంకో పరీక్ష పాసవటం వల్ల సక్సెస్‌కి గ్యారెంటీ లభించదు, నిజమైన అభ్యసన ప్రమాణాల ద్వారానే లభిస్తుంది అని ఒక్కసారి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అర్థమైతే .. ఆ లక్ష్యాన్ని సాధించటానికి తమ పద్ధతుల్ని వాళ్లు మార్చుకుంటారు. డిటెన్షన్ రహిత విధానాన్ని, అభ్యసన ప్రమాణాల బేరీజు పద్ధతుల్ని మార్చటం ఆ లక్ష్యసాధనకు ఉపయోగపడతాయి.

**3) ఇన్‌స్పెక్షన్, పర్యవేక్షణ**

ప్రస్తుత వ్యవస్థలో ఏ రకమైన మార్పులకి సంకల్పించినా, వాటితో పాటు పటిష్ఠ పర్యవేక్షణ, తనిఖీ ఉండాలి. అప్పుడే ఫలితాలకు గ్యారంటీ ఉంటుంది. అదేవిధంగా, మనం బేరీజు పద్ధతిని మార్చాలంటే అభ్యసన ఫలితాల్ని సమీక్షించాలి. విద్యార్థులు తరగతి స్థాయి విద్యా ప్రమాణాలకు తగ్గట్లు ఉన్నారా, విద్యార్థుల బేరీజు, మూల్యాంకనాలు నిజాయితీగా జరుగుతున్నాయా అని పరిశీలించుకోవాలి. దాంతోపాటు, మనం బోధన నాణ్యతను, టీచర్ల హాజరును కూడా పర్యవేక్షించాలి. క్రమశిక్షణను, జవాబుదారీతనాన్ని పెంపొందించటానికి ఇవి అవసరం. ఇందుకోసం, ఎంపిక చేసుకున్న స్కూళ్లలో ఆకస్మిక ఇన్‌స్పెక్షన్లు నిర్వహించాలి. ఈ రకంగా మూడు నెలలకోసారైనా ప్రతి స్కూలునూ సందర్శించాలి. ఈ ప్రయత్నాల ఉద్దేశం నియంత్రణల్ని అమలు చేయటమో, లేదా టీచర్లు, విద్యార్థులను శిక్షించటమో కాదు. లోపాల్ని గుర్తించి, టీచర్లకు మార్గదర్శనం చేయటం. వ్యవస్థను మెరుగుపరచటానికి పటిష్ఠ చర్య తీసుకోవటం. ఈ కార్యక్రమానికి అదనంగా వనరులు అక్కర్లేదు. **ఉన్న వనరుల్నే ఈ దిగువ పద్ధతుల్లో ఉపయోగించుకోవచ్చు** :

☞ జీతాలు, సిబ్బంది కోసం వినియోగిస్తున్న మొత్తం వ్యయంలో కనీసం 10 శాతం ఇన్‌స్పెక్షన్, పర్యవేక్షణ, మార్గదర్శకత్వం, పరిష్కార మద్దతు చర్యలకు ఉపయోగించాలి. ఉపాధ్యాయుల శిక్షణ కూడా ఈ పరిధిలోకే వస్తుంది.

☞ బోధనా ప్రమాణాల్లో, నిర్వహణా సామర్థ్యాల్లో బలమైన చరిత్ర ఉన్న అత్యుత్తమ టీచర్లను ఇన్‌స్పెక్షన్, పర్యవేక్షణ విధుల్లో నియమించాలి.

☞ ఏడాదికోమారు ఒక బృందంగా ఇన్‌స్పెక్టర్లు మరింత విస్తృత స్థాయి పర్యవేక్షణ చేయాలి. అన్ని తరగతుల్నీ, అందరు ఉపాధ్యాయుల్నీ పరిశీలించాలి. టీచర్ల బోధనా ప్రమాణాల్ని సమగ్రంగా అంచనా వేయాలి.

☞ మొత్తం ఇన్‌స్పెక్షన్‌ను, పర్యవేక్షణను సమన్వయం చేయటానికి ఒక జిల్లా స్థాయి విభాగం ఉండాలి. ఈ విభాగం ఉపాధ్యాయ శిక్షణ, పరీక్షా బోర్డు, జిల్లా స్థాయి విద్యాధికారులతో సన్నిహితంగా సంధానమై ఉండాలి. ఒక ఉమ్మడి లక్ష్యం దిశగా వ్యవస్థలన్నీ పని చేసేలా వ్యవహరించాలి.

**4) స్వతంత్ర పరీక్షా బోర్డులు**

ఆకస్మికంగా పరీక్షించడం, పర్యవేక్షించటం అనే పని చాలా ఫలవంతంగా జరగాలి. ఫలితాలు విశ్వసనీయంగా ఉండాలి. ఇందుకోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆకస్మిక పరీక్షలకు స్వతంత్ర పరీక్షా బోర్డుల్ని ఏర్పాటు చేయాలని మేం సిఫార్సు చేస్తున్నాం. ఫలితాల్ని నిజాయితీగా, స్వతంత్రంగా బేరీజు వేయటానికి ఈ సంస్థలు తగిన నమ్మకాన్ని కలిగించాలి. రాష్ట్రస్థాయిలో ఇందుకోసం ఒక సంస్థను ఏర్పాటు చేసి, ప్రతి జిల్లాలో విభాగాల్ని అందుబాటులోకి తేవాలి.

**అవి ఈ కింద పనుల్ని నెరవేర్చాలి :**


☞ పాఠశాల విద్యా ప్రమాణాల్ని స్థూలంగా, స్వతంత్రంగా, విశ్వసనీయతతో అంచనా వేసేలా ఎంపిక చేసిన స్కూళ్లలో విద్యార్థుల్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తుండాలి. సబ్జెక్టులవారీగా కూడా విద్యార్థుల ప్రమాణాల్ని పరీక్షించాలి. ఉదాహరణకి, గణితం, ఇంగ్లిష్, సైన్స్ .. ఇలా తరగతికి అనుగుణంగా బేరీజు వేయాలి. అంచనాకు తగ్గ అభ్యసనా సామర్థ్యాలు న్నాయా, తార్కిక ఆలోచనా శక్తి ఉందా, ఒక పాఠ్యాంశాన్ని చదివి అర్థం చేసుకోవటం, కాన్సెప్ట్ పరమైన అవగాహన, నేర్చుకున్న విషయాన్ని అన్వయించటం మొదలైనవాటి ప్రాతిపదికన పరీక్షించటం ఉండాలి.

☞ నెలవారీ, క్వార్టర్లీ, వార్షికంగా పరీక్షల్ని నిర్వహించాలి. ఈ పరీక్షల్ని రూపొందించటాన్ని జిల్లా స్థాయికి వికేంద్రీకరించాలి. అయితే అభ్యసన ప్రమాణాలు రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రాతిపదికలకు అనుగుణంగా ఉండాలి.

☞ రాష్ట్రస్థాయి పరీక్షల్ని తగిన స్థాయిల్లో నిర్వహించాలి. ఉదాహరణకు, 7వ తరగతి, 10వ తరగతి. వీటి సమాధాన

పత్రాల్ని బయటి ఉపాధ్యాయుల చేత మూల్యాంకనం చేయించాలి.

పైన పేర్కొన్న సిఫార్సులన్నిటికీ ఒక ఉమ్మడి విజన్ ఉంది – అభ్యసన ప్రమాణాల్ని మెరుగుపరచటం. ఈ ప్రతిపాదనలు అన్నీ కూడా ప్రభుత్వానికి అతితక్కువ ఖర్చయ్యేలా రూపొందించటమైనది. సరైన మదింపు, మెరుగైన పర్యవేక్షణ ద్వారా వీటిని అమలు చేయవచ్చు. తెలంగాణలో, ప్రయివేటు స్కూళ్ళలో చేరిక 1-10వ తరగతుల్లో 2015-16లో 51శాతం నుండి 2023-24లో 57 శాతానికి పెరిగాయి. పరిమిత వనరులున్న పేద తల్లిదండ్రులు, బతకటానికి ఏరోజుకారోజు ఆదాయం మీద ఆధారపడినవారు త్యాగాలు చేసి, తమ సంపాదనను పిల్లల ప్రయివేటు చదువుకి వెచ్చిస్తున్నారు. దీని ద్వారా ఒక విషయం స్పష్టమవుతోంది. నాణ్యమైన విద్యకు మన వద్ద విపరీతమైన డిమాండ్ ఉంది. అయితే, ఈ తల్లిదండ్రులు చాలా సందర్భాల్లో నిరక్షరాస్యులు, సాధికారత లేనివారు, పెద్దగా గొంతులేనివారు. విద్యా వ్యవస్థ ద్వారా తమ పిల్లలు ఎలా లాభపడగలరో, వారి జీవితాల మీద ఆ చదువు




ఎలాంటి ప్రభావం చూపుతుందో వారికి ఎటువంటి నిజమైన అవగాహనా ఉండదు. అదేవిధంగా, విద్య లేకపోవటం తమ పిల్లల్ని ఎలా నిస్సహాయుల్ని చేస్తుందో, వారి ఆకాంక్షల్ని, భవిష్యత్తుని ఎలా నాశనం చేస్తుందో కూడా వారికి అవగాహన లేదు. పరీక్షా విధానం, పాస్ పర్సెంటేజీల ద్వారా కొలిచే 'సక్సెస్' మాత్రమే వారికి తేలిగ్గా అర్థమయ్యేది. వారి నిస్సహాయత, వారికి సాధికారిత కొరవడటం వల్ల డిమాండ్ ఎటువంటి నిజమైన మార్పుగా రూపుదిద్దుకోదు. వారి గొంతు విధాన నిర్ణేతలు వినేంత పెద్దగా ఉండదు. దీన్నిబట్టి, డిమాండ్ బలంగా ఉంది, సరఫరా అగమ్యగోచరం అని అర్థమవుతుంది. పేలవంగా రూపొందించిన పరీక్షల్ని నిర్వహిస్తున్నాం. అవి బుద్ధి బలాన్ని వినియోగించని, బట్టీపట్టే విధానాన్నీ, పరిజ్ఞానంతో సంబంధం లేని దొంగ ర్యాంకుల్ని ప్రోత్సహిస్తూ వ్యవస్థను, వ్యవస్థ నిజాయితీని, విశ్వసనీయతను నాశనం చేశాయి. బలమైన డిమాండ్ నాణ్యమైన సరఫరాగా మారకపోవటంతో, విద్యలో భాగస్వాములందరూ నిస్సహాయులుగా మిగిలిపోయి, నిజమైన అభ్యసన ప్రమాణాల్ని మదింపు చేయని ఒక విషవలయానికి బాధితులుగా మారిపోయారు. చివరికి పిల్లలు, తల్లిదండ్రులు సరిదిద్దలేని మూల్యం చెల్లిస్తున్నారు. కాబట్టి, అభ్యసన ఫలితాల్ని బేరీజు వేయటం, స్కూళ్ళను స్థానికంగా పర్యవేక్షించటంపై మన శక్తియుక్తులన్నిటినీ కేంద్రీకరించాలి. ఒక్కసారి ఈ పద్ధతిని సరిచేస్తే, సమాజం మొత్తంగా తన నిజమైన లాభాలేమిటో గుర్తిస్తుంది. అత్యుత్తమ సాధ్యమైన ఫలితాల్ని అందించే పద్ధతుల్ని తనకు తానే బోధించుకుని అందిపుచ్చుకుంటుంది.

స్కూళ్లలో పిల్లల ఎన్‌రోల్‌మెంట్ పద్ధతులు మారుతున్నరీత్యా, ప్రభుత్వ వ్యయపద్ధతులూ మారాలి. కానీ అలా జరగటం లేదు.

స్కూళ్ళలో విద్యార్థుల చేరికలు తగ్గుతున్నా ప్రభుత్వం ఇంకా ఇంకా ఖర్చు పెట్టటం కొనసాగిస్తోంది. ఎన్‌రోల్‌మెంట్‌లో తగ్గుదలకు మొగ్గు మారి ప్రయివేటు స్కూళ్ళవైపు మళ్లటం ఒక కారణం కాగా, 0-14 వయసు పిల్లల సంఖ్య తగ్గటం మరో కారణం. ఈ నేపథ్యంలో, తక్కువమంది పిల్లలకు ప్రభుత్వం ఎక్కువ ఖర్చు చేస్తుండగా, తల్లిదండ్రులు జేబుల్లో నుంచి ప్రయివేటు స్కూళ్ళకు మరింత వ్యయం చేస్తున్నారు. ఇది అందరికీ ఓటమి పరిస్థితి. ఇప్పుడున్న వాతావరణంలో ప్రభుత్వమే చదువు అందించాలంటే సాధ్యం కాదు. కానీ చదువు అందించే బాధ్యత ప్రభుత్వానిదే కాబట్టి, ఎవరు చదువు అందించినా ఫలితాలు ప్రామాణికంగా ఉండేలా గ్యారంటీ ఇవ్వాల్సిన విధి ప్రభుత్వానిది. ప్రయివేటు స్కూళ్ళకే మొగ్గు ఉంటే, ప్రభుత్వం తన వ్యయాన్ని ఆ డిమాండ్‌ను అందుకోవటానికి మళ్లించాలి. మరింతమంది టీచర్లను ప్రభుత్వవిద్య కోసం నియమించుకునేందుకు ఖర్చు చేసే బదులు, నియామకాల్ని నిలుపుచేసి ఆ నిధుల వినియోగాన్ని పునర్నిర్వచించటం మేలు. ఒక పరిమితి ఫీజుగల బడ్జెట్ ప్రయివేటు స్కూళ్ళలో విద్యార్థులకు ఫీజు చెల్లించటానికి ఆ నిధుల్ని ఉపయోగించాలి. అర్హులైన కుటుంబాల పిల్లలకు ట్యూషన్ ఫీజుగా ఆ నిధులు విద్యార్థులకు ఖర్చు చేయాలి. ఈ విధంగా, ప్రభుత్వానికి అదనపు ఖర్చు ఉండదు, అదే సమయంలో తల్లిదండ్రులకు ప్రయివేటు స్కూలు ఫీజుల భారం తగ్గుతుంది. గరిష్ఠ స్థాయి ప్రభావాన్ని చూపేలా, అభ్యసన ప్రమాణాలకు భరోసా ఉండేలా ప్రభుత్వం తన

పద్ధతుల్ని మార్చుకోవాలి.

**ii) పాఠశాలల హేతుబద్ధీకరణ - విలీనం**

చాలాకాలంపాటు, అటు ప్రభుత్వం, ఇటు విధాన నిర్ణేతలు పాఠశాల అందుబాటును అతిపెద్ద సమస్యగా భావించారు. పొరుగునే స్కూలు అందుబాటులో ఉండాలనే భావంతో, బిడ్డ ఇంటికి 200-500 మీటర్ల తక్కువ దూరంలో పాఠశాల ఏర్పాటును ప్రతిపాదించారు. విద్యాహక్కు చట్టంలోని 6,8,9 సెక్షన్లు కూడా ఇదే అంశాన్ని నొక్కివక్కాణించాయి. అయితే ఈ తరహా ఆలోచనాతీరు తీవ్ర పొరపాట్లకు దారితీసింది.

మనం స్కూలు దూరం గురించి ఆలోచించాంగానీ, అందులో చదువు చెబుతున్నారా?, నాణ్యమైన చదువులకు కావలసిన కనీస స్థాయి, సంఖ్య, ఆ స్కూలుకు సమకూరుతున్నాయా అని యోచించలేదు. కొసరు విషయాల కోసం అసలు లక్ష్యాన్ని బలిపెట్టాం. ఫలితంగా తగినంతమంది టీచర్లుగానీ, తగిన సంఖ్యలో పిల్లలుగానీ లేకుండా వేలాది స్కూళ్ళు ప్రారంభమయ్యాయి. వనరులు వృధాగా ఖర్చయ్యాయి.

పిల్లలందరికీ విద్యను అందుబాటులోకి తేవటంలో మనం గణనీయ పురోగతిని సాధించాం. దేశవ్యాప్త స్థాయిలో స్థూల ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి 90 శాతం దాకా ఉంది. తెలంగాణలోనే, ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి ప్రాథమిక స్థాయిలో 111.2 శాతం, ప్రాథమికోన్నత స్థాయిలో 110.6 శాతం. అయితే మనం వనరులు పంపిణీ చేసిన తీరు అసలు సమస్య. జాతీయ స్థాయిలో విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి మనకు సహేతుక స్థాయిలో 25:1గా ఉంది. అయినా ఈ లోటుపాట్లు కనిపిస్తున్నాయంటే అర్థం, మొత్తంగా తగినంతమంది ఉపాధ్యాయులున్నా పాఠశాలల మధ్య వారిని కేటాయించిన తీరు అసంబద్ధంగా, పద్ధతి లేకుండా ఉంది. భారతదేశవ్యాప్తంగా 12,954 స్కూళ్లలో ఒక్క విద్యార్థి కూడా లేరు. జీరో ఎన్‌రోల్‌మెంట్. అయినా ఆ స్కూళ్ళలో 31,981 మంది టీచర్లు ఉద్యోగాలు చేస్తున్నారు. అంటే, అసలు విద్యార్థులే లేకుండా సగటున 2.5 మంది ఉపాధ్యాయులున్నారు. అదనంగా, 110,971 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు సగటున 36 మంది ఒక్క టీచర్ మీదే ఆధారపడి ఉన్నారు. అటువంటి స్కూళ్ళలో, అభ్యసన ఫలితాల్ని మెరుగుపరచటం ఓ దూర, సుదూర స్వప్నం.

ఈ గణాంకాల్నిబట్టి, అసలు విద్యార్థులే లేని, అంటే వాస్తవంగా చదువే చెప్పని ఉపాధ్యాయ సిబ్బంది అవసరానికి మించి ఉన్న స్కూళ్లు కొన్ని ఉండగా, ఉపాధ్యాయుల కొరతతో చదువు చెప్పకుండా పిల్లల్ని గాలికొదిలేసిన స్కూళ్ళు ఇంకొన్ని ఉన్నాయి. తెలంగాణనే తీసుకుంటే 72.7 శాతం ప్రాథమిక పాఠశాలల్లో 50 కంటే

**జాతీయ స్థాయిలో విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి మనకు సహేతుక స్థాయిలో 25:1గా ఉంది. అయినా ఈ లోటుపాట్లు కనిపిస్తున్నాయంటే అర్థం, మొత్తంగా తగినంతమంది ఉపాధ్యాయులున్నా పాఠశాలల మధ్య వారిని కేటాయించిన తీరు అసంబద్ధంగా, పద్ధతి లేకుండా ఉంది.**

తక్కువమంది పిల్లలున్నారు. చిన్నస్థాయి స్కూళ్ళు కావటంతో వీటికి ఫలితాల్ని సాధించే సామర్థ్యం కొరవడుతోంది. ఆర్థికంగా, నిర్వహణాపరంగా ఇవి అననుకూల పరిస్థితుల్లో ఉన్నాయి. వాటికి తరచూ వనరుల సమస్య ఎదురవుతుంటుంది. ఫలితంగా, ఎటువంటి నాణ్యమైన విద్యను అందించే సామర్థ్యాన్నీ ప్రదర్శించలేవు. ఈ సమస్యను ఎదుర్కోవటానికి జాతీయ విద్యా విధానం కొన్ని స్కూళ్ళను కలిపి సముదాయంగా ఏర్పాటుచేస్తూ, పాఠశాల క్లస్టర్లను రూపొందించాలని సిఫార్సు చేసింది. అప్పుడు పాఠశాలలు వనరుల్ని పంచుకుంటాయి. ఒక్కో స్కూల్ క్లస్టర్‌లో 3 మండలాల్ని చేర్చవచ్చు. 15,000-20,000 జనాభా అవసరాల్ని తీర్చవచ్చు. స్కూలు సముదాయంలో జూనియర్ కళాశాల, అన్ని ప్రాథమిక పాఠశాలలు ఉండొచ్చు. ఈ రకంగా వనరుల్ని పంచుకోవచ్చు. స్థానిక పర్యవేక్షణ, జవాబుదారీతనం కలిసికట్టుగా సాగుతాయి.

వనరుల్ని మెరుగ్గా పంపిణీ చేసినందున పెద్ద స్కూళ్ళు మెరుగైన ఫలితాల్ని సాధిస్తాయని మనం ఆచరణలో చూశాం. 150-200 మందికి పైగా విద్యార్థులున్న స్కూళ్ళు , బహుళ తరగతి గదులు, తగినంతమంది ఉపాధ్యాయులు, కనీస స్థాయి, మౌలిక వసతులు ఉంటే .. నేర్చుకోవటానికి మెరుగైన వాతావరణాలు నెలకొంటాయి. చిన్న పాఠశాలలతో పోలిస్తే ఈ స్కూళ్ళలో విద్యాప్రమాణాలు, ఫలితాలు కూడా మెరుగ్గా ఉంటాయి. ఎక్కువ పరిమాణం, మెరుగైన వనరుల వల్లే హైస్కూళ్ళు (6-10 తరగతులు) ప్రాథమిక పాఠశాలల కంటే మెరుగైన పనితీరును కనబరచటం కద్దు. హేతుబద్ధంగా, ఫలితాలు వచ్చేలా స్కూళ్ళ విలీనం అమలుచేస్తుంటే, అందుబాటు సమస్య లేకుండా రవాణా సబ్సిడీ ఇవ్వొచ్చు. తమ ఇళ్ళ నుంచి 3 కిలోమీటర్లకు పైగా దూరమున్న స్కూళ్ళకు వెళ్లే పిల్లలకు రూ.150 వరకు సబ్సిడీ ఇవ్వొచ్చు. దీనివల్ల స్కూళ్ళ హేతుబద్ధీకరణ అందరు పిల్లలకూ ఆచరణ యోగ్యమవుతుంది. దూరాభారం సమస్యలు గణనీయంగా తగ్గుతాయి.

కనీసస్థాయి అదనపు ప్రయత్నం, వ్యయంతో, ఈ విధానం విద్య ప్రమాణాల్ని అభ్యసనా సామర్థ్యాల్ని ఫలితాల్ని మెరుగు పరచగలదు. ఎక్కువ మౌలిక వసతులు, సుశిక్షితులైన ఉపాధ్యాయులు, నేర్చుకోవటానికి మెరుగైన పరిస్థితులున్న స్కూళ్ళద్వారా విద్యార్థులు గణనీయంగా లాభపడతారు. ఇది ప్రభుత్వం మీద ఆర్థిక భారాన్ని కూడా తగ్గిస్తుంది. అభ్యసనా




ఫలితాల్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఇంకా ఇంకా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా, పెద్ద స్కూళ్ళు తమకు తాముగా బాధ్యత తీసుకుంటాయి.

**III) వికేంద్రీకృత పాలన, జవాబుదారీతనం, కమ్యూనిటీ యాజమాన్యం**

మెరుగైన అభ్యసనా ఫలితాలు సాధించాలంటే, సంబంధిత భాగస్వాములందరూ మరింత బాధ్యత తీసుకోవాలి. సొంతపనిలా వ్యవహరించాలి. మన పిల్లల భవిష్యత్తు మీద పెట్టుబడి పెట్టటం కోసం ఈ సంస్కరణను సాధించే సాహసోపేత ముందడుగును సంఘటితంగా వేయాలి. ప్రభుత్వం, పౌర సమాజం నుండి కలిసికట్టు భాగస్వామ్యం కావాలి. ఇందుకోసం ఈ దిగువ సిఫార్సులు:

☞ **స్కూలు యాజమాన్య కమిటీలు:** స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీల్లోకి విద్యాహక్కు చట్టం సెక్షన్ 21 తల్లిదండ్రులను ఆహ్వానిస్తుంది. ఇది జవాబుదారీతనాన్ని పెంచే దిశలో సరైన అడుగే అయినప్పటికీ, ఎక్కువమంది తల్లిదండ్రులు పేదలు, అక్షరజ్ఞానం లేనివారు. కాబట్టి మెరుగైన ఫలితాల్ని సాధించటానికి, మన పిల్లల భవిష్యత్తును పరిరక్షించటానికి స్కూళ్ళ పనితీరులో పౌర సమాజం పాత్రను మనం బలోపేతం చేయాలి.

ఉదాహరణకు స్కూలు పూర్వ విద్యార్థుల్లో విజయ వంతమైన వారు తమ పాఠశాలల ప్రగతికి గొప్ప మద్దతు దారులు. ప్రజల్లో పేరున్న ఉపాధ్యాయులు, సుప్రసిద్ధ స్వచ్ఛంద సంస్థలు కూడా విలువను జోడించగలవు. వాళ్లం దర్నీ స్కూలు యాజమాన్య కమిటీలలో భాగస్వాముల్ని చేయాలి.

**బ్లాక్, జిల్లా, నగర విద్యా బోర్డులు**

భారత్‌లోని చాలాచోట్ల ప్రాథమిక విద్యను బ్లాక్ లేదా మధ్య పంచాయతీ నిర్వహిస్తుండగా, ప్రాథమికోన్నత విద్య (కనీసం 10వ తరగతి వరకూ) జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తోంది. నగరాల్లో, స్థానిక ప్రభుత్వంగానీ, లేదా రాష్ట్ర ప్రభుత్వంగానీ ప్రత్యక్షంగా స్కూలు వ్యవస్థని నిర్వహి స్తున్నాయి. అవన్నీ ఎలా ఉన్నా, అధికారులు మాత్రం చాలా మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారు. వారేమీ ఇందులో వ్యక్తిగత భాగస్వాములు కారు. మరింత మెరుగైన ఫలితాల్ని సాధించా లన్న ఆసక్తి వారికుండదు. వారికి నైపుణ్యాలు, తార్కిక ఊహా శక్తి ఉండవు. పాలనా, రాజకీయ మద్దతేమీ కనిపించదు. కాబట్టి ఈ ఉదాసీనతను బద్దలు కొట్టేందుకు, బ్లాక్, జిల్లా, నగర స్థాయిల్లో స్వతంత్ర విద్యా బోర్డుల ఏర్పాటుకు నిబం ధన చేర్చాలి. ఈ బోర్డుల్లో రాష్ట్రస్థాయి, స్థానిక అధికారులు, ఇన్‌స్పెక్షన్, పర్యవేక్షణ, ధృవీకరణ, టెస్టింగ్ బాధ్యులైన యంత్రాంగం, స్కూలు యాజమాన్య కమిటీల, స్థానిక ప్రభు త్వాల ప్రతినిధులు, విద్యారంగంలో నిష్ణాతులు, పేరొందిన స్వచ్ఛంద సంస్థలు, ప్రయివేటు స్కూళ్ళ ప్రతినిధులు ఉండాలి. పాఠశాలలు అన్నిరకాల నిర్వహణ బాధ్యతల్ని నెరవేర్చగలవలన్న నమ్మకం ఈ బోర్డుల పట్ల ఉండాలి. అంటే, నాణ్యమైన విద్య అందేలా చేయటం, నిర్ణీత కాల వ్యవధిలో ఇన్‌స్పెక్షన్లు, పర్యవేక్షణ, పరీక్షలు నిర్వహించటం సమర్థంగా చేయాలి.

**రాష్ట్ర స్కూలు విద్యాబోర్డు**

అదేరీతిలో రాష్ట్రస్థాయి బోర్డును ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఎన్‌సిఈఆర్‌టీ, ఎస్‌సీఈఆర్‌టీ, జిల్లా బోర్డుల ప్రతినిధులు, పేరున్న ఎన్జీవోలు, విద్యారంగ నిపుణులు, రాష్ట్ర స్థాయి టెస్టింగ్ బోర్డు, ఉన్నత విద్య ప్రతినిధులు ఇందులో ఉండాలి. సిలబస్, పాఠ్య పుస్తకాలు, పరీక్షలు, ఉపాధ్యాయుల శిక్షణ, అక్రెడిటేషన్, ఇతర అవసరమైన అంశాలలో స్కూలు విద్యకు సంబంధించిన అన్ని సవాళ్లనూ ఎదుర్కోవటానికి రాష్ట్ర బోర్డుకి బాధ్యత, అధికారం, వనరులు ఉండాలి. రాష్ట్రస్థాయి పాఠ్య ప్రణాళికను నిర్దేశించటం విద్యా ప్రమాణాల నిర్వహణ కోసం ఎస్‌సీఈఆర్‌టీ, అభివృద్ధిపరిచిన తరహాలో స్కూలు నాణ్యతా మదింపు, ధృవీకరణ విధాన ప్రక్రియను అభివృద్ధి చేయాలని జాతీయ విద్యావిధానం కూడా పిలుపునిస్తోంది.

**మానవ వనరుల్ని స్థానికంగానే నిర్వహించటం**

మరింత సమర్థ ఫలితాలను సాధించటానికి మానవ వనరుల్ని మెరుగ్గా నిర్వహించటం కూడా అవసరం. ఉపాధ్యాయులను బదిలీ చేసే అధికారం ఇప్పుడు రాష్ట్రస్థాయిలో ఉంది. దీనివల్ల విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తిలో అసమతుల్యత, ఒకే గ్రామంలో లేదా మండలంలో టీచర్ల కేంద్రీకరణ వంటి పొరపాట్లను సరి చేయటంలో పాలనాపరమైన జాప్యాలు చోటుచేసు

కుంటున్నాయి. ఇంతకుముందే వివరంగా పేర్కొన్నట్లు, విద్యార్థి–ఉపాధ్యాయ నిష్పత్తి మనకు తగినంత ఉన్నా, ఒక్క విద్యార్థీ లేని స్కూళ్ళు భారతదేశవ్యాప్తంగా అనేకం ఉన్నాయి. ఉపాధ్యాయులు మాత్రం ఇక్కడ గణనీయ సంఖ్యలో పనిచేస్తూ జీతభత్యాలు తీసుకుంటుంటారు. దీంతోపాటు, పెద్దసంఖ్యలో ఏకోపాధ్యాయ పాఠశాలలు .. ఎటువంటి ఫలితం లేకుండా కొనసాగుతున్నాయి. దీనికి బదులు, టీచర్ల బదిలీ అధికారం స్థానిక స్థాయిలోనే ఉంటే, సామర్థ్యంలో గణనీయ మెరుగుదల కనిపిస్తుంది. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు బదిలీలు మండల, జిల్లా స్థాయిలో జరగాలి. ప్రాథమికోన్నత స్కూళ్ళ టీచర్ల బదిలీలు జిల్లా స్థాయిలో నిర్వహించే అధికారం ఉండాలి.

దీనివల్ల అధికారం, బాధ్యతకు మధ్య అంతరం తగ్గి పాలనా యంత్రాంగం పనితీరు మెరుగవుతుంది. ఫలితంగా వనరుల పంపిణీ మరింత ప్రభావశీలంగా జరుగుతుంది. ఫలితా ల్లోనూ ఆ సానుకూల మార్పు కనిపిస్తుంది.

ఇన్‌స్పెక్షన్, పర్యవేక్షణ బాధ్యతల్ని, నాణ్యతా ప్రమాణాల నిర్వహణను వికేంద్రీకరించాలి. ఈ పనుల్ని స్థానికీ కరించటం వల్ల, మనం జవాబుదారీతనాన్ని, పర్యవేక్షణను మరింత పెంపొందించగలం. మెరుగుపరచటానికి మనకు మరింత సమయం లభిస్తుంది. ఈ బాధ్యతలన్నిటినీ కేంద్రీకరించటం ద్వారా, మనం ప్రక్రియను క్షేత్రస్థాయి వాస్తవంతో మరింత సంబంధం లేకుండా చేస్తున్నాం. పైన చేసిన సిఫార్సులు, బ్లాక్, జిల్లా, నగరాలకు, రాష్ట్రస్థాయి బోర్డులకు ఇచ్చిన బాధ్యతలు – ఎన్ఈపీ ఎస్ఎస్ఎస్ఏకి, ఎస్క్యూఏఏఎఫ్, ఏఏఆర్ఏకేహెచ్ సంస్థలకి చేసిన సిఫార్సుల తరహాలోనే ఉన్నాయి. ప్రధానమైన తేడా అంతా అమలులో ఉంది. మెరుగైన ఫలితాల కోసం మేం ప్రజలకు దగ్గరగా అమలు చేయాలని వాదిస్తున్నాం. ఈ పనుల్ని స్థానికీకరించటం, వికేంద్రీకరించటం వల్ల పర్యవేక్షణ మెరుగవుతుంది, ఫలితాలూ మెరుగ్గా వస్తాయి.

**ముగింపు**

మనం చేయాల్సిన పని ఇప్పుడు చరిత్రాత్మకమైనది. కానీ, ఈ లక్ష్యాన్ని సాధించటానికి మనమందరం చేతులు కలపాలి. అలా అయితేనే, రానున్న సంవత్సరాల్లో అద్భుత ఫలాల్ని అందుకోగలం. తమకో భవిష్యత్తుని నిర్మించు కోవటానికి, భారతదేశ గొప్పతనంలో భాగమవటానికి మన పిల్లలకు ఒక నిజమైన అవకాశాన్ని అందించగలం. వనరులు ఎవరు అందిస్తున్నారని కొట్లాడటానికి ఇది సమ యం కాదు, ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించేలా తన బాధ్యతను రాజ్యం, ప్రభుత్వం నెరవేర్చాల్సిన సమయం. అనేకమంది ప్రశంసనీయ వ్యక్తులు, సంస్థలు భారత్‌లో

> **రాష్ట్రప్రభుత్వ విభాగం ఎస్‌సీఈఆర్‌టీ, లాభాపేక్ష లేని ఇతర సంస్థల భాగస్వామ్యంతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటును ప్రభుత్వం తప్పనిసరిగా ప్రోత్సహించాలి. సాధ్యమైనంత అతి తక్కువ ఖర్చుతో, సాధ్యమైనంత అతి ఎక్కువ ఫలితాన్ని సాధించేందుకు పలు చర్యలు తీసుకోవటం మన ముందున్న లక్ష్యసాధనకు అవసరం.**



విద్యను బాగుచేయటానికి కంకణబద్ధులై ఉన్నారు. వాళ్లకు కావాలసిందల్లా కేవలం ప్రభుత్వ మద్దతు, ప్రోత్సాహం. రాష్ట్రప్రభుత్వ విభాగం ఎస్‌సీ ఈఆర్‌టీ, లాభాపేక్ష లేని ఇతర సంస్థల భాగస్వామ్యంతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటును ప్రభుత్వం తప్పనిసరిగా ప్రోత్సహించాలి. సాధ్యమైనంత అతి తక్కువ ఖర్చుతో, సాధ్యమైనంత అతి ఎక్కువ ఫలితాన్ని సాధించేందుకు పలు చర్యలు తీసుకోవటం మన ముందున్న లక్ష్యసాధనకు అవసరం. ఇప్పటికే అనేక చర్యల్ని తీసుకున్నారు, వ్యవస్థలో చాలా ప్రయత్నం చేశారు. అయితే, ఈ ప్రయత్నాలు వ్యక్తిగతంగా ఫలితాలను సాధించలేవు. ఫలితాల సాధనకు వీటిని వ్యవస్థతో సంధానించాల్సిన, సాంకేతికత ఆవిష్కరణల ద్వారా వసతులు, దూరాభారాలు, ఇతరత్రా అవసరాలు, కొరతల సవాళ్లను ఎదుర్కోవాల్సిన సమయమిది. బిడ్డ కోసం, సంబంధిత భాగస్వాములందరి కోసం మనం మన లక్ష్యాన్ని పునర్నిర్వచించాలి, మార్చాలి. మన లక్ష్యం నిజమైన విజయానికి, నిజమైన అభ్యసనానికి దారితీయాలి. ఒక్కసారి లక్ష్యం ఈ రకంగా మారితే, సమాజం తన మార్గాల్ని మార్చుకుంటుంది. ఇంకా డబ్బు, ఇంకా సమాచారాలు అక్కర్లేదు. ఉన్న వనరుల్ని సాంకేతికత సాయంతో తెలివిగా వినియోగించుకోవటం, ప్రోత్సాహకాల్ని మార్చటం, నిజమైన విద్యా ప్రమాణాల్ని, ఫలితాల్ని బేరీజు వేసే ఒత్తిడి లేని, నిజాయితీతో కూడిన, పారదర్శకమైన రీతి లో పరీక్షల్ని నిర్వహించటం అత్యంత అవసరం. ✦

## సీఎం తక్షణ స్పందన అభినందనీయం .. కానీ..

# ఎఫ్‌డీఆర్ సిఫార్సులపై మరింత లోతైన చర్చ అవసరం

**జేపీ నేతృత్వంలోని ఎఫ్‌డీఆర్ బృందం ఇచ్చిన నివేదిక సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని తెలంగాణ విద్యా విధానాన్ని రూపొందించాలని విద్యా కమిషన్‌కు, ఆ శాఖ ఉన్నతాధికారులకు తక్షణం ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .. ఆ తర్వాత రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్' ప్రారంభోత్సవ సభలో కూడా ఆ అంశాన్ని ప్రస్తావించారు.**

"జయప్రకాష్ నారాయణ్ లాంటి నిపుణులు విద్యా కమిషన్‌తో చర్చలు జరిపినప్పుడు కొన్ని అంశాలు గమ నించాం. ఉపాధ్యాయుల అర్హతలు చూస్తే సర్కారీ బడులే అత్యుత్తమం. ప్రభుత్వ పాఠశాలల్లో అయిదేళ్లు దాటితేనే ఒకటో తరగతిలో చేర్చేలా నిబంధన ఉంది. ప్రయివేటులో మూడేళ్లు దాటగానే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ఉన్నాయి. ప్రాథమికంగా పిల్లల్ని ప్రయివేటు పాఠశాలల్లో చేర్పిం చటంతో వారు ఒకటో తరగతికి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చే అవకాశం తక్కువ. ఇందుకు పరిష్కారంగానే ప్రీస్కూల్స్ ప్రారంభించాలనుకుంటున్నాం" అని ముఖ్యమంత్రి తెలిపారు.

ముఖ్యమంత్రి ప్రకటన వెలువడగానే విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. తొలిదశలో వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి జిల్లాకు 30, అంటే 33 జిల్లాలకు 990 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అంగన్‌వాడీ కేంద్రాలున్న సర్కారీ బడుల ప్రాంగణాలనే అందుకు ఎంపిక చేస్తారు.

**బలోపేతం ఎలా?**

నర్సరీకి ముందు ఎక్కువమంది పిల్లలు అంగన్‌వాడీల్లోనే పౌష్టికాహారం, ఆటలు, బొమ్మల ద్వారా శిక్షణ వంటివి పొందుతున్నారు. అయితే ఎల్‌కేజీ దశ వచ్చేసరికి ప్రయివేటు స్కూళ్ల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. ఈ విషయాన్ని 'అసర్' తాజా సర్వే కూడా తెలిపింది. ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లలోనే ఉన్న కొద్దిశాతం చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లే విద్యాబుద్ధులు నేర్పుతున్నారు. వారి విద్యార్హత ఇంటర్మీడియట్. దానికితోడు ఊళ్లోనివారే కావటంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని పంపేందుకు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. పంపుతున్నవారిలో కూడా పలువురు ఒకటో తరగతికి




వచ్చేసరికి ప్రయివేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ప్రీప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టనున్న పాఠశాలల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. విద్యా వాలంటీర్లను నియమించాలని యోచిస్తోంది. వారు ఇంటర్‌తో పాటు బీఈడీ చదివి ఉంటారు. ఇంకా టెట్ పాసయినవారు. ఇలా బలోపేతం చేయటంతో పాటు, విద్యాశాఖ నుంచి ముఖ్యమంత్రి పేరిట కిట్ ఇవ్వాలని భావిస్తున్నారు. అందులో బొమ్మలు, పుస్తకాలతో పాటు టై, బూట్లు వంటివి ఉండొచ్చని చెబుతున్నారు. టీచర్లకు ట్యాబ్‌లు కూడా ఇస్తారు. సమగ్ర శిక్షా నిధులతో వాటిని సమకూరుస్తారు. ఆటవస్తువులను కూడా విద్యాశాఖ తన నిధులతో ఇవ్వనుంది.

అంగన్‌వాడీ కేంద్రాలు మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఉన్నాయి. ప్రయివేటు వ్యక్తులు నడుపుతున్న ప్రీప్రైమరీకి విద్యాశాఖ గుర్తింపు లేదు. ప్రస్తుతం పూర్వ, ప్రాథమిక తరగతులను విద్యాశాఖే నిర్వహించాలనుకుంటున్నందున.. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులకు వయసు, అనుమతులు తదితరులపై నిబంధనలు, గుర్తింపు వంటివి ఉండే అవకాశముందని సమాచారం.

**ప్రయోజనం ఎంత?**

ప్రభుత్వమే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలు, శిక్షణ పొందినవారితో నిర్వహించటం వల్ల ఒకటో తరగతిలో సర్కారీ బడుల్లో చేరికలు పెరిగే అవకాశముందని

ఎక్కువమంది అభిప్రాయం. అందువల్ల తెలంగాణ ప్రభుత్వమే కాకుండా వివిధ రాష్ట్రాలు కూడా ఈ ఆలోచన చేస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో ఒకటో తరగతిలో 6 లక్షల మంది విద్యార్థులుండగా, వారిలో 1.66 లక్షలమంది (27.66%) మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక .. 2016-17లో అత్యధికంగా 2.89 లక్షలమంది ఉండగా, కరోనా సంవత్సరాన్ని (2020-21) పక్కనపెడితే, ఈ సంవత్సరంలోనే అతి తక్కువమంది విద్యార్థులు ఒకటో తరగతిలో ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వేగంగా విద్యార్థుల సంఖ్య క్షీణిస్తున్నప్పుడు, కేవలం ఒకటో తరగతిలో చేరికల్ని పెంచుకోవటం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయా? అన్నది అసలు ప్రశ్న.

ప్రభుత్వ స్కూళ్లలో 5వ తరగతి చదువుతున్న పిల్లల్లో సగంమంది దాకా రెండో తరగతి పాఠం చదవలేనప్పుడు, 8వ తరగతిలో భాగహారాలు సక్రమంగా చేసేవారి సంఖ్య పరిమితంగా ఉన్నప్పుడు, పాసైనవారిలో 80 శాతం మంది దాకా తరగతి స్థాయి సామర్థ్యం లేనివారని వివిధ సర్వేల్లో తేలుతున్నప్పుడు, ప్రాథమికోన్నత విద్య పూర్తిచేసినవారిలో సగం మంది గడియారం చూసి సమయం కచ్చితంగా చెప్పేస్థాయిలో లేనప్పుడు .. ఒకటో తరగతిలో ఇబ్బడిముబ్బడిగా పిల్లలు చేరినా ఉపయోగమేమిటి? వారికి ఏం చదువు అబ్బుతుంది? పై తరగతులకు వెళ్లాకైనా వారిలో పలువురు ప్రయివేటుకి మళ్లి, ప్రభుత్వస్కూళ్లలో సంఖ్య పలచబడదని గ్యారంటీ ఏమిటి?


తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 18,133 ఉన్నాయి. వాటిలో 50కి మించి విద్యార్థులున్న స్కూళ్లు 6 వేలు మాత్రమే. ఇక 10 మంది, 20 మంది పిల్లలున్నవి వేలసంఖ్యలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఎన్ని పాఠశాల్లలో ప్రీప్రైమరీ తరగతులు ప్రవేశపెట్టగలరు? ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో అంగన్‌వాడీలు దాదాపు 15వేలు ఉన్నాయి. వీటన్నిటిలో విద్యా వలంటీర్లనో, ఇంకా క్వాలిఫైడ్‌లనో పెట్టి పూర్వ ప్రాథమిక విద్యను నడపటానికి తడిసిమోపెడవుతుంది. చివరికి సాధించేదేమిటి? ప్రజలు చెల్లించే పన్నులకీ, వారికందే ఫలితాలకీ పొంతన ఉంటుందా? జాతీయ విద్యావిధానం కూడా ప్రీ స్కూల్ దశ నుంచి నైపుణ్యాల పెంపు కీలకమని చెప్పింది తప్ప, ఆ అంశాన్ని ప్రభుత్వ బడులలో ఎన్‌రోల్‌మెంట్‌తో జతచేయలేదు. ఇప్పటికిప్పుడు ప్రభుత్వ స్కూళ్లలో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయమని సూచించలేదు. ప్రస్తుతం సర్కారీ బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంపు మీద ముఖ్యమంత్రి దృష్టి ఎక్కువగా ఉంది. విద్యలో అభ్యసన ఫలితాల సగటులో ప్రభుత్వాలు దశాబ్దాలుగా విఫలమవుతూ, మార్కెట్ డిమాండ్‌కి ప్రయివేటు రంగం స్పందించి పెద్దఎత్తున పెట్టుబడులతో విస్తరించాక... ఇప్పుడు ప్రభుత్వ స్కూళ్లలోనే ఎన్‌రోల్‌మెంట్‌లు జరగాలని అంతంత ఖర్చు పెట్టటం అసంబద్ధమయ్యే అవకాశముంది. ప్రజల పన్నుల డబ్బుతో మంచి విద్యను అందరికీ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఒకపక్క పన్నులు కడుతూ, మరోపక్క సొంత డబ్బుతో, అప్పులు చేసిమరీ పిల్లల్ని ప్రయివేటు స్కూళ్లలో చదివిస్తున్న సామాన్యులు, మధ్య తరగతివారు అనేకమంది ఉన్నారు.

ఈ నేపథ్యంలో, ప్రభుత్వం, ప్రయివేటు అనే తేడా చుట్టూ సమయం వృథా చేసుకోకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను, ముఖ్యంగా పాఠశాల చదువును తల్లిదండ్రులపై ఆర్థిక భారం లేకుండా అందించటం ప్రభుత్వ లక్ష్యం కావాలి. ప్రజలు తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్లలోనే చదివిస్తామంటే, వాళ్లు కట్టిన పన్నుల డబ్బులో విద్య కోసం వినియోగించే వాటా నుంచి కొంత బడ్జెట్ మొత్తాన్ని ప్రయివేటు స్కూళ్లలో వాళ్లు ఫీజులు కట్టేలా కేటాయించాలి. చాలా ప్రయివేటు స్కూళ్లు పెద్దగా నాణ్యమైన విద్యను అందించకపోయినా, విద్యార్థులు వాటికి ఎందుకు తరలిపోతున్నారు అనే ప్రశ్నను లేవనెత్తటంతో పాటు ... ప్రయివేటుతో పోటీపడి నాణ్యమైన విద్యను అందించటం మీదే ప్రభుత్వ పాఠశాలల మనుగడ, ఉపాధ్యాయులకు జీతభత్యాలు ఆధారపడివుంటాయని స్పష్టం చేయాలి. ఈ రకమైన ఏర్పాటులో, రిటైరైన ప్రభుత్వ ఉపాధ్యాయుల స్థానంలో కొత్తవారిని నియమించాల్సిన అవసరం, అదికూడా జననాల రేటు తగ్గుతున్నప్పుడు, పెద్దగా ఉండదు కాబట్టి .. విద్యారంగ బడ్జెట్‌లో మిగిలిన డబ్బును ప్రజల పన్నుల్లో విద్యకు కేటాయించాల్సిన వాటాగా వారి పిల్లల్ని చేర్చే నచ్చిన ప్రయివేటు స్కూలుకి ఫీజుగా ప్రభుత్వం చెల్లించాలి. ఇందుకు ఒక పరిమితిని విధించవచ్చు. కానీ మొత్తంగా తెలంగాణలో ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య అందేలా చేయటం అనే బాధ్యతను ప్రభుత్వం సంపూర్ణంగా నెరవేర్చాలి.

కాబట్టి, ఎన్‌రోల్‌మెంట్ సమస్యే కానప్పుడు, ప్రభుత్వమా, ప్రయివేటా అని ఆలోచించకుండా పాఠశాలల అసలైన లక్ష్యం - అభ్యసన ఫలితాల మీద సర్కారు దృష్టిపెట్టాలి. పాఠశాల విద్యా ప్రమాణాలను నాలుగైదేళ్లలో ఎలా గణనీయ స్థాయిలో పెంచవచ్చో, పరీక్షల విధానంలో మార్పు వంటి పద్ధతుల ద్వారా జేపీ బృందం ఇచ్చిన నివేదికను ముఖ్యమంత్రి, అధికార యంత్రాంగం సమగ్రంగా చర్చించి వ్యవహరించాలి. ✦

# సన్నబియ్యం-పీ4- జేపీ ఉగాది సందేశం

ఇటీవల ఉగాది రోజున, అంటే, శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సరాది రోజున, రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో ముఖ్యమంత్రులు రెండు కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు.
ఒకటి, ప్రజలకు రేషన్ షాపుల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ. ఇంకోటి పీ 4.
సన్నబియ్యం పంపిణీని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ప్రారంభిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, "పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడమనేది ఆషామాషీ కాదు. చరిత్రలో (రాబోయే కాలంలో) ఎవరు అధికారం లోకి వచ్చినా.. వారికి ఇష్టం ఉన్నా, లేకున్నా..ఎన్ని తరాలు మారినా.. ఎవరు ముఖ్యమంత్రి అయి నా, సన్నబియ్యం పథకం రద్దు చేసే ధైర్యం చేయలేరు. రాష్ట్రంలో 3.10 కోట్ల మంది ప్రజలకు ప్రతి ఒక్కరికీ నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తాం. ఎన్ని వేల కోట్ల రూపాయల భారమైనా ప్రభుత్వం భరిస్తుంది. ఇది నా మదిలో నిలిచి పోయే పథకం" అన్నారు.
కిలో రెండు రూపాయల బియ్యం పథకం తెలుగుదేశం వ్యవస్థాపకులు, AP ముఖ్యమంత్రి NT రామారావు ప్రవేశపెట్టి 40 ఏళ్లు దాటిపోయింది. ఆరోజు ఆయన ఆ బియ్యం ఖజానా నుంచి ఉచితంగా ఇవ్వలేదు. మార్కెట్ కంటే రూపాయిన్నర తగ్గించి సబ్సిడీతో పం పిణీ చేశారు. ఒకవేళ ఉచితంగా ఇచ్చినా, ఆ పథకం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోవాలని ఆయన కోరుకునేవారు కాదు. పేదవాడికి పట్టెడన్నం పెట్టాలనుకున్నారు తప్ప, పేదరికం శాశ్వతంగా కొనసాగాలని, ఏ ముఖ్యమంత్రి వచ్చినా ఆ పథకాన్ని తీసివేసే సాహసం చేయకూడదని' NTR కోరుకోలేదు. పేదలు తమ కాళ్ల మీద తాము నిలబడటానికి తాత్కాలిక ఉపశ మనంగానే రామారావు తన సంక్షేమ పథకాల్ని భావించారు. ప్రకాశం జిల్లాలో పత్తి రైతులు నష్టమొచ్చి ఆత్మహత్యలు చేసుకుం టున్నప్పుడు కూడా ఆయన ప్రతిపాదించిన సాయం.. వారి కాళ్ల మీద వారు నిలబడేలా చెయ్యటం కోసమే. అంతెందుకు, కిలో బియ్యం రూ.1.90 కి ఇచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి విజయ భాస్కర్ రెడ్డి కూడా రేవంత్ మాటలు వింటే షాకయ్యేవారేమో!
ఇక ఆంధ్రప్రదేశ్ లోని 'మార్గదర్శి – బంగారు కుటుంబం, పీ 4 – జీరో పావర్టీ' పథకాన్ని ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, "డబ్బులు సంపాదించిన వ్యాపార వేత్తలు, పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చి పేదలకు సాయం చేయాలి. శాయాజీరావు అనే బరోడా రాజు అంబేద్కర్ మేధాశక్తిని గుర్తించి ఆయనకు అండగా నిలిచారు. ఆర్థిక సాయం చేశారు. ఆనక న్యాయవాదిగా, సామాజిక సంస్క ర్తగా, భారత రాజ్యాంగాన్ని రాసిన మేధావిగా డాక్టర్ అంబ ేద్కర్ ఎదుగుదలకు శాయాజీరావు సహాయం కారణమైంది. స్వర్ణాంధ్ర సాధనకు పీ 4 ఒక ఆయుధం. సమాజంలో పైనున్న 10 శాతం మందిని, అట్టడుగున ఉన్న 20% మం దిని గుర్తించి వారిని ఒక ప్లాట్ ఫామ్ పైకి తెచ్చి వితరణతో అభివృద్ధి సాధించేందుకు ఎప్పటికప్పుడు స్వయంగా పర్య వేక్షిస్తా" అని తెలిపారు.




బహుశా అంబేద్కర్ బతికుంటే ఈ మాటలకి షాక్ అయ్యేవారేమో. పీ 4 లో భాగంగా మార్గదర్శులు ప్రధానం గా ప్రతిపాదించిన పరిష్కారం నాణ్య మైన విద్య! అది ఎవరి బాధ్యత? ప్రభుత్వం చేయాలి. వితరణ తప్పు కాదు, అవసరం కూడా. కానీ అది వేడి నీళ్లకి చన్నీటిలా తోడ్పాటు తప్ప పరిష్కారం కాదు. స్వతంత్రం రాక ముందు విధిలేని పరిస్థితుల్లో అంబే ద్కర్ ఎవరి దయాభిక్ష మీదో ఆధారపడ్డారు. కానీ స్వతం త్రం వచ్చాక మంచి చదువును ప్రభుత్వం ప్రతి బిడ్డకీ వివక్ష లేకుండా అందిస్తుందని తాత్కాలికంగా రిజర్వేషన్లను రాజ్యాంగంలో చేర్చా రు. అంతేతప్ప, SC, ST లకు ఎవరో దానమివ్వాలి చెప్పలేదు.
ఉగాది సందర్భంగానే ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయనకు అధికారం లేదు గదా!
ఆ ప్రకటనలో రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాల మౌలిక బాధ్యత లేమిటి, వాటిని ఎలా నెరవేరిస్తే 2047, 2050 నాటికి స్వర్ణాంధ్ర, రైజింగ్ తెలంగాణ సాధ్యమో JP చెప్పారు. వీటన్ని టినీ పోల్చి చూడండి. తెలుగు ప్రజలుగా, భారతీయులుగా ఏం చేయాలో మనకు స్పష్టమవుతుంది.

**ఇదే అంశంపై తెలంగాణ నేపథ్యంలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షులు యం.పద్మనాభరెడ్డి ఒక వ్యాసం రాశారు. ఆంధ్రజ్యోతి డైలీ ప్రచురించింది. తెలుగు రాష్ట్రాల నిజమైన అభివృద్ధి ఎజెండాపై క్లారిటీ కోసం ఆ వ్యాసాన్ని కూడా ఇక్కడ అంది స్తున్నాం..**

# ధనిక రాష్ట్రంలో 84శాతం పేదలా?

తెలంగాణ ధనిక రాష్ట్రమని, తలసరి ఆదాయం లెక్కన దేశంలో మొదటిస్థానంలో ఉందని మన నాయకులు గొప్పగా చెపుతుంటారు. అయితే ఇంతవరకు 90 లక్షల రేషన్ కార్డులు మంజూరు కాగా, కొత్తగా ఇంకా 10 లక్షల కార్డులు ఇవ్వబోతున్నారు. ప్రభుత్వం ప్రకారం తెలంగాణలో 84శాతం జనాభాకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం సరఫరా ఉగాదినాడు ఆరంభమైంది. ఈ లెక్కన రాష్ట్ర జనాభాలో 84శాతం మంది పేదవారే.

స్వాతంత్ర్యం వచ్చి దేశ విభజన జరిగినప్పుడు పంజాబ్ రాష్ట్రంలో మంచి పంటలు పండే భూములు పాకిస్తాన్‌కు వెళ్లాయి. దానితో దేశంలో తిండిగింజల కొరత ఏర్పడింది. మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ భాక్రానంగల్ వంటి బహుళార్థ సాధక ప్రాజెక్టులు నిర్మించడంతో ఆహారధాన్యాల దిగుబడి పెరిగింది. అయినా, పెరుగుతున్న జనాభాకు అది సరిపోక ఆహార కొరత నెలకొంది. అప్పటి పరిస్థితుల్లో పేదలకు ఆహారభద్రత కల్పించడానికి 1955లో ప్రజాపంపిణీ వ్యవస్థ ఏర్పాటు చేసి, పేదలకు రేషన్‌కార్డుల ద్వారా సబ్సిడీపై ఆహారధాన్యాలు పంపిణీ చేశారు. అయితే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగినా, పేదలకు ఆహారధాన్యాలు సరిగా అందలేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం 2013లో ప్రజలకు ఆహారధాన్యాలు సబ్సిడీపై అందించడానికి నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ (జాతీయ ఆహార భద్రత చట్టం) తీసుకొచ్చింది. దీనితో రాష్ట్రాలకు కావలసిన ఆహారధాన్యాలు, కిరోసిన్ వంటివి కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్నది.

తెలంగాణ ఏర్పడ్డాక, రాష్ట్రానికి ప్రతినెలా ఒక లక్ష ఆరువేల టన్నుల బియ్యం, 4,300 టన్నుల గోధుమలు, 5 వేల టన్నుల చక్కెర వంటివి కేంద్రం ఇచ్చింది. 2015 ఏప్రిల్ నుంచి కేంద్రం ఇచ్చిన బియ్యం, గోధుమలకు అదనంగా రాష్ట్రం మరో 56 వేల టన్నుల బియ్యం, 8 వేల టన్నుల గోధుమలు ప్రతి నెల ప్రజా పంపిణీ వ్యవస్థకు అందజేసింది. అదీకాక కేంద్రం ఇచ్చే కార్డు ఉన్న కుటుంబంలో ప్రతి వ్యక్తికి 5 కిలోల బియ్యం ఇవ్వగా, రాష్ట్రం ఇంకో కిలో బియ్యం తన వంతు వాటాగా కలిపి ఆరు కిలోలు ఇస్తున్నది. ఈ చర్య రాజకీయ లబ్ధి కోసం తీసుకున్నదే కాని, నిజంగా అవసరం ఉన్నదా అని చూడలేదు.

కరోనా సమయం నుంచి కేంద్ర ప్రభుత్వం దేశంలోని 80




కోట్ల కుటుంబాలకు ఉచితంగా ఆహారధాన్యాలు సరఫరా చేస్తున్నది. అందులో భాగంగా తెలంగాణలో కేంద్రం తరపున 55 లక్షల కార్డుల ద్వారా కోటి 92 లక్షల జనాభాకు ఉచితంగా రేషన్ అందజేస్తున్నది. దీనికి అదనంగా రాష్ట్రం 35లక్షల రేషన్ కార్డుల ద్వారా 90 లక్షల మందికి రేషన్ అందజేస్తున్నది. అంటే మొత్తం 90 లక్షల రేషన్ కార్డులతో సుమారు 2కోట్ల 82లక్షల మందికి రేషన్ అందిస్తున్నారు. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంకో 10 లక్షలు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నది. దానితో రాష్ట్రంలో మొత్తంగా ఒక కోటి రేషన్ కార్డులతో సుమారు 3.12 కోట్ల జనాభాకు రేషన్ ఇస్తున్నారు. ఇంతకు పూర్వం దొడ్డు బియ్యం ఇవ్వగా, ఉగాది నుంచి సన్నబియ్యం ఇస్తున్నారు.

దేశంలో నీతీఆయోగ్ లెక్కల ప్రకారం జనాభాలో 3.74శాతం ప్రజలు అతి పేదలుగా ఉన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా ఏ లెక్కన చూసినా 20శాతం లోపే. అటువంటి పరిస్థితిలో ఉచితంగా సన్నబియ్యం 84శాతం ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందజేయడమంటే ప్రజాధనాన్ని వృధాచేయడమే. బోగస్ రేషన్ కార్డులు తొలగించినా కేంద్రం ఇచ్చే ఆహారధాన్యాలు సుమారు 2 కోట్ల మందికి అంటే జనాభాలో 50శాతం మందికి సరిపోతాయి. అదనంగా రాష్ట్రం ప్రజాపంపిణీ వ్యవస్థపై ఏ విధమైన ఖర్చు చేయాల్సిన పని లేదు.

గత సంవత్సరం ప్రజాపంపిణీ వ్యవస్థ కొరకు 3 వేల కోట్లు ఖర్చు అయింది. ఇప్పుడు సన్నబియ్యం ఇస్తున్నారు కాబట్టి ఈ ఖర్చు 5 వేల కోట్ల వరకు చేరవచ్చు. రేషన్ కార్డు కొరకు అర్హత మొదట్లో గ్రామీణ ప్రాంతాలలో 2.5 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాల మెట్ట, అలాగే పట్టణ ప్రాంతాలలో సాలీనా ఆదాయం 1.5 లక్షల లోపుగా నిర్ణయించగాబీ దానిని 3.5 ఎకరాల మాగాణి, 7.5 ఎకరాల మెట్టకు పెంచారు. అలాగే పట్టణ ప్రాంతాలలో సాలీనా ఆదాయం 2

లక్షలకు పెంచారు. ప్రభుత్వ, ప్రైవేటు, పొరుగుసేవ ఉద్యోగులు, సెల్ఫ్ ఎంప్లాయిడ్ వ్యక్తులు, ప్రభుత్వ పెన్షన్‌దారులు వంటివారు రేషన్ కార్డు పొందడానికి అనర్హులు. నేడు తెలంగాణలో 90శాతం ఇళ్ళలో టీవీ, మోటారుసైకిల్ వంటివి ఉన్నాయి. పట్టణ ప్రాంతాలలో సేవారంగం, పొరుగు సేవలలో చాలామంది ఉపాధి పొందుతున్నారు.

ఈ మధ్య సుప్రీంకోర్టు... ప్రభుత్వాలు ఉచితాల పేరుతో ప్రజాధనం ఖర్చు చేస్తూ ప్రజలను సోమరిపోతులుగా చేస్తున్నది అన్నది. తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాదులో స్థానికులు పనిచేయకపోవడంతో చాలామంది కూలీలు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారు. అంటే సుప్రీంకోర్టు వారు చెప్పింది తెలంగాణకు వర్తిస్తుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బోగస్ రేషన్ కార్డులు ఏరివేసి, రాష్ట్ర జనాభాలో 50శాతం జనాభాకు మాత్రమే రేషన్ అందేటట్లు చర్యలు తీసుకోవాలి. తెలంగాణలోని 84శాతం జనాభాకు కోటి రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం ఇవ్వడమంటే రాష్ట్ర ఖజానాపై పెనుభారం పడుతుంది. ప్రజలను సోమరిపోతులుగా మారుస్తుంది. ప్రస్తుతం కేంద్రం కోటి 92 లక్షల మందికి ఉచితంగా ఇచ్చే బియ్యం సరిపోతుంది. నేడు బియ్యం కన్నా పప్పు దినుసులు, వంట నూనె కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. ఈ రెండూ కూడ తక్కువ ధరలో ఈ 50శాతం జనాభాకు ఇచ్చినా మేలే. ప్రభుత్వం ప్రజల ధనానికి ఒక కస్టోడియన్ మాత్రమే. రాజకీయ లబ్ధికై ప్రజాధనాన్ని ఖర్చు చేయడాన్ని ప్రజలు సమర్థించరు. ✦



## విద్యా ప్రమాణాలను కేంద్రబిందువు చేసిన మొదటి విధానకర్త

**డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ మృతి మన దేశానికి పెద్ద లోటు. అరుదైన ప్రతిభ, ప్రజా సేవ పట్ల అలసిపోని అనురక్తి, గొప్ప వినమ్రత, అసాధారణ విజ్ఞత కలగలిసిన మనీషి ఆయన. ఒక నిజమైన దేశభక్తుడ్ని, శాస్త్రవేత్తని, జాతి నిర్మాతని, మానవతా వాదినీ కోల్పోయాం. వ్యక్తిగతంగా ఓ అద్భుతమైన, ముందుచూపున్న స్నేహితుడ్ని కోల్పోయాను. ఈ దేశంలో విద్యా ప్రమాణాలను కీలకంగా మొట్టమొదట గుర్తించింది, ప్రస్తావించింది కస్తూరి రంగన్ కమిటీ రూపొందించిన జాతీయ విద్యా విధానం. ఇందులో FDR, లోక్ సత్తా పాత్ర ఉంది. ఇటీవల కూడా ఆయన ఇంటి వద్ద భోజనం చేస్తూ ఎన్నో విలువైన విషయాలు మాట్లాడుకున్నాం. మరపురాని సంభాషణ. ఆయన మృతి తీరని లోటు. ఓం శాంతి!**

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్ సత్తా వ్యవస్థాపకులు**

# చిన్న పట్టణాలతో పంచాయతీలను బలోపేతం చేయాలి: లోక్‌సత్తా

దేశంలో అధికార వికేంద్రీకరణ జరిగి మూడో అంచెలోని స్థానిక ప్రభుత్వాలు బలోపేతమైతేనే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశం అవుతుందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఏప్రిల్ 24 న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, 73 వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చి 30 ఏళ్లు దాటినా నేటికీ గ్రామీణ భారతం ఆర్థిక వృద్ధి సాధించలేదన్నారు. యూనియన్ ప్రభుత్వం నుంచి ఇంకా నిధులు, అధికారాలు అడుగుతున్న రాష్ట్రాలు.. తమ పరిధిలోని పంచాయితీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు నిధులివ్వటం లేదన్నారు. ఏపీలో 13, 344 పంచాయితీలున్నాయని, అభివృద్ధి కోసం అన్నిటినీ పట్టణాలుగా మార్చలేమని, కొన్ని గ్రామాల మధ్య చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు.. ప్రజలు ఎన్నుకున్న కమిటీలనూ స్థానిక పాలనలో భాగస్వాములను చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే పలు చోట్ల చిన్న పట్టణాలకు అనుకూల పరిస్థితులున్నాయన్నారు. అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీ తో పాటు చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలని త్వరలో పంచాయతీరాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ తో జేపీ నేతృత్వంలో సమావేశమవుతామన్నారు.

# ముఖ్యమంత్రి అయ్యాకగానీ తత్వం బోధపడలేదట!

రాజకీయ నాయకులు తమను తియ్యని అబద్ధాలు, హామీలతో మోసం చేయాలని భారత్‌లో ప్రజలు కోరుకుంటారని, తాము కూడా అలా వారికి నచ్చే మాటలు చెప్పి అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి అమెరికాలో కొన్నేళ్ల క్రితం చెప్పిన మాటలు 2023 చివర్లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో వీడియో వైరల్ అయ్యింది. అదే ఎన్నికలప్పుడు రైతులకు ఆయన ఒక పిలుపునిచ్చారు. బ్యాంకుల వద్ద రుణాలు తీసుకోండి, కానీ చెల్లించకండి, మేం అధికారంలోకి వచ్చాక రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. కాకపోతే, అమెరికా పర్యటనలో ఆయన తెలుగుదేశం పార్టీలో ఉన్నట్లున్నారు, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రముఖ నేతగా పోటీ చేశారు. కాంగ్రెస్ గెలవటంతో ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత 2024లో లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆగస్టు 15 లోగా ఎట్టి పరిస్థితుల్లోనూ రైతు రుణమాఫీ చేస్తామని ఆర్భాటంగా ప్రకటన చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఆ పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేక పోయినా బహిరంగంగా సవాలు చేయటం వల్ల ఇక తప్పదన్నట్లు అప్పులు చేసి మరీ రూ.21,000 కోట్ల దాకా రైతు రుణమాఫీ చేశారు. దీంతో హైదరాబాద్ మహానగర ఆదాయం మీదే ఆధారపడి, అప్పటికే ఒడిదుడుకుల్లో ఉన్న తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా తయారైంది. తెలంగాణలో రేవంత్ ప్రభుత్వ ఇరకాటంపై ఇటీవల కర్ణాటక బడ్జెట్ సమావేశాలలోనూ ఆసక్తికర చర్చ జరగడం గమనార్హం. ఆర్థిక పరిస్థితుల్ని చూసుకోకుండా ఇష్ట మొచ్చినట్లు హామీలు ఇవ్వొద్దని కర్ణాటకకే చెందిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సైతం గతంలో హెచ్చరించారు.

**అప్పుల భారం తెలిసీ హామీలిచ్చారు**

కర్ణాటక కంటే తక్కువ ఆదాయమున్న తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరిగేనాటికే తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాలు మోతాదును మించి ఉన్నాయి. అప్పటికే రాష్ట్రం అప్పుల సమస్యతో సతమతమవుతూ, ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. రోజువారీ ఖర్చులకు రిజర్వు బ్యాంకు వద్ద తరచూ ఓవర్ డ్రాఫ్టికి వెళ్తోంది. రాష్ట్రంలో పలువురు మేధావులు ఈ విషయం గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ మీడియా ప్రకటనలిచ్చారు, వ్యాసాలు రాశారు. యూట్యూబ్ వీడియోలు చేశారు. అయినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే రెట్టింపు తాత్కాలిక తాయిలాల్ని రేవంత్ పార్టీ హామీ




ఇచ్చి అధికారంలోకి వచ్చింది.

**కాళేశ్వరం కట్టేటప్పుడు ఎందుకు మాట్లాడలేదు?**

అదేవిధంగా, రాష్ట్రంలో ఆర్థిక దుస్థితికి, ప్రజల డబ్బు అనుత్పాదకంగా ఖర్చవటానికి పెద్ద కారణమైన కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి ఇప్పుడు కూలేశ్వరం అంటూ రేవంత్ విమర్శిస్తున్నారుగానీ... ఆరోజు ఏమాత్రం విమర్శించలేదు. మాట్లాడాల్సిన సమయంలో మౌనం వహించి, కాళేశ్వరం వల్ల తెలంగాణ రైతులకు, ఇతర ప్రజలకు ఎంత నష్టం వస్తుందో సవివరంగా అసెంబ్లీలో, బయట అనేక సందర్భాల్లో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ వివరిస్తున్నా, రేవంత్ గొంతు కలపలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ సభలో లేని జేపీని అసెంబ్లీలో విమర్శిస్తున్నా, రేవంత్ ప్రశ్నించలేదు. కానీ ఈవేళ కాళేశ్వరం తప్పులు, కేసీఆర్ అప్పులు అంటూ మాట్లాడుతున్నారు. అంతేకాదు, కాళేశ్వరం నమూనాకి మూలమైన ప్రాణహిత – చేవెళ్ల కాలం నుంచి ఆ ప్రాజెక్ట్ వల్ల వచ్చే నష్టం గురించి జేపీ హెచ్చరిస్తున్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ ప్రాజెక్ట్‌పై సమీక్ష చేసి దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఒక పక్క కాళేశ్వరాన్ని విమర్శిస్తూ, మరోపక్క అలనాటి ప్రాణహిత – చేవెళ్లను మళ్లీ ప్రారంభిస్తామని చెప్పటంలో రేవంత్ ప్రభుత్వం పాలనలో ఎలాంటి ఔచిత్యాన్ని ప్రదర్శిస్తోంది?

ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన అధ్యాపకుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో కూడా ఆర్థిక, విద్యారంగాల గురించి కొన్ని కీలకాంశాలను రేవంత్ ప్రస్తావించారు. అబద్ధాల ప్రాతిపదికన తాను రాష్ట్రాన్ని నడ

పలేనని, వాస్తవాలను చెప్పి, తెలంగాణను ప్రగతిపథంలోకి నడిపిస్తానంటూ రేవంత్ పేర్కొన్న మాటలు:

"కేసీఆర్ మాకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు మాత్రమే. రూ.7 లక్షల కోట్ల అప్పును నజరానాగా ఇచ్చివెళ్లారు. రాష్ట్రానికి ప్రతి నెలా ఆదాయం రూ.18 వేల కోట్ల నుంచి రూ.18,500 కోట్లు వస్తోంది. అందులో ఉద్యోగుల జీతభత్యాలకు రూ.6.500 కోట్లు, అప్పులకు రూ.6,500 కోట్లు (ఈ అంకె తాజా బడ్జెట్ నుంచి ఇంకా పెరగనుంది) పోతాయి. మిగిలేవి రూ.5వేల కోట్ల నుంచి 5,500 కోట్లు. ఈ మొత్తాన్ని 25-35 పథకాలకు సర్దుబాటు చేయాలి. ఇప్పుడున్న పరిస్థితిలో ... నెలకు కనీసం రూ.22 వేల కోట్లు అవసరం. కుటుంబంలో ఆదాయం సరిపోకపోతే కొన్ని బిల్లుల్ని ఆపేస్తుంటాం. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వమూ రొటేషన్ చేస్తోంది. అణాపైసాతో సహ ఉద్యోగ మిత్రుల ముందు పెడతా. మీరే కమిటీ వేసుకుని దేనికెంత పంచాలో చెప్పండి"

ఈ మొత్తం పరిణామాల్ని, మాటల్ని చూస్తే సంశయ లాభం (బెనిఫిట్ ఆఫ్ డౌట్) రీత్యా ఆలోచించినా ముఖ్యమంత్రిని సమర్థించలేం. అలవిమాలిన హామీలిచ్చి (అత్యంత ప్రమాదకరమైన పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) ప్రభుత్వోద్యోగులకు పునరుద్ధరిస్తామన్న హామీ సహా) ... ఏం చేయాలో చెప్పండని ఉద్యోగ సంఘాల వారిని అడగటం, ఎవరిమీదో రాజకీయ నిందలేసి వైఫల్యాన్ని కప్పిపుచ్చు కోవాలని చూడటం వల్ల ఫలితం ఉండదు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని విమర్శించేవారికి నిజంగా ప్రజా ప్రయోజనాలు, ప్రజాధనం పట్ల చిత్తశుద్ధి ఉంటే... ప్రాణహిత - చేవెళ్లను మళ్లీ ప్రారంభించాలనుకుంటారా, మూసీ నది ప్రక్షాళనకు వేల కోట్లు వెచ్చించాలనుకుంటూ, కాళేశ్వరాన్ని ఎలా ఉపయోగించుకోవాలన్న చర్చ లేవనెత్తకుండా మూతవేసేసి రాజకీయ లబ్ధి పొందటానికే అదేపనిగా ప్రయత్నిస్తుంటారా?

అదేవిధంగా, అంత డబ్బు ఖర్చుపెడుతున్నా ప్రభుత్వ స్కూళ్లలో చదువెందుకు రావటం లేదో తేల్చకుండా నానుస్తూ ఇంకా ఎన్ని తరాల పిల్లల జీవితంతో చెలగాటమాడతారు? ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుతున్నా, కొత్తగా 11 వేల మంది టీచర్లను నియమించామని ఘనంగా చాటుకోవడం, వివాదరహితంగా పదోన్నతులిచ్చామని చెప్పుకోవటం ఎంత వరకు సబబు? పిల్లల సంఖ్యకు తగ్గ ఉపాధ్యాయులు లేకనా తెలంగాణ ప్రభుత్వ స్కూళ్లలో చదువు సరిగ్గా రానిది, ఎక్కడో ఫోకస్ మిస్ అవుతున్నామని అదేదో మిలియన్ డాలర్ ప్రశ్నలుగా దాటవేయటం ఎంత బాధ్యతా రాహిత్యం?

నేరమే శిక్షా ముఖ్యమంత్రీ?

ఇక్కడే ఇంకోమాట చెప్పుకోవాలి. తన కుటుంబ సభ్యులను కించపరిచారని కొంతమంది యూట్యూబ్ ఛానళ్ల వారిపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి చిర్రుబుర్రులాడారు. అలాంటివారిని గుడ్డలూడదీసి కొడతామని హెచ్చరించారు. ప్రతివాడూ జర్నలిస్టు అయిపోతున్నాడని యూట్యూబర్లపై అక్కసు వెళ్లగక్కారు. రేవంత్‌గారూ! మీరు ముఖ్యమంత్రి; అసెంబ్లీలో మాట్లాడుతున్నారు; తెలంగాణ ప్రజలందరికీ భద్రత కల్పించాల్సినవారు; రాష్ట్రంలో శాంతిభద్రతల్ని పరిరక్షించాల్సిన వారూ ... మీ సొంత కుటుంబం కోసం స్థాయిని మరిచి ఇలా హెచ్చరించడం తగునా? ఒక నేరాన్నే శిక్షగా సాక్షాత్తూ ముఖ్యమంత్రే చట్టసభలో ప్రకటించడం ఎలాంటి సంకేతాలనిస్తుంది?

**తాత్కాలిక తాయిలాల ఎన్నికల గ్యారంటీలపై ప్రజలకు ఆర్థిక వాస్తవాల్ని వివరించి, పథకాల అమలును హేతుబద్ధీకరించి, దశల వారీగా అమలు చేయవచ్చు. ఈ రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించకుండా, సంచలన ప్రకటనలు, వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలతో కాలక్షేపం చేస్తే, ప్రజాదరణ ఇంకా పలచనవుతుంది.**

**ఒక్క రూపాయి అదనంగా ఖర్చవదు**

ముఖ్యమంత్రి లేవనెత్తిన వాటిల్లో విద్యారంగాన్ని బాగు చేయటం, దోషుల్ని చట్టబద్ధంగా శిక్షించేలా చేయటానికి ఒక్క రూపాయి అదనంగా ఖర్చు చేయనక్కర్లేదు. చాలా తేలిగ్గా తెలంగాణలో ప్రతి స్కూలు విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించొచ్చు, చట్టబద్ధపాలన అమలుచేయవచ్చు. అదేవిధంగా, తాత్కాలిక తాయిలాల ఎన్నికల గ్యారంటీలపై ప్రజలకు ఆర్థిక వాస్తవాల్ని వివరించి, పథకాల అమలును హేతుబద్ధీకరించి, దశల వారీగా అమలు చేయవచ్చు. ఈ రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించకుండా, సంచలన ప్రకటనలు, వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలతో కాలక్షేపం చేస్తే, ప్రజాదరణ ఇంకా పలచనవుతుంది.

ముఖ్యమంత్రి చెబుతున్న సమస్యలన్నిటికీ పరిష్కారాలున్నాయి. బాధితుడిలా ఏకరువు పెట్టటం, వర్ణించటం కాకుండా బాధ్యతగా వ్యవహరించండి. సమయం మించిపోకముందే మేలుకోండి. పరిష్కార కార్యాచరణ ప్రారంభించండి. నిజాయితీని చేతల్లో చూపండి. ✦

# ఎన్‌జేఏసీపై అన్యాయ తీర్పుకి మూల్యం చెల్లిస్తున్న సుప్రీంకోర్టు, దేశ ప్రజాస్వామ్యం

వార్తల్లోకి రాకూడనివాళ్లు మళ్లీ వచ్చారు, అదికూడా రాకూడని రీతిలో వచ్చారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు పెద్దసంఖ్యలో బయటపడ్డాయి. సుప్రీంకోర్టు గతానికి భిన్నంగా ఒకడుగు ముందుకేసి, మొత్తం అగ్నిప్రమాదం దృశ్యాల్ని వెబ్‌సైట్‌లో పెట్టింది. మీడియా కూడా ఈ వార్తను విస్తృతంగా కవర్ చేసింది. సుప్రీంకోర్టు ఈ అంశంపై ఎందుకు ఆలస్యంగా స్పందించింది? ఎఫ్ఐఆర్ ఫైల్ చేయకుండా భారత ప్రధాన న్యాయమూర్తి ఎందుకు నిరోధించారు? ఎందుకు కోట్ల రూపాయల నగదు పట్టుబడినా అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు? వంటి హేతుబద్ధ ప్రశ్నలు మీడియా విశ్లేషణల్లో పెరిగాయి. సుప్రీంకోర్టు ముగ్గురు జడ్జీల కమిటీతో అంతర్గత విచారణ జరుపుతున్నా, జస్టిస్ అయివుండి కూడా కోర్టు పరిధిలో ఉన్న అంశంపై యశ్వంత్ వర్మ స్పందించి నోట్ల కట్టలతో తనకు సంబంధం లేదని వివరణ ఇచ్చే ప్రయత్నం చేయటమేంటని కొందరు జర్నలిస్టులు, కాలమిస్టులు ప్రశ్నలు లేవనెత్తారు.

జస్టిస్ యశ్వంత్ వర్మ కేసులో ఏమి తేలుతుందో అలాఉంచితే, జడ్జి ఇంట్లో లెక్కలు చూపని డబ్బు ఉందనటానికి ప్రాథమిక సాక్ష్యాలు బలంగా ఉన్నాయి. మేం తేలుస్తాం కదా అని సుప్రీంకోర్టు అనొచ్చు, కొన్ని కేసుల్లో సదరు న్యాయమూర్తి హేతుబద్ధంగా, సమర్థంగా తీర్పులిచ్చారని వాదించవచ్చు ..కానీ, న్యాయమూర్తులు నిజా యితీగా వ్యవహరించటమే కాదు, నిజాయితీగా వ్యవహ రిస్తున్నట్లు కన్పించటం కూడా అవసరం. ఈరీత్యా, ఇంత బలమైన ఆధారాలతో లెక్కలు చూపని డబ్బు బయట పడినప్పుడు జస్టిస్ వర్మ రాజీనామా చేసి ఉండాల్సింది. కనీసం నిజం తేలేవరకు తనను సర్వీస్ నుంచి మినహా యించాలని సుప్రీంకోర్టుకు స్వచ్ఛందంగా అప్పీల్ చేయ వలసింది. పార్లమెంట్ కూడా ఈ విషయంలో స్పందించి, వేగంగా విచారణ పూర్తి చేయాలని కోరటం, అవసరమైతే రాష్ట్రపతి జోక్యం కోరుతూ నిష్పాక్షికంగా దర్యాప్తు జరిగేలా చూడటం, నేరం రుజువైతే సదరు జడ్జీని అభిశంసించటం చేయాలి(మే మొదటి వారంలో సుప్రీంకోర్టు కమిటీ రిపోర్టు ఇచ్చింది). అదే జరిగితే, 77 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో సస్పెండ్ అయిన మొదటి న్యాయమూర్తి జస్టిస్ వర్మ అవుతారు. అంతకుముందు జస్టిస్ రామస్వామి కేసులో ఇలాంటి సందర్భం వచ్చినా, కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేయటంతో ఆ అవినీతి జడ్జిని అభిశంసించటం సాధ్యం కాలేదు. పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవటం, న్యాయమూర్తుల సస్పెన్షన్‌కి నిర్దేశించిన సంక్లిష్ట ప్రక్రియ వెరసి .. ఎంతటి తప్పు చేసినా, అన్యాయం చేసిన న్యాయ మూర్తినైనా పదవి నుంచి తొలగించటం చట్టసభలకు సాధ్యం కాదనే పరిస్థితి మన దేశంలో నెలకొంది. తాజా కేసులోనైనా ఈ పరిస్థితి మారుతుందని ఆశిద్దాం.




పార్టీల విప్ జారీ, అంతర్గత ప్రజాస్వామ్యం మొదలైన అంశాలను అలా ఉంచితే అసలు అటువంటి అక్రమాలు, అవినీతికి ఆస్కారం లేకుండా ఏర్పాటు ఇప్పటిదాకా న్యాయవ్యవస్థలో ఎందుకు లేదన్నది పెద్ద ప్రశ్న.

ఈ ప్రశ్నకు సమాధానంగా, ముందుగా రాజ్యాంగ నిర్మాతల అభిప్రాయాన్ని చూడాలి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిని 'సంప్రదించి' భారత రాష్ట్రపతి ఉన్నత న్యాయ మూర్తుల నియామకం చేయాలన్నది రాజ్యాంగం నిర్దేశించిన

ప్రక్రియ. రాష్ట్రపతి ప్రతిపాదనతో సీజేఐ 'ఏకీభవించాలన్న' ప్రతిపాదనను ప్రమాదకరమైనదిగా రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ అంబేద్కర్ తిరస్కరించారు. అదేవిధంగా పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభల్లో ఓటు ద్వారా జడ్జీల ఎంపిక ... నియామకాల్ని సంక్లిష్టం చేస్తుందని భావించారు. అందువల్ల సంప్రదించే పద్ధతిని ఏర్పాటును చేశారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న సభలను, కార్యనిర్వాహక వ్యవస్థను కాదని .. ఎంతటి సమర్థుడు, నిజాయితీ పరుడైనా ప్రజలు ఎన్నుకొనని సీజేఐ న్యాయమూర్తుల నియామకంపై సొంతంగా నిర్ణయం తీసుకోలేరని అంబేద్కర్ స్పష్టం చేశారు. స్వతంత్రం వచ్చిన తొలి రెండు దశాబ్దాల పాటు పరిస్థితి సజావుగా సాగి, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన పద్ధతిలో సమర్థత, నిజాయితీ, నిష్పాక్షితకు మారుపేరైనవారు ఎక్కువ శాతం న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం పెంచారు. కానీ ఎమర్జెన్సీ తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆ సమయంలో ప్రధాని ఇందిరాగాంధీ, న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీశారని, రాజ్యాంగ విలువల్ని కాలరాస్తూ 42వ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చారని భావించి ఆ తర్వాత న్యాయ నియామకాలపై సుప్రీంకోర్టు క్రమంగా పట్టు బిగించింది. ఇది 1990లలో కొలీజియం తీర్పుకి దారితీసింది. రాజ్యాంగ పరిరక్షణ పేరుతో రాజ్యాంగ విరుద్ధంగా, రాజ్యాంగానికి అతీతంగా ప్రపంచంలోని ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ లేని రీతిలో న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించుకునే పద్ధతిని ప్రారంభించారు. జడ్జీలుగా కొందరు అద్భుతమైన, మచ్చలేని కోవిదులు ఉన్నప్పటికీ, ఒక వ్యవస్థగా భారత న్యాయప్రక్రియలో బలహీనతలు పెరగనారంభించాయి. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యానికి మచ్చలేని మూలస్తంభమైన న్యాయవ్యవస్థ స్వతంత్రతను, సామర్థ్యాన్ని విశ్వసనీయతని పెంచేందుకు వ్యవస్థీకృత నిర్మాణాల సంస్కరణల కోసం 1990ల చివరి నాటి నుంచి లోక్‌సత్తా కృషిని ప్రారంభించింది.

ఉన్నకొద్దీ దిగజారుతున్న రాజకీయాల పట్ల జుగుప్సతో ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల గౌరవం, నమ్మకం కొంతమేర ఉన్నాయిగానీ.. కోర్టులకెళ్తే అంత తేలిగ్గా న్యాయం జరుగుతుందన్న నమ్మకం కోట్లాది సామాన్య ప్రజలకు లేదు. కోర్టులకెక్కినవాళ్లు కూడా అక్కడి న్యాయమూర్తుల్లో పెరుగుతున్న అవాంఛనీయ ధోరణులు, ఖర్చులు, జాప్యాలతో విసిగివేసారిపోతున్నారు. దీనికితోడు నేరదర్యాప్తులో, ప్రాసిక్యూషన్ నియామకంలో రాజకీయ జోక్యం తీర్పుల నిష్పాక్షికతను దెబ్బతీస్తోంది. కోర్టులకెళ్తే కేసులు ఎప్పటికి తెములుతాయో, అసలు న్యాయం జరుగుతుందో లేదో,



courtesy:Cartoon by Manjul

ఎంత ఖర్చు అవుతుందో, దోషులకు శిక్ష పడుతుందో లేదో తెలియని పరిస్థితుల్లో ఎక్కువమంది బాధితులు కోర్టు వెలుపల బండన్యాయం వైపు మొగ్గు చూపుతున్నారు. కండబలం, కులం బలం గల గూండాలు అప్రకటిత న్యాయ మూర్తుల్లా వ్యవహరిస్తున్నారు. అందుకే మన దేశంలో క్రిమినల్ కేసుల కంటే సివిల్ కేసులు తక్కువగా నమోదవుతుంటాయి. మిగతా అన్ని పెద్ద ప్రజాస్వామిక దేశాల్లో పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది. అండర్ ట్రయల్స్‌గా జైళ్లలో సామర్థ్యానికి మించి ఖైదీల్ని కుక్కుతుంటే వాళ్లల్లో పలువురు దోషులో, నిర్దోషులో తేలకుండా సంవత్సరాలు, దశాబ్దాల తరబడి వాటిల్లో మగ్గుతుంటే .. ఓటుకు నోట్లు తీసుకునే వారిని జైళ్లలో పెట్టాలని మన సమాజంలో కాస్త ఆలోచించేవారు కూడా డిమాండ్ చేసే స్థాయి చర్చ మనది. దేశంలో ఒక్క నియోజకవర్గంలో డబ్బు తీసుకున్న ఓటర్లను ఖైదు చేయటానికి కూడా మన జైళ్లన్నీ కలిపినా సరిపోవు. ఇలాంటి పరిస్థితుల మధ్య ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా న్యాయ సంస్కరణల కృషి కొనసాగింది.

ప్రధానంగా సుప్రీంకోర్టు, హైకోర్టులలో సమర్థులు, నిజాయితీపరులైనవారు న్యాయమూర్తులుగా ఎంపికయ్యేలా చేయటం, ఒకవేళ వాళ్లలో ఎవరైనా తప్పు చేస్తే పెద్ద సంక్లిష్టత లేకుండా జవాబుదారీ చేయటం, పరిజ్ఞానం, సామర్థ్యం, నిబద్ధతగల యువత న్యాయవ్యవస్థలోకి ఆకర్షితులయ్యేలా సివిల్ సర్వీసెస్ తరహాలో అఖిల భారత స్థాయి ఎంపిక పరీక్ష, న్యాయం అత్యంత చౌకగా, వేగంగా అందుబాటులోకి వచ్చేందుకు, మహిళలపై పెద్దస్థాయి నేరాలను నివారించేందుకు ఎక్కడికక్కడ స్థానిక కోర్టుల ఏర్పాటు, ఇవన్నీ ప్రభావశీలంగా పనిచేసేందుకు నేర దర్యాప్తు పోలీసు విభాగాన్ని రాజకీయం నుంచి వేరు చేయటం, స్వతంత్ర ప్రాసిక్యూషన్, అత్యాధునిక ఫోరెన్సిక్, తదితర నేర నిర్ధారణ సాంకేతికతల అందుబాటు, కమ్యూనిటీ పోలీసింగ్ మొదలైన సంస్కరణల్ని, ఏర్పాట్లని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జేపీ ప్రతిపాదించారు.

వీటిలో గ్రామ న్యాయాలయాల చట్టం పేరుతో 2009లో స్థానిక కోర్టుల చట్టం వచ్చింది. దీన్ని పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇదే సమయంలో న్యాయ మూర్తుల్ని న్యాయమూర్తులే నియమించుకునే కొలీజియం ఏర్పాటు తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ వర్మ, ప్రజలకు న్యాయవ్యవస్థపై విశ్వాసం పెరిగేలా అడ్డదారిలో సుప్రీంకోర్టును ఆశ్రయిం చటానికి వీలుగా 'పిల్' (పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్) పద్ధతికి నాంది పలికిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వీఆర్ కృష్ణ అయ్యర్, మరో సుప్రసిద్ధ న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటా చలయ్యలతో కమిటీ వేసి ఉన్నత న్యాయమూర్తుల నియా మకానికి 'జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్' (ఎన్‌జేఏసీ) బిల్లుని జేపీ రూపొందించారు. దీన్ని పూర్తిగా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తాయే డ్రాఫ్ట్ చేయవచ్చుగానీ, సుప్రీంకోర్టు అభిజాత్యానికి పోయి చట్టాన్ని కొట్టేసే ప్రమాదం ఉన్నందున .. మచ్చలేని ముగ్గురు అత్యున్నత స్థాయి న్యాయ మూర్తుల ఆధ్వర్యంలో ఎన్‌జేఏసీని జేపీ రూపొందించారు.

ఆ తర్వాత ఎన్‌జేఏసీ బిల్లుకి అధికార యూపీయేని, ప్రతిపక్ష బీజేపీని జేపీ ఒప్పించారు. పార్లమెంటులో అన్ని పార్టీల సభ్యులూ కలిసి వచ్చారు. ఈలోగా ఎన్నికలొచ్చి నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన, మొట్టమొదట ఆమోదిం పజేసిన బిల్లు యూపీయే హయాంనాటి ఎన్‌జేఏసీ కొద్దిపాటి మార్పులతో. ఆ తర్వాత ఆరు నెలల్లోగా సగానికి పైగా రాష్ట్రాలు దీన్ని ధృవీకరించాయి. 2014, డిసెంబర్ 31న ఎన్‌జేఏసీ చట్టానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు.

యూపీయే, ఎన్డీయే, ప్రాంతీయ పార్టీలు తేడా లేకుండా ప్రజలు ఎన్నుకున్న చట్టసభలు ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టాన్ని అక్టోబర్ 16, 2015న సుప్రీంకోర్టు ధర్మాసనం 4–1 మెజారిటీతో కొట్టివేసింది. ఇలాంటి ప్రమాదాన్ని ముందే ఊహించి ధర్మాసనానికి, అన్ని ప్రధాన జాతీయ పార్టీల నేతలకు, పార్లమెంటు సభ్యులకు, జేపీ సవివరంగా ఎన్‌జేఏసీ ఆవశ్యకతను వివరించే లేఖను, రాజ్యాంగ నిర్మాణ సమయంలో అంబేద్కర్ అభిప్రాయాలను, వివిధ పరిణత ప్రజాస్వామ్య దేశాల్లో జడ్జీల నియామక పద్ధతుల్ని, ఎన్‌జేఏసీ రూపకల్పన సమయంలో ముగ్గురు సుప్రసిద్ధ జస్టిస్‌లూ లేఖల రూపంలో పంచుకున్న అభిప్రాయాలతో కూడిన పుస్త కాన్ని పంపించారు. అయినా న్యాయమూర్తుల బెంచ్‌లో అత్యధికులు పట్టించుకోలేదు.

సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన రోజు జేపీ మాట్లాడుతూ, ఈ

**భారత రాజ్యాంగం 75 ఏళ్ల వార్షికోత్సవం జరుపుకుంటోంది. ఆ రాజ్యాంగం కింద సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు స్వీకరించి కూడా 75 ఏళ్లు అవుతోంది. రిపబ్లిక్ తొలినాళ్ల నుంచి ప్రభుత్వం, న్యాయవ్యవస్థ మధ్య కొన్ని పరస్పర అనవసర జోక్యాలున్నా మొత్తం మీద తొలి రెండు దశాబ్దాలు ఆరోగ్యకరమైన అధికారాల విభజన పాటించాయి. అయినా తగిన వ్యవస్థీకృత ఏర్పాటు చేయలేకపోవటం వల్ల 1975లో మొదలైన ఒడిదుడుకులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. 75 ఏళ్ల తర్వాతైనా న్యాయవ్యవస్థ, ప్రభుత్వం ఈ లోపాన్ని సరిదిద్దాలి.**

తీర్పును అత్యున్నత న్యాయస్థానం సరిదిద్దుకునే రోజు తప్పక వస్తుందని, ప్రజాస్వామ్యంలో ఎవరూ ప్రజలు ఎన్నుకున్న సభ కంటే, రాజ్యాంగం కంటే ఎక్కువ కాదని స్పష్టం చేశారు. పార్లమెంట్ రాజ్యాంగ సభలా వ్యవహరించి ఈ వైఫల్యాన్ని సరిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. అయితే మోదీ ప్రభు త్వం అంత సాహసం చేయలేకపోయింది. అదేవిధంగా, జేపీ లేఖలోని విజ్ఞప్తికి మద్దతుగా అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ జవాబు లేఖ రాశారుగానీ, దాన్నో జాతీయ ఎజెండాగా మలచలేకపోయారు. రాజకీయం పట్ల ... చిన్నచూపు ఉన్న సమాజంలో, కోర్టుల పట్ల కాస్త ఎక్కువ నమ్మకం ఉండటం సహజం. అలాంటప్పుడు కోర్టు తీర్పుకి వ్యతిరేకంగా, ఉన్నత న్యాయమూర్తుల నియామకాల్లో ప్రభుత్వం, పౌర సమాజ ప్రతినిధులు కూడా ఉండాలని ఎన్‌జేఏసీ అమలు ఆవశ్యకతను వివరిస్తూ ఓట్లు సంపాదిం చటం అంత తేలిక కాదు.

కానీ, జేపీ అనుకున్నదానికంటే ముందుగానే సుప్రీంకోర్టు తన తప్పును దిద్దుకునే అవకాశం లభించింది. సాక్షాత్తూ హైకోర్టు జడ్జి ఇంట్లో నోట్ల కట్టలు అలా బయటపడటం సాధారణ ప్రజానీకానికి కూడా వెగటు కలిగిస్తోంది. జస్టిస్ యశ్వంత్ వర్మని ట్రాన్స్‌ఫర్ చేసిన అలహాబాద్ హైకో ర్టులోనైతే, మా కోర్టేమీ చెత్తకుప్ప కాదని న్యాయవాదులు ఆందోళన చేశారు. పదేళ్ల క్రితం ఎన్‌జేఏసీని వ్యతిరేకించిన పౌర సమాజం, మీడియాలోని కొన్నివర్గాలు, ఆలోచనా పరులు కూడా ఇప్పుడు మళ్లీ ఆ సంస్థాగత ఏర్పాటును ఎలా తేవచ్చు అనే చర్చ చేస్తున్నారు.

భారత న్యాయవ్యవస్థ ప్రపంచంలోనే గర్వించదగ్గ రీతిలో వ్యవహరించిన సందర్భాలున్నాయి. అయోధ్య రామమం

దిరం –బాబ్రీ మసీదు వివాదం, రాష్ట్రాల మధ్య నదీజలాల పంపకం వంటి అంశాలను న్యాయస్థానం తప్ప రాజకీయం పరిష్కరించలేదు. కానీ అదే సమయంలో కొన్ని అనవసర జోక్యాలు, విపరీత వ్యాఖ్యానాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వోద్యోగుల పెన్షన్ విషయంలో, ఇటీవల ఎన్నికల సంఘం నియామకాలు, 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టం, రాష్ట్రపతి పరిధి వంటి విషయాల్లో తిరోగమన రీతిలో వ్యవహరించింది. కేశవానంద భారతి కేసులో ఇచ్చిన తీర్పులో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చకూడదని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పిందితప్ప .. ఆ మౌలిక స్వరూపం పీఠికలో ఎలా ఉండాలో నిర్వచించలేదు. ఆ మౌలిక స్వరూపంలోని అంశాలేమిటి అని కోర్టుకెళ్లి అడగాలంటే నిపుణులు, దేశభక్తులైన ప్రజాసేవకులు కూడా ఈవేళ భయపడుతున్నారు. పొరపాటున అపరిపక్వ తీర్పొస్తే మళ్లీ దాన్ని సరిదిద్దటానికి కొన్నేళ్లపాటు వేచి ఉండాల్సి వస్తుందని హడలిపోతున్నారు.

సుప్రీంకోర్టు స్వతంత్రతని, గౌరవాన్ని విశ్వసనీయతని కాపాడుకోవడం చట్టసభలు, కార్యనిర్వాహక వ్యవస్థ, పౌరులుగా మనందరి బాధ్యత. అదే సమయంలో సుప్రీంకోర్టు కూడా తనకున్న రాజ్యాంగ పరిరక్షణ విధి ముసుగులో రాజ్యాంగానికి అతీతంగా, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరించకుండా తనవైపు నుంచి దిద్దుబాట్లకి సిద్ధపడాలి. రాజకీయ నాయకులు మోసకారులు, ప్రజలు సరైన నిర్ణయాలు తీసుకోలేరు, కాబట్టి మేం స్వయం భూలుగా, దైవదూతల్లా వ్యవహరిస్తామంటే చెల్లదు. కచ్చితంగా ప్రజలు ఎన్నుకున్న వ్యవస్థలకి .. ఎన్నుకోని వ్యవ స్థలు జవాబుదారీ కావాలి.

జస్టిస్ యశ్వంత్ వర్మ కేసు, అంతకు ముందు జస్టిస్ శేఖర్ యాదవ్ వంటివారు చేసిన వ్యాఖ్యలు తాజా మేలుకొలుపులు. 2018లో ముగ్గురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అసాధారణ రీతిలో మీడియా ముందుకు వచ్చి అత్యున్నత న్యాయస్థానం వైఖరిని ఎండగట్టిన తీరు మర్చిపోకూడదని హెచ్చరిక. కోర్టుల్లో కేసులు పేరుకుపోవటం, పేదలు, అణగారిన వర్గాలు జైళ్లలో ఏళ్ల తరబడి అండర్ ట్రయల్స్‌గా మగ్గిపోతుండటం ప్రమాద ఘంటికలు. బెయిలు కోసం కూడా సుప్రీంకోర్టుకు రావటం వంటి ఈ వైఫల్యాల జాబితాలో సోషల్ మీడియా ప్రచారం, ప్రభావం సహా ఇంకా చాలా అంశాల్ని చేర్చవచ్చు.

కాబట్టి సుప్రీంకోర్టు తన తప్పుల్ని దిద్దుకునేందుకు చొరవ చూపాలి. ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం వంటివి లేకుండా సమర్థులు, నిజాయితీపరులు, అన్నివర్గాలకూ ప్రాతినిధ్యం వహించే వారూ ఎంపికయ్యేలా ఎన్‌జేఏసీ పునరుద్ధరణకు తక్షణం విస్తృత ధర్మాసనం ఏర్పాటు చేయాలి. పదేళ్ల క్రితం నాటి తప్పును సరిదిద్దుకోవాలి.

అదేవిధంగా న్యాయమూర్తుల జవాబుదారీతనానికి చట్ట పరిజ్ఞానం, సామర్థ్యం గల యువత ఈ రంగంలోకి రావటానికి పోటీపడేలా ఐఏఎస్, ఐపీఎస్ తరహాలో ఐజేఎస్‌ను ఏర్పాటు చేయటానికి ప్రభుత్వానికి మార్గ దర్శనం చేయాలి. పిల్స్, సుమోటోలు, బెయిల్ పిటిషన్ల పేరుతో జిల్లా కోర్టుల స్థాయి కేసుల్ని తీసుకోవడం మానేయాలి. రాజ్యాంగ ధర్మాసనం స్థాయి కేసులకు సుప్రీంకోర్టు పరిమితం కావాలి. ఈ దేశంలోని ప్రజలందరికీ సమన్యాయం నిష్పాక్షికంగా, సమర్థంగా అందుతుందని, చిట్టచివరి పౌరుని వరకూ చట్టబద్ధ పాలన తేలిగ్గా, ఖర్చులేకుండా అందుబాటులో ఉంటుందని భరోసా కల్పించాలి. ప్రజాస్వామ్య పరిరక్షణలో తన కీలక పాత్రను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలి. ✦

# రాష్ట్రాల 'స్వయం సాధికారత' పై ఉన్నతస్థాయి కమిటీ

రాష్ట్రాల హక్కులపై తన వాణిని బలంగా వినిపించటంతోపాటు, రాష్ట్రాల స్వయం సాధికారత కోసం అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఈ కమిటీ పనిచేస్తుందని, సభ్యులుగా ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్, విశ్రాంత ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, తమిళనాడు ప్రణాళికా సంఘం మాజీ వైఎస్ ఛైర్మన్ నాగనాథన్ ఉంటారని వెల్లడించారు. 'రాష్ట్రాల చట్టబద్ధ హక్కులను పరిరక్షించటంతో పాటు, యూనియన్, రాష్ట్రాల మధ్య సంబంధాలను మెరుగుపరచటమే ఈ కమిటీ లక్ష్యం అని స్టాలిన్ వివరించారు. 2026 జనవరి నాటికి కమిటీ మధ్యంతర నివేదికను ఇస్తుందని, రెండేళ్లలో పూర్తి నివేదికను అందచేస్తుందని తెలిపారు. యూనియన్ ప్రభుత్వం క్రమంగా రాష్ట్రాల హక్కులను హరిస్తోందని విమర్శించారు.'రాజ్యాంగం ప్రకారమే యూనియన్, రాష్ట్రాలు ఏర్పాటయ్యాయి. ఎవరూ ఎవరికీ సబార్డినేట్ కాదు' అని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ తేల్చిచెప్పారని స్టాలిన్ పేర్కొన్నారు. ఒకదానితో ఒకటి సహకరించుకోవాలని సూచించారని తెలిపారు.

# సామాజిక మధ్యవర్తిత్వ కమిటీల కన్నా గ్రామ / స్థానిక న్యాయాలయాల ఏర్పాటు మేలు

న్యాయస్థానాల్లో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, వివాదాలకు తొలిదశలోనే పరిష్కారం చూపాలనే ఉద్దేశ్యంతో మధ్యవర్తిత్వ చట్టం కింద సామాజిక మధ్యవర్తిత్వ కమిటీలను ఉన్నత న్యాయస్థానం ఏర్పాటు చేస్తోంది. అన్ని రకాల కేసులూ కాదుగానీ, కుటుంబసభ్యుల మధ్య, కొన్ని ఇళ్ల మధ్య వివాదాలు ముదిరి శాంతి భద్రతల సమస్యగా మారినప్పుడు సామాజిక మధ్యవర్తిత్వం వల్ల తక్షణ, ఆమోద యోగ్య పరిష్కారం లభిస్తుందని న్యాయవ్యవస్థ విశ్వసిస్తోంది.

ఈ అంశంపై ఇటీవల తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో అవగాహన కార్యక్రమం జరిగింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ సుజయ్‌పాల్ ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొని, సామాజిక మధ్యవర్తులతో ముఖాముఖి మాట్లాడి, వివిధాంశాలపై స్పష్టత నిచ్చారు.

ఒకప్పుడు గ్రామాల్లో పెద్దలు ఇచ్చే తీర్పులకు తిరుగుండేది కాదని, ప్రస్తుతం చట్టబద్ధంగానే వారు తీర్పులిచ్చేలా సామాజిక మధ్యవర్తిత్వ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జస్టిస్ సుజయ్‌పాల్ తెలిపారు. మధ్యవర్తిత్వ కమిటీలో ప్రతి సామాజికవర్గం నుంచి కొంతమందిని ఎంపిక చేసి, శిక్షణ ఇస్తామన్నారు. వారు తమ సామాజిక వర్గం నుంచి వచ్చే ఫిర్యాదులను తీసుకుని సామరస్యంగా కేసును ముగించేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తారన్నారు. ఇటీవలి కాలంలో కుటుంబ తగాదాలు పెరిగిపోతున్నాయని, ఇలాంటి కేసుల్లో సామాజిక మధ్యవర్తుల వల్ల ప్రారంభంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని వివరించారు.

వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ పరిపాలన న్యాయమూర్తి, హైకోర్టు జడ్జి జస్టిస్ మౌసమి భట్టాచార్య హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా మాట్లాడుతూ ... ఇప్పటికే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఏర్పాటు చేసిన సామాజిక మధ్యవర్తిత్వ కేంద్రాలు సత్ఫలితాల్ని ఇస్తున్నాయన్నారు. అమెరికాలో వంద కేసుల్లో కేవలం మూడు కేసులే విచారణ వరకు వస్తాయని, మిగతావి మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం అవుతాయని జస్టిస్ లక్ష్మణ్ పేర్కొన్నారు.

ఇప్పటికే గ్రామాల్లో సామాజికవర్గాల వారీగా పెద్దలు పంచాయితీలు చేసి వివాదాలను పరిష్కరిస్తున్న విషయం అందరికీ తెలుసని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ సీహెచ్ పంచాక్షరి పేర్కొన్నారు. కాకపోతే అక్కడ డిపాజిట్లు (ఇరు వర్గాల నుంచి కొంత మొత్తం నగదు

**తెలుగు రాష్ట్రాల్లో ఒక్క గ్రామ న్యాయాలయమూ ప్రారంభం కాలేదని యూనియన్ న్యాయశాఖామంత్రి పార్లమెంటులో తెలిపారు. తెలంగాణలో 55, ఏపీలో 42 గ్రామ న్యాయాలయాలను నోటిఫై చేయగా, ఇంతవరకూ ఒక్కటి కూడా పనిచేయటంలేదని చెప్పారు. దేశవ్యాప్తంగా కేవలం 230 గ్రామ న్యాయాలయాలు (సుమారు 5000 వరకూ అవసరం) ప్రారంభమైనట్లు వివరించారు.**




తీసుకుంటారు) పెట్టి పంచాయితీలు చేస్తారని, సామాజిక మధ్యవర్తిత్వ కేంద్రంలో అలాంటివి ఉండవని వివరించారు.

కాగా, సామాజిక పంచాయితీలకు గుర్తింపునివ్వటం ఒకరకంగా కుల స్పృహను మరింత పెంచటమేనని, పైకి ఏం చెప్పినా ఇవి ఖాప్ పంచాయితీల్లా మారే ప్రమాదం ఉందని కొందరు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో నాయకత్వం, పట్టణీకరణలో కులం స్పృహ తగ్గుతున్నప్పుడు, కుటుంబ, సామాజిక పర్యవేక్షణ పలచబడుతున్నప్పుడు చట్టపరమైన సమస్యలు ఇంకా పెరగటమే తప్ప, తగ్గటం ఉండదని ... ఈ నేపథ్యంలో సామాజిక పంచాయితీల కన్నా 2009లో వచ్చిన (లోక్‌సత్తా కృషి వల్ల) గ్రామ న్యాయాలయాల చట్టాన్ని సమర్ధంగా అమలు చేయటం, ఈ చట్టం ద్వారా స్థానిక కోర్టుల్ని పట్టణ ప్రాంతాల్లో నెలకొల్పడం ద్వారా న్యాయాన్ని వేగంగా, చౌకగా అందించవచ్చని సూచిస్తున్నారు. నేరం జరిగాక శిక్ష విధించటం కంటే, నేరం జరగకుండా నివారించడం ముఖ్యమని, ఈ దిశగా, ముఖ్యంగా మహిళలపై నేరాలను తొలిదశలోనే కట్టడి చేసి, వారి భద్రతకు, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను పెంచేలా కార్మిక శక్తిలో వారి చురుకైన భాగస్వామ్యాన్ని పెంచటంలో గ్రామ/స్థానిక న్యాయాలయాల చట్టం ఉపయోగపడుతుందని, ఈ దిశగా హైకోర్టులు, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అధ్యక్షా, అరుదైన చర్చ!



విద్యాశాఖ పద్దుపై తెలంగాణ వార్షిక బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో ఇటీవలి చర్చలో పలువురు సభ్యులు వాస్తవ పరిస్థితుల్ని తెలియజెప్పే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఆరువేల స్కూళ్లను మూసివేశారని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారని, కానీ ఇప్పుడు విద్యాశాఖ సీఎం వద్దనే ఉన్నా గత సంవత్సరంలో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది 3.60 లక్షల మంది విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిందని సభ్యులు ప్రశ్నించారు.

"ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా 37 వేలమంది టీచర్ల నియామకం జరిగినా తెలంగాణలో పాఠశాలలు మూతపడటం బాధాకరం. 2024-25 విద్యా సంవత్సరంలో 1800కి పైగా పాఠశాలల్లో విద్యార్థులు చేరకపోవటం దయనీయం. 11 వేలకు పైగా ఉన్న ప్రయివేట్ పాఠశాలల్లో 31 లక్షలమంది విద్యార్థులుంటే, 29,500కి పైగా ఉన్న ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షలమందే ఉన్నారు. ముమ్ముందు మరిన్ని పాఠశాల లు మూతపడే పరిస్థితులున్నాయి" అని బీఆర్ఎస్ సభ్యులు ప్రస్తావించారు.

పాఠశాలల్లో బెంచీల కొనుగోలులో భారీ కుంభకోణం జరిగింది. సూత్రధారి గతంలో బీఆర్ఎస్‌తో కలిసి ఉంటే .. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంతో ఉన్నారు. రూ.4-5 వేల విలువైన బెంచీల కోసం రూ.14-18వేలు ఖర్చు చేశారు" అని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ అన్నారు. "పేర్లు పెట్టటం చాలా తేలిక. కానీ పేరు సంపాదించటం చాలా కష్టం" అని వ్యాఖ్యానించారు.

**అంకెల్లో తేడా తప్ప .. వైఫల్యం వాస్తవం**

రాష్ట్రంలో ప్రభుత్వ బడులు, అందులో పిల్లలు తగ్గుతుండటం, ప్రయివేటులో పెరుగుతుండటంపై సభ్యులు వ్యక్తం చేసిన ఆవేదనకు శాసనసభలో ప్రవేశపెట్టిన ఫలితాల బడ్జెట్ నివేదిక అద్దం పట్టింది. బడులు, విద్యార్థుల గణాంకాల్లో కాస్త అటుఇటుగా తేడాలున్నా, విద్యలో ప్రభుత్వ వైఫల్యం వాస్తవమని ప్రసంగాలు, నివేదికా స్పష్టం చేశాయి.

**నివేదికలోని ముఖ్యాంశాలు:**

⏭ తెలంగాణ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుతోంది. 2021-22లో 2,97,324మంది, 2022-23లో 2,81,938మంది, 2023-24లో 3,16,571మంది, 2024-25లో 3,33,269 మంది టీచర్లు ఉన్నారు. గతేడాదితో పోల్చుకుంటే, ప్రస్తుత విద్యా సంవత్సరంలో 16,698మంది పెరిగారు.

⏭ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గుతుండగా... ప్రయివేటు స్కూళ్లు పెరుగుతున్నాయి. అన్ని శాఖల పరిధిలోని ప్రభుత్వ బడులు 2022-23లో 30,178 ఉండగా... 2023-24లో 30,143; 2024-25లో 30,137కి తగ్గాయి. అదే సమయంలో ప్రయివేటు పాఠశాలల సంఖ్య వరుసగా .. 10,478; 10,832; 11,257గా ఉంది.

⏭ 2014-15 విద్యా సంవత్సరం నుంచి 2024-25 వరకు .. అంటే 11 సంవత్సరాల్లో అత్యధికంగా 2015-16లో రాష్ట్రంలోని అన్నీ పాఠశాలల్లో బాలికల సంఖ్య 29,52,331గా ఉంది. ఆ తర్వాత వారి సంఖ్య తగ్గుతూ వచ్చింది. గత విద్యా సంవత్సరం (2023-24)లో 28,46,583 మంది మాత్రమే ఉన్నారు. ఈసారి మళ్లీ 29,23,939కి పెరిగారు.

⏭ 2024-25 విద్యా సంవత్సరం మధ్యాహ్న భోజన పథకాన్ని 18.16 లక్షల మంది వినియోగించుకుంటారని భావించగా ... 13.58 లక్షలకే పరిమితమైంది.

**ఉన్నత విద్యాశాఖ పరిధిలో....**

రాష్ట్రంలో 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు 6,008 అధ్యాపక పోస్టులు మంజూరయ్యాయి. 2023 నుంచి జూనియర్ కళాశాలల్లో భవనాల నిర్మాణానికి నిధుల మంజూరు తప్ప ఖర్చు చేయటం లేదు.

**ఉపాధ్యాయ సంఘాల వంకలు**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గటానికి ఉపాధ్యాయ సంఘాలు ఒక్కోసారి ఒక్కో వంక చెబుతున్నాయి. ఇంగ్లీష్ మీడియం లేకపోవటం వల్లే పిల్లలు చేరటం లేదని కొంతకాలం చెప్పారు. దాంతో ప్రభుత్వం 2022-23 సంవత్సరం నుంచి గణనీయ స్థాయిలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. ఆ తర్వాత పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) విద్య లేకపోవటం, ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్ లేకుండా మల్టీగ్రేడ్ టీచింగ్ కారణంగా చెబుతున్నారు. కానీ తరగతికి ఒక టీచర్ ఉన్నచోట కూడా నాణ్యమైన విద్య అందటం లేదని కొందరు నిపుణుల సర్వేలు తేల్చిన విషయాన్నే తాజా నివేదిక కూడా ధ్రువీకరించింది. (ఇది శాంపిల్ రీత్యా కొంత అతిశయోక్తిలా అనిపించినా, ఇందులో కూడా కొంత వాస్తవముందని అంగీకరించక తప్పదు).

**అసలు సమస్యను స్పష్టంగా ప్రస్తావించిన ముఖ్యమంత్రి**

సభ్యుల్లో ఎక్కువమంది మొట్టమొదటిసారిగా తెలంగాణ విద్యారంగంలోని సమస్యను సభాముఖంగా గుర్తించే ప్రయత్నం చేయగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరింత స్పష్టతతో సమస్యను గుర్తించి పరిష్కారానికి ఆత్మశోధన గావించుకునే ప్రయత్నం చేశారు. శాసనమండలిలో విద్యపై చర్చకు సుదీర్ఘ సమాధాన మిచ్చారు. విద్యారంగంలో అసలు సమస్య - నాణ్యమైన ప్రమా ణాలు లేకపోవటమేనని స్పష్టం చేశారు. అభ్యసన సామర్థ్యాలపై ఏ ఒక్క పార్టీనో, ప్రభు త్వాన్నో తప్పుపట్టే ప్రయత్నం చేయకుండా, ఒక వ్యవస్థీకృత సమస్యగా, అందరి సహకారంతో పరిష్కరించాలనే రాజకీయ విజ్ఞతను, వాస్తవిక దృక్పథాన్ని ప్రదర్శించారు.

"2021లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే జరిగింది. అందులో మూడు, అయిదు తరగతి విద్యార్థుల్లో 75 శాతం మంది ఏ సబ్జెక్ట్‌లోనూ కనీస ప్రాథమిక సామర్థ్యం కనబరచలేదు. స్కూళ్లలో తరగతి స్థాయి, సామర్థ్యం లేకున్నా మార్కులు మాత్రం బ్రహ్మాండంగా వస్తున్నాయి. విద్యాశాఖను సమూల ప్రక్షాళన చేసి .. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం

### తెలంగాణ ఉద్యమ సమయంలోనూ చర్చ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సత్తా జేపీ శాసనసభ్యుడిగా వున్నప్పుడు తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతుండేది. అసెంబ్లీకి తరచూ అంతరాయాలు ఎదురవుతుండేవి. అలాంటి వాతావరణంలో .. టీచర్లున్న చోట పదిమంది పిల్లల్లేని, పిల్లల్లేని చోట్ల పలువురు టీచర్లున్నా ప్రభుత్వ టీచర్లున్నా ప్రభుత్వ స్కూళ్ల నుంచి జేపీ ప్రస్తావిస్తే సభ మొత్తం షాకయింది. సుమారు ఐదు గంటలపాటు తీవ్రంగా చర్చించింది. పాఠశాలల హేతుబద్ధీకరణ అంశాన్ని తొలుత లేవనెత్తింది లోక్‌సత్తాయే.

దృఢంగా నిర్ణయం తీసుకుంది. ఎప్పటికప్పుడు నిర్ణీత కాల వ్యవధిలో పరిస్థితులు బేరీజు వేసి సూచనలు ఇచ్చేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటుచేశాం. రాజకీయ పార్టీ కోణంలో కాకుండా, సామాజిక బాధ్యతగా భావించి పరిష్కారాలు, సలహాలు ఇవ్వదల్చుకున్నవారు విద్యా కమిషన్‌కు అందించాలి. విద్యను బాగుచేయాలన్న తపనతో ఆ శాఖను నేనే నిర్వహిస్తున్నాను. అఖిలపక్షంలో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన నూతన విద్యా విధానం అమలు చేస్తాం" అని ముఖ్యమంత్రి ప్రక టించారు. పాఠశాల విద్య ప్రక్షాళనకు చేతులు కలుపుదామని పార్టీలు, **పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలకు జేపీ విజ్ఞప్తి**

విద్యపై భారత చట్టసభల్లో ఎక్కువసేపు చర్చ జరగటం చాలా అరుదు. పార్లమెంటులో విద్యను చర్చించి బహుశా ఎన్నో ఏళ్లు దాటిపోయి ఉంటుందేమో. ఈ విషయాన్ని వివిధ సందర్భాల్లో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రస్తావిస్తూ, మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నాలుగున్నర గంటలపాటు ఒక చర్చ జరిగిందని, అయితే అది మన దేశంలోని విద్యా వ్యవ స్థలోని లోపాల్ని సరిచేసే లక్ష్యంతో సమగ్రంగా జరిగింది కాదని, ఐఏఎస్ పరీక్షల్లో లాజిక్ (యాప్టిట్యూడ్) సబ్జెక్ట్ ఉండాలా, వద్దా అనే పరిమితాంశం చుట్టూ, అది కూడా చాలా సంకుచితంగా జరిగిందని గుర్తు చేస్తుంటారు. ఐఏఎస్ పరీక్షల్లో యాప్టిట్యూడ్ సబ్జెక్ట్‌ను కలపటం వల్ల కొన్ని ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని కొందరు ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారని, కోట్లాది జీవితాలను ప్రభావితం చేసే విధాన నిర్ణయాలలో కీలక పాత్ర పోషించే సివిల్ సర్వెంట్లకు లాజిక్ అక్కర్లేదనటం ఎంత మూర్ఖత్వం అనే విషయం కూడా యోచించకుండా ఆరోజు వారు మాట్లాడారని చెబుతారు. చివరికి సివిల్స్‌కి ఆ సబ్జెక్ట్‌ని తీసేస్తే మరీ బాగుండదని మన్మోహన్ సింగ్ వారికి నచ్చచెప్పి, యాప్టిట్యూడ్ టెస్ట్ మార్కులు లెక్కల్లోకి రావని, క్వాలిఫై అయితే చాలని ఒప్పించారు. ఆ సమయంలో అంతర్జాతీయ పత్రిక 'ది ఎకానమిస్ట్' ఒక వ్యాసం రాస్తూ, భారతదేశంలో విద్యను బాగు చేయటానికి అక్కడి రాజకీయ వ్యవస్థ చూపుతున్న పరిష్కారం – మిగతావారి ప్రమాణాలను తగ్గించటం తప్ప అందరి ప్రమాణాలనూ పెంచటం కాదని (ఇప్పుడు ఆర్థిక అసమానతల విషయంలో కూడా కొందరు ఇలాగే వాదిస్తున్నారు) వ్యాఖ్యానించిందని జేపీ వివరించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనమండలిలో నిజాయితీగా సంక్షోభాన్ని ప్రస్తావించి, విద్యా వ్యవస్థను ఎలా బాగు చేయాలన్న ప్రశ్నను లేవనెత్తారని, అందుకు సమిష్టిగా కలసి పనిచేద్దామని ఆలోచనాపరులందరి సలహా, సూచనల్ని ఆహ్వానించారని జేపీ అభినందించారు. చట్టసభల్లో, అందులోనూ బహుశా అసెంబ్లీలో మొదటిసారి ఓ ముఖ్యమంత్రి ఇలా నిజాయతీగా మాట్లాడారన్నారు. రేవంత్ ప్రసంగాన్ని తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేయటమే కాకుండా, అప్పటికప్పుడు తెలంగాణలో విద్యను బాగుచేయటానికి అవసరమైన మార్పుల కోసం అదనపు ఖర్చు ప్రభుత్వానికి లేకుండా కీలక సంస్కరణల ఫ్రేమ్‌వర్క్‌తో ఒక నివేదికను రూపొందించి ఎఫ్‌డీఆర్ బృందంతో పాటు ముఖ్యమంత్రిని స్వయంగా కలిసి అందచేశారు. తమ తరంలో ప్రపంచస్థాయి ప్రముఖుల్ని తయారు చేసిన ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థ ఇప్పుడు ఎందుకు అధ్వాన్నంగా తయారైందో సోదాహరణంగా తెలియచెప్తూ, తాను ప్రతిపాదిస్తున్న సంస్కరణల్ని వివరించారు. ఈ సమావేశంలో విద్యా కమిషన్ సభ్యులు, కొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని తెలంగాణలో ప్రభుత్వ విద్యను బాగుచేయటానికి, ప్రతి బిడ్డకూ నాణ్యమైన పాఠశాల విద్య అందేలా చేయటానికి సమగ్ర విధానం తయారు చేయాలని విద్యా కమిషన్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. ✦

### *దేశవ్యాప్తంగా విద్యలో ఈ సంస్కరణలు అవసరం*

**దేశంలోని 37 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పాఠశాల విద్యలో తెలంగాణ 30-35 ర్యాంకులతో అధ్వాన్నంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారుగానీ, దాదాపు అన్ని రాష్ట్రాల్లో భారత్‌లో స్కూల్ చదువులు నాసిరకంగానే ఉన్నాయి. ఏటా వెలువడే 'అసర్' సర్వే, ప్రభుత్వం ఇటీవల స్వయంగా చేయిస్తున్న సర్వేలు ఈ విషయాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం మనదేశం పాల్గొన్న 'పీసా' అంతర్జాతీయ సర్వేలో భారత్ లోని అత్యుత్తమ పాఠశాలలు అనుకుంటున్నవాటినుంచి (తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్) విద్యార్థులను ఎంపిక చేసి పోటీపడ్డారు. అయితే మనకు 74 దేశాల్లో అట్టడుగు నుంచి రెండోస్థానం 73వ ర్యాంకు లభించింది. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా సర్కారీ పాఠశాలల్లో చేరే విద్యార్థుల శాతం తగ్గుతుందని ఇటీవల పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వం తెలిపింది. యూనియన్ ప్రభుత్వ డేటా ప్రకారం .. 2021-22 విద్యా సంవత్సరంతో పోలిస్తే 2023-24లో ప్రాథమిక స్థాయిలో చేరే విద్యార్థులు దాదాపు 8 శాతం దాకా తగ్గారు. ప్రయివేటులో చేరేవారి శాతం పెరు గుతున్నా, అలాగని అక్కడా పెద్ద గొప్పగా చదువురావటం లేదు. దేశంలోని పాఠశాలల్లో ప్రస్తుతం 24 కోట్లమందికి పైగా పిల్లలు చదువుతున్నారు. వారి కందే చదువు నాణ్యత మీద దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థిర త్వం ఆధారపడి ఉంది. కాబట్టి ఇప్పటికే పాఠశాల విద్య బాగుకి తన వంతు కృషిని శాయశక్తులా చేస్తున్న జేపీ నేతృత్వంలోని ఎఫ్ డీఆర్ బృందం అందించిన సంస్కరణల్ని దేశవ్యాప్తంగా అన్నీ రాష్ట్రా ల్లో అమలు చేయటం అవసరం. ఇందుకోసం ప్రభుత్వాలతో పాటు, సమాజం కూడా సంస్థలుగా, కుటుం బాలుగా, పౌరులుగా కలిసి వస్తుందని ఆశిద్దాం. భవిష్యత్ భారతానికి ఇది అందరి బాధ్యత.**

# చంద్రబాబు ప్రభుత్వ ఆరోగ్య విజన్, అపోలో గ్రూప్ 'హెల్త్ ఆఫ్ ది నేషన్'-అసలు పరిష్కారాలు

ఏప్రిల్‌లో ఒక దేశంగా భారత్‌కి, ఒక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి ఆరోగ్య రంగంలో కొంత కీలక సమాచారం, కొన్ని పెద్ద సమస్యలకు పరిష్కార ప్రయత్నాలు, సూచనలు వెలువడ్డాయి. ముందుగా సమాచారం చూద్దాం.

**హెల్త్ ఆఫ్ ది నేషన్**

మొత్తం దేశానికి సంబంధించి హెల్త్ ఆఫ్ ది నేషన్ - 2025 పేరుతో అపోలో ఆసుపత్రుల గ్రూప్ నివేదిక విడుదల చేసింది. వ్యాధులు రాకముందు నివారణ కోసం తమ వద్దకు గత అయిదేళ్లలో వచ్చిన సుమారు 25 లక్షలమందికి నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

**వాటిలో కొన్ని ముఖ్యాంశాలు..**

➡ మన దేశంలో కోట్లాదిమంది పైకి ఎలాంటి లక్షణాలూ పెద్దగా కనిపించని వ్యాధులతో బాధపడుతున్నారు.

ం వ్యాధి నివారణ కోసం ప్రివెంటివ్ హెల్త్ చెకప్స్ ఇటీవల 150 శాతం దాకా పెరగటం ప్రజల్లో ఆరోగ్యం పట్ల పెరిగిన చైతన్యానికి నిదర్శనమైనా, చేయాల్సింది చాలా ఉందని అర్థమవుతోంది.

➡ దేశ ప్రజల్లో ఫ్యాటీ లివర్ (కాలేయ కొవ్వు) ఆందోళనకర రీతిలో వృద్ధి చెందుతోంది. ఏకంగా 65 శాతం మంది ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. మొత్తం బాధితుల్లో మద్యం అలవాటు లేనివారు 85 శాతంమంది ఉన్నారు. ఇది ఆందోళనకరం.

➡ ఫ్యాటీ లివర్ మాత్రమే కాకుండా - దేశవ్యాప్తంగా ఇతర జీవనశైలి వ్యాధులు (ఎన్‌సీడీ) పెరుగుతున్నాయి.

➡ పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల్లో ఊబకాయం పెరుగుతోంది.

**అంకెలవారీగా...**

➡ నిశ్శబ్ద గుండె ప్రమాదాలు - 46%

➡ ప్రాథమిక పాఠశాల పిల్లల్లో ఊబకాయం - 8%

➡ కళాశాల విద్యార్థుల్లో అధిక బరువు - 28%

➡ మహిళలు, పురుషుల్లో హైపర్ టెన్షన్ - 26%

➡ డి-విటమిన్ లోపం - పురుషుల్లో 77%, మహిళల్లో 82 %

➡ మానసిక సమస్యలున్నవారు - 6%

➡ నిద్ర రుగ్మతలున్నవారు - 24%

➡ మధుమేహం సమస్య - 23%

**ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి ..**

ముఖ్యమంత్రి చంద్రబాబు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా




తెలియచేసిన వివరాలు ప్రకారం ... రాష్ట్రంలో అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నవారిలో 80% మంది ఎన్‌సీడీలతో సంబంధమున్న పది రకాల జబ్బులతో బాధపడుతున్నారు. వివరాల్ని మూడు విభాగాలుగా మూడు నివేదికల రూపంలో అందించారు.

రాష్ట్రంలో ఎన్‌సీడీ కేసులను గుర్తించేందుకు నవంబర్, 2024 నుంచి వైద్య ఆరోగ్య శాఖ సర్వే నిర్వహిస్తోంది. ఇప్పటికి మూడు సర్వేలు పూర్తయ్యాయి. వీటిల్లో భాగంగా, తొలుత ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి .. ప్రత్యేక ప్రశ్నావళి ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. అనుమానిత లక్షణాలున్నవారికి స్థానిక వైద్యాధికారి మరోసారి పరీక్షలు చేసి నిర్ధారించారు.

ఎన్‌సీడీ-03లోపాటు, గత 5 సంవత్సరాల్లో ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స పొందినవారి సమాచారాన్ని క్రోడీకరించి 'వ్యాధుల భారం' నివేదికను, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు కింద చికిత్స పొందినవారి వివరాలతో మరో నివేదికను ముఖ్యమంత్రి వెలువరించి వివరాలు జిల్లాలవారీగా తెలియచేశారు.

**1)ఎన్‌సీడీ-03 నివేదిక**

➡ ఎన్‌సీడీ-03 సర్వేలో ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో అధిక రక్తపోటు (బీపీ)తో బాధపడుతున్నవారిలో పురుషుల కంటే మహిళలే అధికసంఖ్యలో ఉన్నారు. కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు, పని ఒత్తిడి, ఇతర కారణాలతో మహిళలు అధిక సంఖ్యలో రక్తపోటుకు గురవుతున్నారు.

➡ బీపీ సహా మధుమేహంతో బాధపడేవారిలోనూ మహిళలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

మొత్తం ఏపీ జనాభాలో 18 ఏళ్లు దాటిన వారు - 4.1 కోట్లు

➡ ఎన్సీడీ పరీక్షలు చేయించుకున్న వారు - 2.15 కోట్లు (52.43%)

➡ బీపీ (నిర్ధారణ) - 19.78 లక్షలు (9.2)

➡ మధుమేహం - 11.13 లక్షలు (5.1%)

➡ రెండు జబ్బులు ఉన్నవారు - 20.78 లక్షలు (9.6%)

➡ చికిత్స పొందుతున్నవారు - బీపీ - 14.29 లక్షలు

➡ చికిత్స తీసుకుంటున్నవారు - మధుమేహం - 8.76 లక్షలు

➡ రెండూ - 12.80 లక్షలు

**బీపీ : 19,78,699 (బాధితులు)**

➡మహిళలు - 11,40,772

➡పురుషులు - 8,37,927

➡అత్యధిక వయసు - 50 - 54 (2,92,488)

➡తొలి మూడు జిల్లాలు - కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్

➡చివరి 3 జిల్లాలు - అల్లూరి, మన్యం, శ్రీ సత్యసాయి

**మధుమేహం : 11.13,963 (రోగులు)**

➡ పురుషులు - 5,61,196

➡ మహిళలు - 5,52,767

➡ అత్యధిక వయసు 50-54 ఏళ్లు (1,97,609)

➡ రోగులు ఎక్కువగా ఉన్న తొలి 3 జిల్లాలు - గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్

➡ చివరి మూడు జిల్లాలు - అల్లూరి, మన్యం, శ్రీ సత్యసాయి

**బీపీ సహా మధుమేహం : 20,78,999**

➡ పురుషులు - 9,54,707

➡ స్త్రీలు - 11,22,800

➡ అత్యధిక వయసు 60 - 64 (3,59,175)

➡ తొలి 3 జిల్లాలు - ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా

➡ చివరి 3 జిల్లాలు - అల్లూరి, మన్యం, శ్రీ సత్యసాయి

**2) ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందినవారి గణాంకాల ఆధారంగా వ్యాధుల తీవ్రత**

➡ బీపీ (గుండె జబ్బులు, ఇతరాలు) : 18-22%

➡ మధుమేహం, ఇతర : 12-15%

➡ శ్వాసకోశ సమస్యలు (నిమోనియా, ఆస్తమా) : 10 - 12%

➡ అంటువ్యాధులు (టీబీ, డయేరియా) : 9-11%

➡ దీర్ఘకాల మూత్రపిండాల వ్యాధులు : 6-8%

➡ క్యాన్సర్ (బ్రెస్ట్, సర్వైకల్, ఇతర) : 5-7%

➡ మాతా శిశు అనారోగ్యాలు (రక్తహీనత, పోషకాహార లోపం) 5-6%

➡ మానసిక సమస్యలు (మద్యం, ఇతర) : 4-5%

➡ కీటక జనిత ( డెంగీ, మలేరియా) వ్యాధులు : 3-5%

➡ రోడ్డు ప్రమాద బాధితులు : 3-4%

**3)ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా**

ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా 2022 - 23 నుంచి 2024 - 25 మధ్య ఆసుపత్రుల్లో చికిత్స పొందిన కేసుల్లో గుండె జబ్బులవి ఎక్కువగా ఉన్నాయి. ఆ తరువాత క్యాన్సర్ కేసులు ఉన్నాయి. బాధితుల్లో మహిళలు అధిక సంఖ్యలో ఉన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం వంటి కారణాలు గుండెజబ్బులకు దోహదం చేస్తున్నాయి.

➡ క్యాన్సర్లలో రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్లు వీటిలో ఎక్కువగా ఉంటున్నాయి. చాలామంది బాధితులు క్యాన్సర్ మూడు, నాలుగు దశల్లో ఉన్నప్పుడు ఆస్పత్రులకు వస్తున్నారు. ఇతర అనారోగ్యాలతో ఆస్పత్రులకు వెళ్లినప్పుడు క్యాన్సర్ బయటపడుతోంది.

**ఏపీ ప్రభుత్వం పరిష్కారాలు ..**

వేగంగా పెరుగుతున్న ఈ ఆరోగ్య సమస్యలకీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపిన పరిష్కారాలు ముందుచూద్దాం. సంక్షోభాన్ని ఎదుర్కొనటానికి చంద్రబాబు ప్రకటించిన పరిష్కారాలు **స్థూలంగా ఇవీ ..**

☞ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోనూ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానం (పీపీపీ)లో కనీసం 100 నుంచి 300 పడకలతో మల్టీస్పెషాలిటీ లేదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు.

☞ ప్రస్తుతం 70 నియోజకవర్గాల్లో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు న్నాయి. మిగతా 105 చోట్ల ప్రాధాన్యక్రమంలో ఏర్పాటు చేస్తాం. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానంలో అవసరమైన రాయితీలు ప్రభుత్వం అందిస్తుంది. స్థలం రాయితీపై ఇవ్వటం, మారుమూల, వెనకబడిన ప్రాంతాల్లో ఏర్పాటయ్యే ఆస్పత్రులకు ఎక్కువ రాయితీలు, ఎన్టీఆర్ వైద్యసేవ కింద 50 శాతం రోగులను ఈ ఆస్పత్రులకు పంపటం. ఔట్ పేషెంట్లకీ ఈ పథకాన్ని వర్తింపజేయటం.

☞ చాలా జీవనశైలి వ్యాధుల్ని ముందే నివారించేందుకు, ఆస్ప త్రుల్లో రోజుల తరబడి గడపాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ లోనే వైద్య సలహాలు అందజేస్తూ రియల్ టైమ్‌లో పర్యవేక్షిం చేందుకు, ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స అందించేందుకు కార్యాచరణ.

☞ ఏపీ ప్రజల్ని ప్రధానంగా వేధిస్తున్న 10 వ్యాధుల్లో ప్రతిదానికీ దేశ విదేశాల్లో నిపుణులైన ప్రముఖుల్ని సలహాదారులుగా నియమించడం, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న అత్యుత్తమ వైద్యులకు ఇంచార్జి బాధ్యతలు, వారి ఆధ్వర్యంలో కమిటీల ఏర్పాటు, వాటి ద్వారా వ్యాధుల నివారణ, పర్యవేక్షణకు వ్యూహాల రూపకల్పన.

☞ బాల్యం నుంచి హెల్త్ కార్డులు రూపొందించి ట్రాక్ చేయటం. ప్రత్యేక యాప్ ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య సలహాలు అందించటం. స్పెషలిస్ట్ వైద్యుల సలహాలు అవసరమైనప్పుడు ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌లోనూ అపాయింట్‌మెంట్ల ఏర్పాటు, ఏఐ పరిజ్ఞానంతో సిబ్బందికి నిరంతర శిక్షణ.

☞ మొబైల్ వాహనాల ద్వారా ఇంటి దగ్గరే 20-25 రకాల

ఆరోగ్య పరీక్షలు చేసి, ఆ డేటాను క్లౌడ్‌కు అనుసంధానం చేయటం. వైద్యులు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆన్‌లైన్‌లో ఆ సమాచారం తీసుకోవచ్చు.

☞ పిల్లలకు పాఠశాల స్థాయి నుంచి మెరుగైన ఆహారపు అలవాట్లు, మంచి జీవన విధానాన్ని సిలబస్‌గా చేర్చటం.

**అపోలో హాస్పిటల్స్ గ్రూప్ పరిష్కారాలు ..**

☞ ప్రతి ఇంట్లోనూ ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. వ్యాధులు వచ్చాక, ఆస్పత్రిలో చికిత్స తీసుకోవటం కంటే .... వ్యాధుల నివారణకు అధిక ప్రాధాన్యతనివ్వాలి.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిష్కారాల విశ్లేషణ - విధానపరంగా అవసరమైన కొన్ని మార్పులు

ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం అందించటం ప్రభుత్వ మౌలిక బాధ్యత కాబట్టి .. ప్రధానంగా ఏపీ విధానపర అంశం గురించి మాట్లాడుకుందాం.

దేశంలోని మిగతా ప్రాంతాల్లోలా జీవనశైలి వ్యాధుల భారం ఆంధ్రప్రదేశ్‌లో కూడా పెరుగుతోంది. అదేవిధంగా చికిత్సలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతూ అందుబాటులో సత్ఫలితాలనిస్తోంది. ఈ అంశాన్ని చంద్రబాబు ప్రభుత్వం స్పష్టంగా, సరిగా గుర్తించి పరిష్కారాల్లో భాగంచేసింది. అయితే ప్రపంచ దేశాల అనుభవాల్ని, మన దేశంలో మెరుగైన పద్ధతుల్ని, వైద్య ఆరోగ్య రంగ మౌలిక తాత్వికతను లోతుగా, ముందుచూపుతో అధ్యయనం చేయకుండా హడావుడిగా, హెడ్ లైన్స్ ఆర్భాటపు నిర్ణయాలు ఎక్కువ తీసుకున్నట్లు కనిపిస్తుంది.

**లోపాల్లో ప్రధానమైనవి**

ఆస్పత్రి వైద్యానికి - ప్రాథమిక ఆరోగ్యానికి, ఔట్ పేషెంట్లకి తేడాను గుర్తించకపోవటం, ఆరోగ్య విధానాన్ని సమగ్రంగా, వివిధ స్థాయిల్లో అనుసంధానంతో కాకుండా ముక్కలుగా చూడ టం, మొబైల్ వైద్యాన్ని కీలక పరిష్కారంలో రోజువారీ భాగం చేయటం, ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యాన్ని స్పష్టంగా నిర్వచించకపోవటం, పోటీ, ఎంపిక స్వేచ్ఛకు అవకాశం లేకపోవటం.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంలో మల్టీస్పెషాలిటీ లేదా సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తామని చంద్రబాబు ప్రకటించారు. అంటే, తృతీయస్థాయి వైద్యానికి సంబంధించినది. ఇక్కడ ఖర్చుకు తగ్గ ఫలితం పెద్దగా లభించకపోగా, ఖర్చు నిరంతరం సాంకేతికతల ఆవిష్కరణలకు అనుగుణంగా పెరుగుతుంటుంది. ఇక్కడ ప్రభుత్వాస్పత్రుల్లో పడకల సంఖ్యను తగినంతగా ఏర్పాటు చేయటం, ఉన్న ఆస్పత్రులను ఆధునీకరించటం అవసరమే కానీ అది పూర్తిగా ప్రభుత్వపరంగా జరగకుంటే, ఖజానాపై బిల్లుల నిర్వహణ భారం విపరీతమవుతుంది. ఉదాహరణకి, ఇటీవల ఓ కార్పొరేట్ గ్రూప్ ఆస్పత్రుల్లో 4,000 అదనపు పడకల కోసం రూ.12,000 కోట్లతో ప్రతిపాదనలు ప్రకటించింది. అంటే ఒక్కో బెడ్‌కి రూ.3 కోట్లు. వడ్డీ, నిర్వహణ

> **వైద్య పరీక్షల ల్యాబ్‌లు మినహా ప్రభుత్వ రంగంలో సేవలు సంతృప్తికరంగా, సరైన దిశలో ఉన్న దాఖలాలు లేవు. ముఖ్యంగా ఆరోగ్యంలో కీలకమైన ప్రాథమిక వైద్య వ్యవస్థ అసమర్థంగా ఉంది. ప్రజల విశ్వసనీయత కోల్పో యింది. అక్కడ పనిచేయటానికి డాక్టర్లు ముందుకు రావటంలేదు, వచ్చినవారు సమయానికి వచ్చి సక్రమంగా విధులు నిర్వహించటం లేదని ఆరోపణ లొస్తున్నాయి.**

వ్యయం కలిపి మొత్తం రోగుల నుంచే వసూలు చేస్తారు. ఇప్పుడు పీపీపీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించి, క్రమంగా వాటిపై ప్రయివేటు పెత్తనం పెరిగితే ఖర్చు తడిసి మోపెడవుతుంది. ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం ఏమిటో, ఎంతవరకో, ఖర్చు పెరగకుండా చర్యలేమిటో తృతీయ స్థాయి ఆస్పత్రి వైద్యానికి సంబంధించి ముఖ్యమంత్రి వివరించలేదు. పారిశుద్ధ్య నిర్వహణ, సేవలు వంటి అంశాలకు ప్రయివేటు రంగం పరిమితమైతే ఫర్వాలేదు. ప్రభుత్వ విధానపర బాధ్యతల్లో ప్రయివేటు రంగం చొరబడితేనే సమస్య. ఆ స్పష్టత కొరవడింది.

అదేవిధంగా ఎన్టీఆర్ వైద్యసేవల్లో 50 శాతం ఈ రకమైన ఆస్పత్రులకు కేటాయిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. అంతవరకూ అభ్యంతరం లేదు. కానీ ఔట్‌పేషెంట్లకూ దీన్ని వర్తింపచేస్తామనటంతో గందరగోళం ఉంది. ప్రపంచంలో ఏ ఎన్నదగ్గ దేశంలోనైనా ఔట్‌పేషెంట్లు అందరూ ఆస్పత్రులకు వెళ్లే విధానాన్ని అమలు చేయరు. ఆ అవసరం కూడా లేదు.

సాధారణ జ్వరమొస్తే గాంధీ, ఉస్మానియా, మంగళగిరి ఎయిమ్స్ వంటివాటికి వెళ్తుంటే అక్కడ నిజంగా ఆస్పత్రి చికిత్సలు అవసరమైనవారికి సరైన సేవలు అందవు. చంద్రబాబు నిరంతరం మెచ్చుకునే దేశాలను, ప్రస్తుతం వైద్యం సహా కొన్ని రంగాల్లో ఏపీ ప్రభుత్వం కలిసి పనిచేస్తున్న గేట్స్ ఫౌండేషన్ వారిని అడగండి. ఏ దేశంలోనైనా మన వద్ద జరుగుతున్నట్లు ఔట్ పేషంట్లు ఆస్పత్రులకు క్యూ కడతారా? ఓపీ ప్రాథమిక వైద్యస్థాయికే పరిమితం. కానీ ప్రాథమిక, నివారణ వైద్యం ఏపీలో అధ్వాన్నంగా ఉంది. ప్రాథమిక వైద్య, ఆరోగ్య భవనాన్నీ ప్రయివేటు ఆస్పత్రుల్ని, ల్యాబ్ పరీక్షల సదుపాయాల్ని 108, 104 వాహనాల్ని, ఏటా మార్కెట్‌లోకి వస్తున్న ఎంబీబీఎస్ ఉత్తీర్ణుల సంఖ్యను చూసి, రాష్ట్రంలో వైద్యవ్యవస్థ పటిష్టంగా ఉందని, అధికారులతో ఇటీవలి సమావేశంలో గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు వ్యాఖ్యానించి ఉండవచ్చు. (గేట్స్ ఫౌండేషన్ బృందం వ్యాఖ్య గురించి మీడియాలో వార్తలొచ్చాయి). కానీ వైద్య పరీక్షల ల్యాబ్‌లు మినహా ప్రభుత్వ రంగంలో సేవలు సంతృప్తికరంగా, సరైన దిశలో ఉన్న దాఖలాలు లేవు. ముఖ్యంగా ఆరోగ్యంలో

కీలకమైన ప్రాథమిక వైద్య వ్యవస్థ అసమర్థంగా ఉంది. ప్రజల విశ్వసనీయత కోల్పోయింది. అక్కడ పనిచేయటానికి డాక్టర్లు ముందుకు రావటంలేదు, వచ్చినవారు సమయానికి వచ్చి సక్రమంగా విధులు నిర్వహించటం లేదని నిత్యం ఆరోపణ లొస్తున్నాయి. స్వతంత్రం వచ్చిన సమయంలో ఎవరో దాత లిచ్చిన స్థలాల్లోనో, ప్రభుత్వ భూమిలోనో నిర్మించిన భవనాలు, జీతాలిచ్చి డాక్టర్లను నియమించుకునే వ్యవస్థ ఘోరంగా విఫలమ య్యాయని ఈ 77 ఏళ్ల అనుభవాలు రుజువు చేస్తున్నాయి. ఎక్కడో తప్ప ప్రాథమిక స్థాయిలోని సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు సమర్థంగా సేవలందిస్తున్న దాఖలాలు లేవని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ జరిపిన సురాజ్యయాత్ర, ఇతర పర్యటనల్లో తేలింది. కొన్నిచోట్ల జేపీ స్వయంగా పీహెచ్‌సీల తాళాలు తెరిపించిన సందర్భాలున్నాయి. దీనివల్ల రాష్ట్రంలోని జనాభా ఇప్పటికీ ఎక్కువగా నివసిస్తున్న గ్రామీణ ప్రాంతాలు భారీ మూల్యం చెల్లిస్తున్నాయి. ప్రాథమిక స్థాయిలో చూడాల్సిన, వడపోయాల్సిన ఔట్ పేషెంట్లు రవాణా ఖర్చులు భరిస్తూ దూరంగా ఉన్న ప్రభుత్వాస్పత్రులకో, ఊళ్లోనే ఉన్న ఎటువంటి శిక్షణా లేని నాటు వైద్యుల వద్దకు పోతున్నారు. లేదంటే ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లి జేబులో డబ్బులు వదిలించుకుంటున్నారు. ఇక్కడ ఒక్క ఇంగిత జ్ఞానపు ప్రశ్న – గేట్స్ ఫౌండేషన్ వారు చెబుతున్నట్లు రాష్ట్రంలో వైద్య వ్యవస్థ పటిష్టంగా ఉన్నట్లయితే, చంద్రబాబు చెప్పినట్లు ఇప్పటిలాగా ఔట్‌పేషెంట్లంతా కూడా నేరుగా ఆస్పత్రులకే వెళ్లటం వల్ల ఫలితాలు ఉన్నట్లయితే, ఆంధ్రప్రదేశ్‌లో కేవలం అనారోగ్యం వల్ల, ఖర్చుల వల్ల ఏటా 26 లక్షలమంది ఎందుకు పేదరికంలోకి జారిపోతున్నారు, ఎందుకు తాత్కాలిక ఉపశమనం తప్ప నిజమైన ఆరోగ్యం అందటం లేదు?

అదేమాదిరిగా, నివారణ వైద్యానికి గేట్స్ ఫౌండేషన్, టాటా గ్రూప్ వంటి సంస్థల ఏఐ ఆధారిత సాంకేతికతల సాయం తీసుకోవటం, మొబైల్ వైద్య పరీక్షలు, ప్రధానంగా గుర్తించిన 10 ఎన్‌సీడీల్లో ఒక్కోదానిపై ఒక్కో నిపుణుడైన డాక్టర్ ఆధ్వర్యంలో కమిటీల ఏర్పాటు ప్రతిపాదనల్ని చంద్రబాబు చేశారు. నివారణ కీలకమైన వైద్యంలో, జీవనశైలి వ్యాధుల నియంత్రణ అవసరమైన తరుణంలో ఇవి పరిమిత ఫలితాల్ని మాత్రమే ఇస్తాయి. క్రమ పర్యవేక్షణ లేకుంటే ఎప్పుడు ఏ రూపం దాలుస్తాయో చెప్పలేం. కొవిడ్ లాంటి మహమ్మారులు విజృంభించవనుకోలేం. కాబట్టి నివారణ, ప్రాథమిక – ద్వితీయ – తృతీయ స్థాయి వైద్యాల మధ్య పటిష్ట అనుసంధానం ఉంటేనే, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో సమకూరుతుంది. సాంకేతికత వినియోగం పూర్తిస్థాయిలో సద్వినియోగమవుతుంది. అటువంటి సమగ్రత, సమన్వయం, సంధానం చంద్రబాబు ప్రతిపాదనలో కొరవడింది. అందరూ ఉంటారు, అన్నీ ఉంటాయి .. కానీ ఎవరూ బాధ్యత తీసుకోరు,




జవాబుదారీతనం ఉండదు, పైస్థాయిలో ఆస్పత్రి చికిత్స కోసం వెళ్లటానికి హైరానా పడాల్సివుంటుంది. ఈవేళ నాణ్యమైన వైద్యసేవలకు పెద్ద అవరోధంగా ఉన్న డాక్టర్, రోగి మధ్య సమాచారం అంతరం, పరస్పర అపనమ్మకం కొనసాగే అవకాశముంది.

ఆహార అలవాట్లలో జాగ్రతపడటం, ప్రాథమిక స్థాయి నుండి పటిష్ట ఏర్పాట్లు, క్రమశిక్షణతో జీవించడం, ఉప్పు, తీపి వంటి రుచుల్ని తగ్గించుకోవటం, మద్యపానానికి దూరంగా ఉండటం, సాంకేతిక వినియోగం, ఇంటికే వెళ్లి మొబైల్ పద్ధతిలో వైద్య పరీక్షలు నిర్వహించటం .. ఇవన్నీ వినటానికి బాగుంటాయిగానీ, పౌష్టికాహారం, విద్య అధ్వాన్నంగా ఉండి, పనిచేసేవారిలో అత్యధికులు అసంఘటిత, అల్పాదాయ రంగాల్లో కొనసాగుతూ, మద్యాన్ని ప్రభుత్వాలు ఆదాయమార్గంగా చేసుకున్నప్పుడు నివారణ వైద్యాన్ని వీటికే వదిలేయలేం. అందులోనూ ఆరోగ్య రంగంపై జీవనశైలి వ్యాధుల భారం అధికంగా ఉన్నప్పుడు, జనాభాలో ఎక్కువగా ఉన్న యువతలోనూ పెరుగుతున్నప్పుడు ముందు జాగ్రత్త అంచనాలతో పాటు నెలవారీగానో, నిర్ణీత కాలవ్యవధితోనో నిరంతర వైద్య పర్యవేక్షణ అవసరం. ఇందుకోసం ఒక స్థిరమైన, జవాబుదారీతనమున్న పైస్థాయిలోని వైద్యానికి అనుసంధానమై ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను ప్రాథమిక స్థాయిలో ఏర్పాటు చేయటం అవసరం. వ్యవస్థ అని ఎందుకు స్పష్టంగా చెప్పాల్సివస్తుందంటే, గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ప్రతిపాదించిన ఆరోగ్య నమూనాలోని ఫ్యామిలీ డాక్టర్ పేరును తీసుకున్నారుగానీ, మిగతావేమీ చేయకుండా, వ్యవస్థీకృత ఏర్పాటు లేకుండా మొబైల్ పద్ధతిలో అమలుచేశారు. దానివల్ల ఆరోగ్య రంగంలో చేసిన తక్కువ నిధుల వినియోగం కూడా వృధా అయింది. కాబట్టి ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను నిర్మించి, ఆ పరిధిలోకి సాంకేతికను, రోగుల వ్యాధుల వివరాల డేటాబేస్ తయారీని ప్రాథమిక వైద్య పరీక్షల ల్యాబ్‌లను, సెంట్రలైజ్డ్‌గా సమీకరించిన జనరిక్ ఔషధాల దుకాణాలను తీసుకురావాలి. ఔట్ పేషెంట్ వైద్యాన్ని పూర్తిగా ఫ్యామిలీ డాక్టర్‌కే పరిమితం చేయాలి. అత్యవసర కేసుల్లో మినహాయించి, ఫ్యామిలీ డాక్టర్ సిఫార్సు చేస్తేనే ఆస్పత్రులకు వెళ్లే నిబంధన ఏర్పాటు చేయాలి.

అదేవిధంగా ఆస్పత్రిలో రోగి, కుటుంబసభ్యులు హైరానా పడకుండా, ఫ్యామిలీ డాక్టరే అక్కడి వైద్య బృందంతో అన్నిరకాలుగా సమ న్వయం చేసుకుంటారు.

**ఇక చంద్రబాబు ప్రతిపాదనల్లో మరో లోపం – డాక్టర్ల మధ్య పోటీ, రోగులకు ఎంపిక చేసుకునే స్వేచ్ఛ, అవకాశం లేకపోవటం.**

గ్రామాల మధ్యే కాస్త కూడలిలా ఉండే, వ్యాపార లావాదేవీలు, ప్రజల ఇతరత్రా అవసరాలు తీర్చే ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని చిన్న పట్టణాలుగా అభివృద్ధి చేసి, ప్రతిచోటా ఓ 10–15 మంది ఫ్యామిలీ డాక్టర్‌ల బృందంతో ప్రాథమిక ఆరోగ్య సెంటర్‌ను మందుల వరకూ అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేస్తే, వారిలో తమకు నమ్మకమున్న డాక్టర్‌ని రోగులు ఎంచుకుంటారు. ఎంత ఎక్కువమంది రోగులు వస్తే ఆ డాక్టర్‌కి ఫీజు రూపంలో అంత ఆదాయాన్ని రోగికి ఇంత చొప్పున ప్రభుత్వమే చెల్లిస్తుంది. ల్యాబ్ పరీక్షలు, మందులు ఉచితంగా ఇస్తుంది. దీనివల్ల నాణ్యమైన వైద్య సేవలు అన్ని గ్రామాలకు కూడా అందుతాయి. ఎంబీబీఎస్ క్వాలిఫికేషన్ గల నిజమైన ఫ్యామిలీ డాక్టర్‌కి లక్ష, రెండు లక్షల ఆదాయం నెలవారీ లభిస్తుంది. అవసరమనుకుంటే, కొంత ఆదాయ పరిమితి దాటిన రోగులు ఫీజులో నామమాత్రపు వాటా చెల్లించే ఏర్పాటు చేయవచ్చు.

ఎన్టీఆర్ వైద్య సేవను ప్రయివేటు ఆస్పత్రులకు కేటాయించానికి అభ్యంతరం లేదుగానీ, ఆ పథకాన్ని, ఆయుష్మాన్ భారత్‌ని కేవలం ద్వితీయ స్థాయి వైద్యానికి పరిమితం చేయాలి. అంటే, నివారణ వైద్యాన్ని అందించే ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ, వ్యాధి తీవ్రత బాగా ఎక్కువ ఉంటే చికిత్స అందించే ఖరీదైన తృతీయ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యం పూర్తిగా ప్రభుత్వం చేతుల్లో ఉండాలి. చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో చెప్పినట్లు అక్కడ ప్రయివేటు భాగస్వామ్యం ఉంటే ఖర్చులు విపరీతమై కొత్త సాంకేతికతలకు అనుగుణంగా నిరంతరం పెరుగుతూనే ఉంటాయి. అయితే, తృతీయ స్థాయి బోధనా స్పత్రుల్లో వ్యక్తిగత స్థాయిలో ప్రయివేటు వైద్య నిపుణుల సేవల్ని కొంత చెల్లించి ఒప్పందంతో వినియోగించుకోవచ్చు. అదేవిధంగా, ద్వితీయ స్థాయిలో, అంటే, ఎన్టీఆర్ వైద్యసేవ లేదా ఆయుష్మాన్ భారత్ వంటివి అమలు చేయటంలో ప్రయివేట్ నర్సింగ్ హోంలతో, ప్రభుత్వ కమ్యూనిటీ, ఏరియా ఆస్పత్రులకు పోటీ ఉండేలా చేయాలి.

ఇలా పోటీ, ఎంపిక స్వేచ్ఛ ఉండబట్టే ఆరోగ్యశ్రీ విజయవం తమైంది. ఢిల్లీలో గతంలో 'ఆప్' ప్రభుత్వం మొహల్లా క్లినిక్‌లను ప్రవేశపెట్టినా, ఆ ఏరియాకు వచ్చిన డాక్టర్ల వద్ద రోగులు వైద్య సేవలు తీసుకోవటం తప్ప, తమకు నమ్మకమున్న డాక్టర్‌ని ఎంపిక చేసుకునే అవకాశం లేదు. ఒక బృందంలో నైపుణ్యమున్న డాక్టర్లున్నా .. ఎప్పుడు, ఎవరు ఏ ఏరియాకి వెళ్తారో తెలియదు. అధికారులు చెప్పిన చోటికి డాక్టర్లు వెళ్లాల్సి ఉంటుంది. దీనివల్ల ప్రతిసారీ ప్రజలకు సంతృప్తి కలిగే స్థాయి వైద్యం అందే అవకాశాలుండవు. మొహల్లా క్లినిక్ లు ఎక్కువ చోట్ల ఆదరణ కోల్పోవటానికి ఇది ఒక ప్రధాన కారణం.

**పూర్తి ఉచితంతో సమస్య**

అదేవిధంగా సాధ్యమైనంత ఎక్కువకాలం బతకాలని, జీవితాన్ని ఆస్వాదించాలని కోరుకోవటం మనిషి సహజ నైజం. దీర్ఘాయుష్షు కోసం, మరణాన్ని జయించటం కోసం మానవాళి యుగ యుగాలుగా పోరాడుతూనే ఉంది. ప్రాచీన కాలంలో చక్రవర్తులు ,నియంతలు, రాజకీయ నాయకులు, 21వ శతాబ్దంలో పలువురు బిలియనీర్ల వరకు మృత్యుంజయులవ్వాలని ఎంలో ఖరీదైన ప్రయత్నాలు చేయటం, చేస్తుండటం తెలిసిందే. వారిలా ఖర్చు పెట్టలేకపోవచ్చుగానీ, చిరంజీవిగా బతకాలని ఆశించని వారు ఆధునిక కాల, సాధారణ ప్రజల్లో కూడా దాదాపు ఉండరు. దీనర్థం, వారంతా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి వీలైనంత ప్రాధాన్యత ఇస్తారని, కానీ పేదరికం, అవిద్య, అధ్వాన్న పాలనతో దుర్భర ప్రజారోగ్యం, కాలుష్యం వంటి కారణాల వల్ల అనేకమందికి ఇప్పటికీ ఆరోగ్యాన్ని కాపాడుకోవటం కష్టంగా ఉంది. వారిలో ఆరోగ్య స్పృహ ఉండటమే తక్కువ. వనరులున్నా, వ్యసనాలు, ఇతర బలహీనతలతో ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటున్నవారిని కూడా మినహాయిస్తే .. మానవ నైజం లోని మరో కోణానికి అద్దం పట్టేవాళ్లు ఇటీవల గణనీయ సంఖ్యలో కనిపిస్తున్నారు. బ్రిటన్ ఉదాహరణ నేపథ్యంలో ఈ విషయాన్ని చెప్పుకోవాలి. ఆ దేశంలోని ఆరోగ్య విధానం ప్రపంచ ప్రసిద్ధం. రెండో ప్రపంచ యుద్ధంతో దారుణంగా దెబ్బతిన్నా, అందరికీ ఉచితంగా, నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్)ని 1948లోనే బ్రిటన్ ప్రారంభించింది. ఆ దేశానికి వచ్చే పర్యాటకులకు కూడా ఈ సేవల్ని ఉచితంగా అందిస్తారు. ఎన్‌హెచ్‌ఎస్ లేకుండా తన జీవితాన్ని, ఆవిష్కరణల్ని ఊహించుకోలేనని ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ చెబుతుండేవారు. మన దేశంలో జీతాలు పెంచమని డాక్టర్లు సమ్మె చేస్తే, పెద్దగా పట్టించుకోం. చెప్పాలంటే, వ్యతిరేకిస్తాం. కానీ బ్రిటన్‌లో జీతాలు పెంచాలన్న డాక్టర్ల డిమాండ్‌ను 97% ప్రజానీకం మద్దతిచ్చాయి ఎన్‌హెచ్‌ఎస్‌కి అంత ఆదరణ ఉంది. మన దేశంలో ఆరోగ్య రంగానికి జీడీపీలో 1.3%దాకా మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేస్తుంటే బ్రిటన్‌లో 9% దాకా ఖర్చు పెడుతున్నారు. అయినా బ్రిటన్ ఆరోగ్య సేవల నాణ్యతలో .. 167 దేశాల్లో 34వ ర్యాంకు ఉంది. మన గురించి చెప్పనక్కర్లేదు. కానీ 'ఇది కదా సరైన ఆరోగ్య వ్యవస్థ' అనిపించేలా ఉండే ఎన్‌హెచ్‌ఎస్‌ను అమలు చేస్తున్న బ్రిటన్ … ఫలితాల్లో 33 దేశాల ఆవల ఎందుకు ఉందన్న సందేహం కూడా కలుగకమానదు. ఇందుకు చెప్పే వివిధ ప్రధాన కారణాల్లో ఒకటి – పైన చెప్పుకున్న మానవ నైజానికి సంబంధించినది. ఎలాగూ ప్రభుత్వం నా ఆరోగ్యాన్ని

ఉచితంగా నాణ్యమైన చికిత్సతో బాగుచేస్తుంది కాబట్టి, ఇష్టారాజ్యం బతికేయవచ్చు. సుఖాలను ఆస్వాదించటం పేరుతో తాగి తందనాలాడొచ్చు. అలాంటి పనులు వీలైనన్ని చేయొచ్చు అనే వ్యవహారశైలి. ఇలా నివారించదగ్గ అనారోగ్యాన్ని సృష్టించుకుని ప్రభుత్వం మీద అనవసర భారం వేయటం, నిజంగా వైద్య సేవలు అవసరమైనవారికి డాక్టర్ల అపాయింట్ మెంట్‌లో ఆలస్యం జరిగేలా చేయటం వంటివి ఎన్‌హెచ్ఎస్ సేవల నాణ్యతను తగ్గిస్తున్నాయి. వనరుల వృధాని పెంచు తున్నాయి. దీనికి తోడు పోటీతత్వం కొరవడటం, ఈ లొసుగుల మధ్య అవినీతి ఆరోపణలు. ఈ లోపాల్ని 1948 కాలంలో ఎన్‌హెచ్ఎస్ నిర్మాతలు ఊహించి కూడా ఉండరు.

కాబట్టి ప్రపంచ అనుభవాలు, ముఖ్యంగా బ్రిటన్ నమూనా నుంచి పాఠం నేర్చుకుని పూర్తి ఉచితంగా కాకుండా, పౌరులు కూడా పెద్ద భారం లేకుండా ఎంతోకొంత డబ్బు తమ వైద్య ఆరోగ్య సంరక్షణకి కేటాయించేలా, ప్రతి నెలా, లేకుంటే ఏదోక నిర్ణీత కాలవ్యవధిలో ప్రభుత్వానికి జమ చేసేలా ఏర్పాటు చేయటం మంచిది. డబ్బు చెల్లించటం వల్ల ప్రజల్లో బాధ్యత పెరగటంతో పాటు సేవల లోపాలపై ప్రశ్నించగలుగుతారు.

వాటన్నిటినీ వికేంద్రీకృతంగా, సమర్థంగా పర్యవేక్షించేందుకు తగిన ఆథార్టీలను జవాబుదారీతనంతో ఏర్పాటు చేయాలి తప్ప తాత్కాలిక ధోరణితో, పూర్తిగా సాంకేతికత మీద ఆధారపడి వదిలేయకూడదు. విద్య కంటే ఆరోగ్య రంగాన్ని బాగు చేయటం మౌలికంగా తేలిక. కానీ విద్యలాగే, ఆరోగ్యంలో కూడా నూతన ఆవిష్కరణలు వస్తూనే ఉంటాయి. పర్యవేక్షణ, జవాబుదారీతనం, సమీక్ష, పరిశోధన వంటివాటికి పటిష్ట ఏర్పాట్లు లేకుంటే, ఎప్పటికప్పుడు వైద్య సేవల్ని ఆధునీకరించి, ఆచరణ సాధ్యమైన ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి తేవటం కష్టమవుతుంది.

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందాలంటే .. ఈ చర్యలన్నిటితోపాటు ప్రజారోగ్యంలో భాగమైన పారిశుద్ధ్యం, రక్షిత తాగునీరు, కాలుష్యరహిత ఇంధనాలు, పర్యావరణ పరిరక్షణ మొదలైన అంశాలను సమర్థంగా నిర్వహించేలా స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలి.

**న్యూట్రిఫుల్ – అపోలో సూచనలు**

చంద్రబాబు చొరవతో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ న్యూట్రిఫుల్ ఆరోగ్య యాప్‌ని తీసుకొచ్చింది. అనారోగ్యం వచ్చాక చికిత్స కంటే, రాకుండా ఎలా జాగ్రత్త పడాలో సూచనల్ని నిపుణుల ద్వారా ఆ యాప్ అందిస్తుంది. ఆ స్ఫూర్తిని అపోలో ఆస్పత్రుల గ్రూప్ 'హెల్త్ ఆఫ్ ది నేషన్' నివేదికలో సూచించిన పరిష్కారం స్పష్టంగా పేర్కొంది. అపోలో సర్వే ప్రధానంగా నివారణ వైద్యానికి (ప్రివెంటివ్ కేర్), ఎన్‌సీడీలకు సంబంధించినది. ఆరోగ్య రంగంపై ఎన్‌సీడీల భారమే ఎక్కువ కాబట్టి, వారి సూచనను ఆస్పత్రి చికిత్సతో (ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యం) కూడిన ఆరోగ్య విధానంలో కూడా కీలకమైనదిగా భావించాలి. 'ప్రతి ఇంట్లోనూ ఆరోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి.



అందులోనూ నివారణ వైద్యం పట్ల అధిక శ్రద్ధ వహించాలి' అని సూచించింది.

కొన్ని వారాల క్రితం హార్వర్డ్ యూనివర్సిటీలో ఇచ్చిన ప్రసంగంలో అపోలో ఆస్పత్రుల గ్రూప్ వైస్ చైర్మన్ ఉపాసన ఈ సందేశాన్ని ఇంకా స్పష్టంగా వినిపించారు. **'ఇప్పుడు మనకు కావలసింది మరిన్ని ఆస్పత్రుల్ని కట్టటం కాదు. ప్రజలు ఆస్పత్రులకు రావాల్సిన అవసరం లేకుండా ఆరోగ్యాన్ని కాపాడుకునే ఏర్పాటు చేయటం".**

కాబట్టి, నివారణ, ప్రాథమిక స్థాయిలోనే ఎన్‌సీడీల నియం త్రణకు .. పోటీ, ఎంపిక స్వేచ్ఛ, పరస్పర అనుసంధానాలతో కూడిన, డాక్టర్, రోగి మధ్య విశ్వాసంతో నాణ్యమైన వైద్యాన్ని అందించే సమగ్ర, వ్యవస్థీకృత ఆరోగ్య విధానంలో కీలకమైన ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిని చంద్రబాబు ప్రవేశపెడతారని ఆశిద్దాం. ఆస్పత్రి వైద్యానికి సంబంధించి పైన పేర్కొన్న మిగిలిన అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటారని భావిద్దాం. డాక్టర్లకి కొరత లేదు, కొత్తగా మెడికల్ కాలేజీలు అక్కర్లేదు. ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల ఇప్పుడు సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను పూర్తిగా మూసివేయనక్కర్లేదు. టీకాలు వంటి వాటికి కోవిడ్ లాంటి మహమ్మారులు వచ్చినప్పుడు సమర్థంగా ఎదుర్కొనే చర్యల్లో భాగంగా వాటిని ఉపయోగించుకోవచ్చు. మెడికల్ టూరిజం, ఇన్సూరెన్స్ తీసుకునే స్తోమత ఉన్నవారి ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులు లాభపడుతుండవచ్చు. ఈ నేపథ్యం లో, పూర్తిస్థాయి ఆరోగ్య విధానాన్ని ప్రకటించే ముందు ఎఫ్ డీఆర్, లోక్‌సత్తా రూపొందించిన వైద్య ఆరోగ్య విధానం నమూనాని చంద్రబాబు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ఎన్టీఆర్‌లా ప్రజాధనం ప్రతి రూపాయినీ సద్వినియోగం చేయాలి.

తెలంగాణలో, జాతీయ స్థాయిలోనూ ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా సమగ్ర ఆరోగ్య విధానం అమలుకు జేపీ కృషి చేస్తున్నారు. పిల్లలకు పాఠశాల నుండి మెరుగైన ఆరోగ్యపు అలవాట్లు, మంచి జీవన విధానాన్ని సిలబస్‌గా చేయాలన్న ఏపీ ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలనిచ్చే, ప్రజల ఉత్పాదకతను పెంచే సమగ్ర ఆరోగ్య విధానాన్ని అమలు చేయటం ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలూ భారతదేశానికి ఆదర్శంగా నిలుస్తాయని ఆశిద్దాం. ✦

# అర్బన్ నక్సలిజం VS  నాణ్యమైన విద్య, అవకాశాలు



ప్రభుత్వాలు చట్టబద్ధపాలన సక్రమంగా అమలు చేయకుండా.. ఏదైనా తీవ్ర నేరం జరిగినప్పుడు మాత్రం కాల్చివేయండంటూ పోలీసులకు అనధికార ఉత్తర్వులు ఇస్తున్నాయని, విచారణ ప్రక్రియలేని తక్షణ న్యాయం ఎంత ప్రమాదకరమో గుర్తించకుండా సమాజం కూడా భావోద్వేగంతో చప్పట్లు కొడుతోందని ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ విమర్శ చేశారు. దేశంలో ఇప్పటికీ 80% మంది బిడ్డల భవిష్యత్తు పుట్టినప్పుడే నిర్ణయమై పోతోందని, వారిని పట్టించుకోకుండా భారత్ వెలిగి పోతుందనటం అవివేకమే అవుతుందన్నారు. మారు మూల గ్రామంలో జడ్పీ పాఠశాలలో తనకు సరైన చదువు అందకుండా, అవకాశం లభించకుండా ఉంటే .. ఆ పాపం, అన్యాయంపై కత్తి పట్టేవాడినేమోనని వ్యాఖ్యానించారు.

మార్టిర్స్ మెమోరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎంఎంఆర్ఐ) ఆధ్వర్యంలో 'రంగులు మారుతున్న అర్బన్ నక్సల్స్' అంశంపై హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలోని ప్రొఫెసర్ జి. రాంరెడ్డి దూరవిద్యా కేంద్రం ఆడిటోరియంలో జరిగిన సదస్సులో జేపీ మాట్లాడారు.

అన్నింటి కన్నా స్వేచ్ఛ ముఖ్యమని కొందరు, శాంతి భద్రతలు ప్రధానమని మరికొందరు, ఐక్యత కీలకమని ఇంకొందరు వాదిస్తున్నారని.. కానీ ఐక్యత, శాంతి లేని స్వేచ్ఛ అసలు స్వేచ్ఛే కాదని జేపీ స్పష్టం చేశారు. వామపక్ష తీవ్రవాదులు తుపాకీ పట్టుకుంటామంటే, ప్రభుత్వమూ పట్టుకుంటుందని, హింస ఏ రకంగానూ పరిష్కారం కాదన్నారు. తనకు అరుదుగా కోపం వచ్చినా అణచుకుంటానని, కానీ కొన్నేళ్ల క్రితం.. హింస లేకపోతే స్వేచ్ఛ ఎలా  అని సమాజంలో మేధావులుగా గుర్తింపు పొందినవారు, పత్రికా సంపాదకులు కూడా వాదిస్తుంటే లైవ్ షో లోనే ఆగ్రహాన్ని వ్యక్తం చేశానన్నారు. స్వతంత్రం వచ్చాక, ప్రజాస్వామ్యాన్ని ఎంచుకున్నాక హింసకు ఏమాత్రం తావు లేదని.. నిరసనలు, పోరాటాలు రాజ్యాంగ పద్ధతుల్లోనే సాగాలని నవంబర్ 25, 1949 న రాజ్యాంగసభలో బాబాసాహెబ్ అంబేద్కర్ స్పష్టంగా చెప్పారన్నారు. మూడవ తరగతి పిల్లల పాటి అవగాహన కూడా లేకుండా ఆ మేధావులు గందరగోళంతో మాట్లాడారన్నారు.

ఏ దేశాభివృద్ధికైనా ప్రజల ఆశావాదం కీలకమని, ఎంత కష్టపడ్డా పేదరికం నుంచి బయటపడలేం అనుకోవటం కన్నా దుర్భరం ఇంకోటి ఉండదని జేపీ పేర్కొన్నారు. దోపిడీని ఆపుతామని, సమ న్యాయాన్ని అందిస్తామనే విశ్వాసాన్ని ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థ, పౌర సమాజం ప్రజల్లో కల్పించినప్పుడు.. హింసావాదం వైపు వెళ్లేవారు, మొగ్గుచూపేవారు ఉండరన్నారు.

ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదాల్ని భయపెట్టి కాకుండా ప్రజలు స్వచ్ఛందంగా వ్యతిరేకించేందుకు ప్రభుత్వాలు మోరల్ హైగ్రౌండ్ ను ఆచరణలో చూపాలని జేపీ హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ డీజీపీ అరవింద్ రావు, విశ్రాంత ఐఏఎస్ దాసరి శ్రీనివాసులు, బీజేపీ నేత పేరాల శేఖర్ రావు, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ శ్యామ్ ప్రసాద్, ఎంఎంఆర్ఐ అధ్యక్షుడు మురళీ మనోహర్, కార్యదర్శి రంజిత్ మోహన్ తదితరులు మాట్లాడారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th MAY, 2025 Posting Date 15 &16th of every month



# ప్రజాధనం ప్రతి రూపాయీ సద్వినియోగం- 'అభివృద్ధి భారత్'కి అత్యవసరం



"20వ శతాబ్దంలో నిర్మించిన ప్రాజెక్టులన్నీ బాగానే ఉన్నాయి. 21 వ శతాబ్దంలో అధికారంలో ఉన్నవారికి, కాంట్రాక్టర్లకు లాభాలే ప్రధానం. తెలంగాణలో ఒకరు ENCగా ఉన్న కాలంలో 5 ప్రాజెక్టులు విఫలమయ్యాయి. ఎందువల్ల..? అని ఎవరూ అడగరు. సుందిళ్ల ప్రాజెక్ట్ నిర్మాణంలో లోపాలను నేను బహిరంగంగా ఓ సమావేశంలో ప్రస్తావిస్తే అధికారులకు నచ్చలేదు. 2022 లో గోదావరి వరదలు వచ్చినప్పుడు తెలంగాణలో అధ్యయనం చేశా. బ్యారేజీలు నిర్మించినప్పుడు వచ్చిన మట్టి, ఇతర పదార్థాలన్నీ నదిలోనే వేశారు. మట్టి అంతా నదిలోకి కొట్టుకొచ్చి పూడిక పెరిగిపోయింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో ముంపు ఏర్పడుతోంది" అని భారతదేశం గర్వించదగ్గ ప్రాజెక్టుల మెకానికల్ నిపుణుడు, ఏపీ జలవనరుల శాఖ సలహాదారు కన్నయ్య నాయుడు ఇటీవల అన్న మాటలు వింటే.. అపార ప్రజాధనం వృధా చేసిన కాళేశ్వరం ప్రాజెక్ట్ అసంబద్ధత, పోలవరం జాప్యం గుర్తురాక మానవు. దాంతోపాటు.. విదేశీయుడై ఉండికూడా కరవు, వరదల గోదావరి జిల్లాల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే ధవళేశ్వరం ఆనకట్టని 1845 లో ప్రారంభించి 1852 లో పూర్తిచేసి, భారతీయుల డబ్బును సద్వినియోగం చేసేందుకు ఇంజినీరింగ్ అద్భుతం సృష్టించిన ఆర్థర్ కాటన్, స్వతంత్రం వచ్చాక ఏపీ లోని ప్రకాశం జిల్లాలో ఎకరాకు కేవలం రూ. 2 వేలతో 2 లక్షల ఎకరాలకు ప్రజల భాగస్వామ్యంతో కలెక్టర్ గా సాగునీరు అందించి ప్రజాస్వామ్యం శక్తిని చాటిన ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కృషి స్ఫురించక మానవు. ఆర్థర్ కాటన్ పుట్టిన మే మాసంలోనే జన్మించిన ఇద్దరు తెలుగు ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎన్టీ రామారావు కూడా ఇదే తరహాలో ప్రజాధనాన్ని పవిత్రంగా భావిస్తూ ప్రతి రూపాయినీ సద్వినియోగం చేశారు.

కాటన్, వెంగళరావు, NTR లకు జయంతి నివాళులర్పిస్తూ.. సాగునీటి ప్రాజెక్టుల నుండి విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, చిన్న పట్టణాల అభివృద్ధి ఇలా ప్రతి రంగంలో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, జేపీ చెబుతున్నట్లు సంక్షేమం - అభివృద్ధి సమతూకంతో మరో పాతికేళ్లలో భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చుకుందాం.





*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.
Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.